




www.navabhoomi.in | epaper.navabhoomi.in | RNI No:TELTEL:82083

# నవభూమి

ANUKSHANAM

NAVABHOOMI TELUGU DAILY — నవతరం తెలుగు దినపత్రిక

Published from Hyderabad and Vijayawada

ఎడిటర్ : అజీద్

హైదరాబాద్ | 08 మంగళవారం | జులై 2025 | పేజీలు 12 | వెల: రూ.6 | సంపుటి:2 సంచిక: 293

Navabhoomi daily fallows..

Circulated at: Hyderabad, Rangareddy, Adilabad, Karimnagar,Warangal,Khammam, Nalgonda, Mahabubnagar,Medak, Nizamabad, Krishna,Guntur,Easrt Godavari, West Godavari,Prakasam, Nellore,Srikakulam,Vizianagaram,Visakhapatanam,Kurnool,Chittoor,Kadapa,and Anantapur







## బ్రిక్స్ దేశాలకు ట్రంప్ సుంకాల బెదిరింపు


◆ ఘాటుగా స్పందించిన చైనా



3

## దలైలామాకు భారతరత్న ఇవ్వాలి..

కేంద్రానికి ఎంపీల లేఖ



3

## 14 నుంచి అర్హులైన ప్రతి ఒక్కరికీ కొత్త రేషన్ కార్డులు



2

## సంపద కొందరిదే...



9

## రీల్స్ చేస్తుండగా.. ప్రమాదవశాత్తు బాలిక మృతి



2

## మొబైల్ యూజర్లకు షాక్.. మళ్లీ రీఛార్జ్ ధరల పెంపు

11

## హరిహర వీరమల్లు సినిమాకి కొత్త కష్టాలు..



12

# ట్రంప్ మళ్లీ దూకుడు

- బ్రిక్స్ అనుకూల దేశాలపై ట్రంప్ బిగ్ బాంబ్
- 10 శాతం అదనపు సుంకాలు..
- డాలర్‌పై ఆధారాన్ని తగ్గించాలన్న బ్రిక్స్ లక్ష్యం
- ట్రంప్ హెచ్చరిక: వాణిజ్య యుద్ధానికి నాంది?
- అంతర్జాతీయ వేదికపై కీలక ప్రకటన
- అమెరికా డాలర్ ఆధిపత్య రక్షణ ట్రంప్ లక్ష్యం
- ఇతర దేశాలకు సంకేతం పంపిన ట్రంప్
- ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై ప్రభావం

2



**న్యూఢిల్లీ-నవభూమి ప్రతినిధి**

బ్రిక్స్ కూటమికి మద్దతునిస్తూ "అమెరికా వ్యతిరేక విధానాలను" అనుసరించే దేశాలపై అదనంగా 10 శాతం టారిఫ్‌లను విధిస్తామని అమెరికా అధినేత డొనాల్డ్ ట్రంప్ తీవ్ర హెచ్చరిక చేశారు. బ్రెజిల్‌లోని రియో డీ జనీరోలో జరుగుతున్న బ్రిక్స్ సదస్సు నేపథ్యంలో ఈ కీలక ప్రకటన విడుదల చేశారు. ట్రంప్ తన అధికారిక ట్రూత్ సోషల్ ఖాతా ద్వారా ఈ నిర్ణయాన్ని వెల్లడించారు. అలాగే ఈ టారిఫ్‌లకు ఎటువంటి మినహాయింపులు ఉండవని స్పష్టం చేశారు.ట్రంప్ పన్నులు, సుంకాల విషయంలో మొదటి నుంచీ కఠినమైన వైఖరిని అవలంబిస్తూనే ఉన్నారు. అమెరికా ప్రయోజనాలకు వ్యతిరేకంగా వ్యవహరిస్తున్నాయని భావించే దేశాలపై ఆర్థికపరమైన చర్యలు తీసుకోవడానికి తాను ఎల్లప్పుడూ సిద్ధంగా ఉన్నానని ఆయన ఈ ప్రకటన ద్వారా మరోసారి చాటిచెప్పారు. ముఖ్యంగా ట్రంప్ బ్రిక్స్ కూటమిని "అమెరికా వ్యతిరేక" కూటమిగా అభివర్ణించారు. ఏ దేశమైనా బ్రిక్స్ అమెరికా వ్యతిరేక విధానాలకు మద్దతు ఇస్తే.. ఆ దేశాలపై అదనంగా 10 శాతం టారిఫ్‌లు విధిస్తామని స్పష్టం చేశారు. అయితే ట్రంప్ నుంచి బ్రిక్స్‌పై వచ్చిన మొదటి హెచ్చరికే కాదిది. గతంలోనూ బ్రిక్స్ దేశాలు ప్రపంచ వాణిజ్యంలో అమెరికా డాలర్ వాడకాన్ని తగ్గించాలని ఆలోచిస్తే 100 శాతం టారిఫ్‌లు విధిస్తానని కూడా ఆయన బెదిరించారు.ట్రంప్ హెచ్చరిక అంతర్జాతీయ వాణిజ్య సంబంధాలపై, ముఖ్యంగా బ్రిక్స్ దేశాలతో ఆర్థికంగా సంబంధాలు ఉన్న ఇతర దేశాలపై గణనీయమైన ప్రభావాన్ని చూపనుంది. ఇది ప్రపంచ వాణిజ్య యుద్ధానికి అడుగులు వేస్తుందా లేదా అనే చర్చకు కూడా దారితీసింది. బ్రిక్స్ కూటమిలో బ్రెజిల్, రష్యా, ఇండియా, చైనా, దక్షిణాఫ్రికా వంటి వర్ధమాన దేశాలు భాగస్వామ్యంగా ఉన్నాయి. ఈ కూటమి ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో తమ ప్రభావాన్ని పెంచుకోవాలని లక్ష్యంగా పెట్టుకుంది. ముఖ్యంగా

# పాక్‌పై మోదీ నిప్పులు

- భారత్, పాక్‌లను ఒకే త్రాసులో తూచలేం..
- బ్రిక్స్ సదస్సులో ప్రధాని మోదీ
- ఉగ్రవాదానికి మౌన మద్దతు కూడ అనర్థం
- భారత్‌కు మద్దతు తెలిపిన దేశాలకు మోదీ ధన్యవాదాలు
- బ్రిక్స్ దేశాల నుండి ఉగ్రదాడిపై ఘాటైన స్పందన
- రియో డీ జెనీరో డిక్లరేషన్ విడుదల - ఉగ్రాన్ని ఖండించిన బ్రిక్స్
- తీర్మానంలో పాకిస్థాన్ పేరుకు లేని ప్రస్తావనపై విమర్శలు

2



**న్యూఢిల్లీ-నవభూమి ప్రతినిధి**

బ్రెజిల్‌లో జరిగిన బ్రిక్స్ సదస్సులో ప్రధాని నరేంద్ర మోడీ పాకిస్థాన్‌పై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తున్నందుకు పాకిస్థాన్‌ను లక్ష్యంగా చేసుకుని.. జమ్మూకశ్మీర్‌లోని పహల్గాంలో జరిగిన ఉగ్రదాడిని ఖండించడంలో భారత్‌కు మద్దతు ఇచ్చిన దేశాలకు కృతజ్ఞతలు తెలిపారు. ఉగ్రవాదులపై ఆంక్షలు విధించడంలో వెనుకాడ´కూడదని.. ఉగ్రవాద బాధితులు, మద్దతుదారులను ఒకే త్రాసులో తూకం వేయలేమని పేర్కొన్నారు. ఉగ్రవాదాన్ని ఎదుర్కోవడానికి బ్రిక్స్ దేశాలు ఐక్యంగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఇటీవల జరిగిన పహల్గామ్ ఉగ్రదాడిని భారత ఆత్మ, గుర్తింపు, గౌరవంపై జరిగిన ప్రత్యక్ష దాడిగా ప్రధాని మోడీ అభివర్ణించారు. ఏప్రిల్ 22న జరిగిన ఉగ్రదాడి కేవలం భారత్‌కు మాత్రమే కాదు.. మానవాళికి ఎదురుదెబ్బ అని ప్రధాని స్పష్టం చేశారు. ఉగ్రవాదాన్ని ఖండించడం మన బాధ్యత అంటూ పేర్కొన్నారు. శాంతియుతమైన, సురక్షితమైన వాతావరణంలో మాత్రమే మానవాళి అభివృద్ధి సాధ్యమని.. ఈ లక్ష్యాన్ని నెరవేర్చడంలో బ్రిక్స్ చాలా కీలక పాత్ర పోషిస్తుందని వ్యాఖ్యానించారు. బ్రిక్స్ దేశాలు ఉమ్మడి సవాళ్లను ఎదుర్కోవడానికి ఐక్యంగా ఉండాలన్నారు. భారత్ అన్ని స్నేహపూర్వక దేశాలతో సహకారం, భాగస్వామ్యానికి కట్టుబడి ఉందని ప్రధాని మోడీ వ్యాఖ్యానించారు. బ్రిక్స్ కూటమి గ్లోబల్ సౌత్ అంచనాలను అందుకోవాలని అభిప్రాయపడ్డారు. భారత్ వ్యవసాయం, ఆరోగ్యం, పాలన విద్య వంటి రంగాలలో ఏఐని విస్తృతంగా ఉపయోగిస్తోందని ప్రధాని వెల్లడించారు. మోడీ కీలక ప్రసంగం.. బ్రిక్స్ సదస్సులో ప్రపంచ నాయకులను ఉద్దేశించి ప్రధాని మోడీ మాట్లాడుతూ.. "భారత్ ఉగ్రవాద బాధిత దేశమని.. పాకిస్థాన్ దానికి

# నిర్మలమ్మే బీజేపీ అధ్యక్షురాలు?

- ఆర్థిక, రక్షణ శాఖల పటిష్ఠ నాయకత్వం
- మోడీ-షాల నమ్మకస్తురాలిగా గుర్తింపు
- దక్షిణ భారత్‌కు చెందిన ప్రాతినిధ్యం
- 7 బడ్జెట్లు ప్రవేశపెట్టిన మహిళ
- మహిళా అధ్యక్షురాలితో ఓటర్ల ఆకర్షణ?
- 2029 ఎన్నికల లక్ష్యంతో వ్యూహాలు
- మహిళా కోటా - నిర్మలమ్మకు బలం

2



**న్యూఢిల్లీ-నవభూమి ప్రతినిధి**

కేంద్ర ఆర్థిక మంత్రిగా రక్షణ మంత్రిగా కీలక శాఖలను చూశారు నిర్మలా సీతారామన్. ఆమెకు ఎందుకు బీజేపీలో అంతటి ప్రాధాన్యత కలిగిన శాఖలు దక్కాయి అంటే ఆమె మోడీ అమిత్ షాల నమ్మకస్తురాలిగా గుర్తింపు పొందారు అని చెబుతారు. ఆమెకు ఆంగ్లం హిందీతో పాటు ఇతర భాషల మీద కూడా పట్టు ఉంది. అంతే కాదు డైనమిక్ లేడీగా గుర్తింపు ఉంది. ఇక ఆమె తమిళనాడుకు ఆడపడుచు. అలాగే తెలుగింటి కోడలు. ఇలా ఆమెకు ప్రాంతీయంగా కలసి వచ్చిన అంశాలు ఉన్నాయి. ఆమె ఒక మహిళగా ఏకంగా ఏడు సార్లు కేంద్ర బడ్జెట్ ని ప్రవేశపెట్టి రికార్డుని సాధించారు. ఇందిరాగాంధీ తరువాత కేంద్ర బడ్జెట్ ని ప్రవేశపెట్టిన రెండవ మహిళగా ఉన్నారు. డేరింగ్ గా ఆమె వ్యవహరిస్తారు. రక్షణ మంత్రిగా ఆమె అది నిరూపించుకున్నారు. ఒక్క మాటలో చెప్పాలీ అంటే మోడీ అమిత్ షాల ఏలుబడిలో నిర్మలమ్మకు బాగా ప్రాధాన్యత పెరిగింది. ఈ క్రమంలో జాతీయ బీజేపీ అధ్యక్ష పదవిని ఆమెకు ఇస్తారని ఢిల్లీ స్థాయిలో జోరుగా ప్రచారం సాగుతోంది. ఆమె వినయ విధేయ నిర్మలమ్మగా ఉన్నారని, పైగా దక్షిణ భారతానికి చెందిన వారు రెండు ముఖ్యమైన రాష్ట్రాలతో అనుబంధం కలిగిన వారుగా ఉన్నారని అంటున్నారు. బీజేపీ కూడా ఆమె సేవలను

# ప్రతి ఒక్కరూ రెండు మొక్కలు నాటాలి

- వనమహోత్సవాన్ని ఘనంగా ప్రారంభించిన ముఖ్యమంత్రి
- తల్లుల పేరుతో మొక్కలు పిల్లల చేత సంరక్షణ
- మహిళలను కోటీశ్వరులుగా తీర్చిదిద్దే లక్ష్యం
- ఆర్థిక బలోపేతమే గౌరవ స్థితికి మార్గం
- వచ్చే ఎన్నికల్లో మహిళలకు 60 ఎమ్మెల్యే సీట్లు: సీఎం రేవంత్ రెడ్డి
- పర్యావరణ పరిరక్షణతో అభివృద్ధి సాధ్యం

2



**హైదరాబాద్-నవభూమి బ్యూరో**

వ్యవసాయ యూనివర్సిటీ, జూలై 7: ప్రతి ఒక్కరూ విధిగా రెండు మొక్కలు నాటాలని, తల్లిలా వాటిని కాపాడడం వల్ల రాష్ట్రం పచ్చదనం సంతరించుకుంటుందని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. వనం పెంచితేనే మనం క్షేమంగా ఉండగలుగుతామని చెప్పారు. రాజేంద్రనగర్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం బొటానికల్ గార్డెన్స్‌లో రుద్రాక్ష మొక్కనాటి వనమహోత్సవం కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ రెండు మొక్కల చొప్పున నాటి వాటిని సంరక్షించాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. ప్రధానంగా తల్లులు మొక్కలు నాటితే తమ పిల్లలను చూసుకున్నట్లే జాగ్రత్తగా చూసుకుంటారని చెప్పారు. పిల్లలు కూడా తమ తల్లుల పేరుమీద మొక్కలు నాటి సంరక్షించాలన్నారు.


మహిళలను కోటీశ్వరులుగా తీర్చిదిద్దే కార్యక్రమం చేపట్టామని తెలిపారు. వెనుకబడిన తరగతులకు మహిళలను ఆర్థికంగా ఎదగడమే తమ లక్ష్యమన్నారు. మహిళలు ఆర్థికంగా రాణిస్తేనే వారికి ఇంటితోపాటు రాష్ట్రంలో, దేశంలో ప్రాధాన్యత ఉంటుందని వెల్లడించారు. వారు ఆత్మ

# జీరో క్రైం లక్ష్యం

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు

- రియల్ టైమ్ గవర్నెన్స్‌పై సీఎం చంద్రబాబు సమీక్ష
- ఏపిని జీరో క్రైమ్ స్టేట్‌గా మార్చే లక్ష్యంతో ఆదేశాలు
- క్రైమ్ హాట్‌స్పాట్లపై సీసీ కెమెరాలతో నిఘా ముమ్మరం
- ప్రైవేట్ కెమెరాల ఫుటేజ్ వినియోగానికి మార్గదర్శకాలు
- రాజకీయ ముసుగులో నేరాలపై కఠిన చర్యలకు సీఎం దృష్టి
- డ్రోన్లతో పర్యవేక్షణ పెంచాలని అధికారులకు ఆదేశం

2



**అమరావతి-నవభూమి ప్రతినిధి**

ఏపీలో రియల్ టైమ్ గవర్నెన్స్ పై సీఎం చంద్రబాబు ఇవాళ సమీక్ష నిర్వహించారు. ఇందులో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. అలాగే అధికారులకు పలు సూచనలు కూడా చేశారు. సాంకేతికత వినియోగంతో రాష్ట్రంలో శాంతిభద్రతల పర్యవేక్షణతో పాటు ప్రభుత్వ రికార్డుల నిర్వహణ, విపత్తుల వేళ తీసుకోవాల్సిన నిర్ణయాలు, నేరాల కట్టడి వంటి అంశాలపై సీఎం చంద్రబాబు అధికారులతో చర్చించారు. టెక్నాలజీ వాడకంతో రాష్ట్రాన్ని జీరో క్రైమ్ రేట్ స్టేట్ గా మార్చాలని సీఎం చంద్రబాబు అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. సాంకేతికత వినియోగతంతో శాంతి భద్రతల పర్యవేక్షణలో ఏపీని ఓ మోడల్ రాష్ట్రంగా మార్చాలన్నారు. సీసీ కెమెరాలతో క్రైమ్ హాట్ స్పాట్లపై నిరంతరం నిఘా పెట్టి నేరాల నియంత్రణ చేయాలని ఆదేశించారు. దీంతో పాటు ప్రైవేటు సీసీ కెమెరాల ఫుటేజి తీసుకునే విషయంలోనూ నిబంధనల్ని మార్చాలని ఆదేశాలు ఇచ్చారు. నేరాల నియంత్రణకు ప్రైవేటు కెమెరాలను కూడా వాడుకునేలా చూడాలని అధికారులకు చంద్రబాబు స్పష్టం చేశారు.

# స్థానికంలో గెలుపునకు మాస్టర్ ప్లాన్

- ఉమ్మడి 10 జిల్లాలకు కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జిల నియామకం
- జిల్లాల వారీగా సీనియర్ నేతలకు బాధ్యతల కేటాయింపు
- స్థానిక సంస్థల ఎన్నికల దృష్ట్యా పార్టీ బలోపేతం లక్ష్యం
- పార్టీ నిర్మాణానికి గ్రామ, మండల స్థాయి కమిటీల ఏర్పాట్లు
- అద్దంకి దయాకర్‌కు కరీంనగర్ ఇన్‌ఛార్జ్ బాధ్యత
- జగ్గారెడ్డికి హైదరాబాద్ పగ్గాలు
- పొన్నం ప్రభాకర్‌కు మెదక్ జిల్లా బాధ్యత
- అడ్లూరి లక్ష్మణ్ వరంగల్‌కు ఇన్‌ఛార్జ్‌గా నియామకం

2



**హైదరాబాద్-నవభూమి బ్యూరో**

తెలంగాణలోని ఉమ్మడి 10 జిల్లాలకు ఇన్‌ఛార్జిలను నియమిస్తూ కాంగ్రెస్ పార్టీ కీలక నిర్ణయం తీసుకుంది. జిల్లాల వారీగా పార్టీ బలోపేతమే లక్ష్యంగా ఒక్కో జిల్లాకు ఒక్కో

# మంత్రి పదవిపైనే గురి!

- దానం నాగేందర్ ఢిల్లీ పయనం
- ఏఐసీసీ అగ్రనేతలతో భేటీ అయ్యే అవకాశం
- జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో గెలుపు కాంగ్రెస్‌దేనని ధీమా
- సీఎం సవాల్‌ను స్వీకరించాలంటూ కేటీఆర్‌కు హితవు

2



**హైదరాబాద్-నవభూమిబ్యూరో**

తెలంగాణలో కేబినెట్ విస్తరణపై చర్చ ఊపందుకున్న వేళ, కాంగ్రెస్ సీనియర్ నేత, ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ మంత్రి పదవిపై గట్టిగా దృష్టి సారించినట్టు తెలుస్తోంది. ఇందులో భాగంగా ఆయన ఈరోజు ఢిల్లీకి పయనమయ్యారు. పార్టీ అధిష్టానాన్ని కలిసి కేబినెట్‌లో తనకు అవకాశం కల్పించాలని కోరనున్నట్లు సమాచారం. ఈ పర్యటన తెలంగాణ కాంగ్రెస్ వర్గాల్లో ఆసక్తిని రేపుతోంది.ఢిల్లీ పర్యటనకు ముందు, ఈ ఉదయం గాంధీభవన్‌లో దానం నాగేందర్ మీడియాతో మాట్లాడారు. తనకు మంత్రి పదవి వస్తుందా? లేదా? అనేది పార్టీ హైకమాండ్ నిర్ణయిస్తుందని ఆయన పేర్కొన్నారు. రాబోయే జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ పార్టీదే విజయమని ఆయన ధీమా వ్యక్తం చేశారు. సీఎం రేవంత్ రెడ్డి విసిరిన సవాల్‌ను మాజీ మంత్రి కేటీఆర్ స్వీకరించాలని, దానిని వక్రీకరించడం సరికాదని హితవు పలికారు.ఈ సందర్భంగా దానం బీజేపీపై కూడా విమర్శలు గుప్పించారు. బీజేపీ నేతలు తమ అంతర్గత

# వల్లభనేని వంశీకి అస్వస్థత

- శ్వాస సమస్యతో హుటాహుటిన ఆస్పత్రికి తరలింపు
- ప్రైవేట్ ఆసుపత్రిలో వైద్యులు చికిత్స అందిస్తున్నారు

2



**అమరావతి-నవభూమి ప్రతినిధి**

వైసీపీ నేత, గన్నవరం మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ మరోసారి తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు తలెత్తాయి. ఈ క్రమంలో ఆయన్ను హుటాహుటిన ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు కుటుంబ సభ్యులు. వైద్యులు ప్రస్తుతం ఆయనకు చికిత్స అందిస్తున్నారు.


వల్లభనేని వంశీ జూలై 2 బుధవారం రోజున విజయవాడ జైలు నుంచి విడుదలైన విషయం తెలిసిందే. ఇళ్ల పట్టాల కేసులో వల్లభనేని వంశీకి నూజివీడు కోర్టు బెయిల్ మంజూరు చేసింది. వివిధ కేసుల్లో దాదాపు 137 రోజులుగా వంశీ జైలులోనే ఉన్నారు. వల్లభనేని వంశీ విడుదల నేపథ్యంలో ఆయనకు స్వాగతం పలికేందుకు ఆయన సతీమణి పంకజ శ్రీ, వైఎస్సార్ సీపీ కృష్ణ జిల్లా అధ్యక్షుడు పేర్ని నాని, ఎమ్మెల్సీ తలశిల రఘురాం, మాజీ

నవ వార్త

## క్వాంటం కంప్యూటింగ్‌పై ఎంజీఐటీలో ఆఫ్‌లైన్ అటల్ ఎఫ్‌డీపీ ప్రారంభం



**హైదరాబాద్-నవభూమి:** హైదరాబాద్ గండిపేటలోని మహాత్మా గాంధీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎంజీఐటీ)కి %ూూూూ ఖీణూ% (ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్) మంజూరు చేయబడిందని కళాశాల ప్రిన్సిపల్ జి చంద్రమోహన్ రెడ్డి తెలిపారు. "క్వాంటం కంప్యూటింగ్ ఫౌండేషన్స్ అండ్ అప్లికేషన్స్" అనే అంశంపై ఈ ఆఫ్‌లైన్ ప్రోగ్రామ్ సోమవారం నుంచి ఈ నెల 12 వరకు ఒక వారం పాటు నిర్వహించ తలపెట్టినామని తెలిపారు. ఈ కార్యక్రమంలో 50 మంది పాల్గొనడానికి మాత్రమే అర్హత ఉండగా, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడులోని 25 విభిన్న కళాశాలల నుండి మొత్తం 99 మంది నమోదు చేసుకున్నారన్నారు. (ఆల్ ఇండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్) ఈ %ూూూూ ఖీణూ% కార్యక్రమాన్ని ఎంజీఐటీకి మంజూరు చేసిందని.. ఐక్యరాజ్యసమితి ఈ సంవత్సరాన్ని "క్వాంటం కంప్యూటింగ్ సంవత్సరం"గా ప్రకటించిందని అన్నారు. భారత ప్రభుత్వం కూడా 2025ను "క్వాంటం కంప్యూటింగ్ సంవత్సరం"గా ప్రకటించిన విషయం తెలిసిందే.క్వాంటం కంప్యూటింగ్: ఫౌండేషన్స్ అండ్ అప్లికేషన్స్" పై %ూూూూ ఖీణూ% ప్రారంభోత్సవ కార్యక్రమం సోమవారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో అర్హులంతా పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. జేఎన్‌టీయూహెచ్ డి ఏ పి డైరెక్టర్ డా. వి. కామక్షిప్రసాద్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. క్వాంటం కంప్యూటింగ్ ప్రాముఖ్యత, ప్రస్తుత కాలానికి అవసరమైన దాని అనువర్తనాల గురించి వివరించారు.



## డ్వాక్రా గ్రూపు సభ్యులకు శుభవార్త..

### ఆ పథకం 2029 వరకు పొడిగిస్తూ ఉత్తర్వులు జారీ..



**హైదరాబాద్-నవభూమి:** తెలంగాణ రాష్ట్రంలోని మహిళా స్వయం సహాయక బృందాల సభ్యులకు రాష్ట్ర ప్రభుత్వం ఒక శుభవార్త అందించింది. వారికి అందించే ప్రమాద బీమా పథకాన్ని 2029 సంవత్సరం వరకు పొడిగిస్తూ కీలక నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి ముఖ్య కార్యదర్శి ఎన్. శ్రీధర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ బీమా పథకం స్త్రీ నిధి ద్వారా అమలు జరుగుతుందని ఆయన స్పష్టం చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాతనే మహిళా స్వయం సహాయక బృందాలకు ఈ ప్రమాద బీమాను అందుబాటులోకి తెచ్చిన విషయం తెలిసిందే. ఈ ప్రమాద బీమా పథకం ప్రకారం.. ఏదైనా ప్రమాదవశాత్తు %ూం+% సభ్యులు మరణిస్తే, వారి కుటుంబానికి రూ. 10 లక్షల బీమా పరిహారం లభిస్తుంది.ఈ పథకం ద్వారా ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా 409 మంది కుటుంబాలకు బీమా సౌకర్యం కల్పించారు. ప్రభుత్వం అందించిన ఈ వెసులుబాటు, ఆర్థిక భద్రత కారణంగా మహిళలు స్వయం సహాయక బృందాల్లో చేరడానికి స్వచ్ఛందంగా ముందుకు వస్తున్నారు. ఇప్పటివరకు 1.67 లక్షల మంది కొత్త సభ్యులు ఈ బృందాల్లో చేరారు. సభ్యుల భద్రతను దృష్టిలో ఉంచుకొని, తెలంగాణ ప్రభుత్వం తాజాగా ప్రమాద బీమా పథకాన్ని మరో నాలుగేళ్ల పాటు పొడిగిస్తూ కొత్త జీవోను విడుదల చేసింది.మహిళా స్వయం సహాయక బృందాలు గ్రామీణ ప్రాంతాల్లో ఆర్థిక స్వావలంబనకు, సామాజిక సాధికారతకు కీలకమైన వేదికలు. ఈ బృందాల ద్వారా మహిళలు చిన్న తరహా వ్యాపారాలు ప్రారంభించడంతో పాటు.. చిన్న తరహా పొదుపును ప్రోత్సహిస్తున్నారు. తద్వారా తమ కుటుంబాలకు ఆర్థికంగా చేయూతనిస్తున్నారు. అయితే.. అనేక సందర్భాల్లో దురదృష్టవశాత్తు జరిగే ప్రమాదాలు వారి జీవితాలను, వారి కుటుంబాల భవిష్యత్తును అంధకారంలోకి నెట్టేస్తున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో కుటుంబాలకు అండగా నిలవాలనే ఉద్దేశంతోనే తెలంగాణ ప్రభుత్వం ఈ ప్రమాద బీమా పథకాన్ని ప్రవేశపెట్టింది.

**కుటుంబాలకు ఆర్థిక భద్రత..**

ఈ పథకం పొడిగింపు ద్వారా.. భవిష్యత్తులో కూడా %ూం+% సభ్యుల కుటుంబాలకు ఆర్థిక భద్రత లభిస్తుంది. ఇది మహిళలు మరింత ధైర్యంగా, ఆత్మవిశ్వాసంతో తమ ఆర్థిక కార్యకలాపాలను కొనసాగించడానికి ప్రోత్సాహాన్ని ఇస్తుంది. పథకం మహిళా సాధికారతకు, గ్రామీణాభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందనడంలో సందేహం లేదు. ఆర్థికంగా వెనుకబడిన మహిళలకు ఇది ఒక పెద్ద ఊరట అని చెప్పవచ్చు. దీని ద్వారా వారికి ఎలాంటి దురదృష్టకర సంఘటన జరిగినా.. వారి కుటుంబం ఆర్థిక కష్టాల్లో చిక్కుకోకుండా కొంతమేర రక్షణ లభిస్తుంది.

## షాకింగ్ వీడియో షేర్ చేసిన సజ్జనార్, పేరెంట్స్‌కు హెచ్చరిక



**హైదరాబాద్-నవభూమి:** సోషల్ మీడియా రీల్స్, షార్ట్ వీడియోల మోజులో యువత విచక్షణ కోల్పోతోంది. లైకులు, షేర్ల కోసం ప్రాణాలను పణంగా పెడుతూ.. ప్రమాదకరమైన పనులు చేస్తున్నారు. కొందరు యువకులు రైల్వే పట్టాలపై పడుకోవడం, వేగంగా వస్తున్న రైళ్ల ముందు సెల్ఫీలు దిగడం, ఎత్తైన భవనాల అంచుల్లో వేలాడటం వంటి ప్రాణాంతక విన్యాసాలకు పాల్పడుతున్నారు. చిన్న వయసులోనే గాడి తప్పుతూ.. వెర్రివేషాలు వేస్తున్నారు. తాజాగా టీజీఎస్ఆర్టీసీ (%ు+ూ=ుజ%) ఎండీ, సీనియర్ ఐపీఎస్ అధికారి సజ్జనార్ ఓ షాకింగ్ వీడియో ట్విట్టర్ ఎక్స్‌లో పోస్టు చేశారు.ఓ బాలుడు సోషల్ మీడియా రీల్స్ కోసం ట్రైన్ పట్టాల మధ్య అడ్డంగా పడుకొని ప్రమాదకర విన్యాసం చేశాడు. ఈ ఘటన ఎక్కడ జరిగిందో తెలియదు కానీ.. పదేళ్ల లోపే ఉండే బాలుడు ట్రైన్ రాకను గమనించి పట్టాల మధ్యలో పడుకున్నాడు. ట్రైన్ దగ్గరకు వచ్చినా ఎలాంటి బెరుకు లేకుండా అలాగే పడుకొని ఉన్నాడు. ట్రైన్ అలాగే వెళ్లిపోగా.. అతడి స్నేహితుడు వీడియో తీశాడు. ట్రైన్ వెళ్లిపోగానే.. ఏదో సాధించినట్లు గర్వంతో పైకి లేచి నిలబడతాడు. ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ కాగా.. సజ్జనార్ తన ఎక్స్ ఖాతాలో పోస్టు చేయటంతో పాటు తల్లిదండ్రులకు హెచ్చరికలు జారీ చేశారు.'చిన్నతనం నుంచే రీల్స్ పిచ్చి అనే మానసిక రోగానికి పిల్లలు ఇలా గురైతుండటం అత్యంత బాధాకరం. సోషల్ మీడియా మత్తులో పడి ఫేమస్ అయ్యేందుకు ఎంతటి ప్రమాదకర పనులు చేసేందుకైనా వెనుకాడటం లేదు. ఇలాంటి సోషల్ మీడియా వ్యసనాన్ని చూస్తూ వదిలేస్తే.. ఎంతో మంది పిల్లలు, యువకుల భవిష్యత్ ప్రశ్నార్థకంగా మారే ప్రమాదం ఉంది. సోషల్ మీడియాకి అడిక్ట్ అయిన పిల్లలకు కౌన్సెలింగ్ అనేది అత్యవసరం.ఈ వ్యసనం వల్ల జరిగే అనర్థాలను స్పష్టంగా వారికి తెలియజేయాల్సిన అవసరం ఉంది. అందుకు తల్లిదండ్రులు ప్రత్యేకంగా చొరవ తీసుకోవాలి. బిజీ లైఫ్ అంటూ పిల్లల పట్ల ఏమాత్రం అశ్రద్ధగా ఉండొద్దు. నిర్లక్ష్యంగా ఉంటే మీ పిల్లల జీవితాలను మీరే చేజేతులా నాశనం చేసిన వాళ్లుగా మిగిలిపోతారు. గుర్తుంచుకోండి.. నష్టం జరిగిన తర్వాత బాధపడితే లాభం ఉండదు. ముందే మేలుకోండి. పొంచి ఉన్న సోషల్ మీడియా ముప్పుకు మీ పిల్లలని దూరంగా ఉంచండి.' అని సజ్జనార్ ట్వీట్ చేశారు.యువత తమ శక్తిని నిర్మాణాత్మకమైన పనులకు, నైపుణ్యాలను పెంపొందించుకోవడానికి ఉపయోగించాలి. ప్రాణం విలువను గుర్తెరిగి.. సురక్షితమైన జీవనాన్ని గడపడమే నిజమైన సాహసమనే విషయాన్ని గుర్తుంచుకోవాలి.

## మంత్రి పదవిపైనే గురి!

**(1వపేజీ తరువాయి)**సమస్యలను ముందుగా పరిష్కరించుకుంటే మంచిదని సూచించారు. ఎందరో బీసీ నేతలు అధ్యక్ష పదవిని ఆశించినా, దానిని ఓసీ వర్గానికి కట్టబెట్టారని ఆరోపించారు. కేంద్రమంత్రి హోదాలో కిషన్ రెడ్డి, తాను గెలిచిన సికింద్రాబాద్‌కు ఏం చేశారో చెప్పాలని ప్రశ్నించారు. కేంద్రం ప్రకటించిన పసుపు బోర్డుకు కనీసం కార్యాలయం కూడా లేదని ఆయన విమర్శించారు.ప్రస్తుతం తెలంగాణ కేబినెట్‌లో కొన్ని మంత్రి పదవులు ఖాళీగా ఉన్నాయి. ఇటీవల మూడు పదవులను భర్తీ చేసిన అధిష్టానం, మిగిలిన వాటి భర్తీపై కసరత్తు చేస్తోంది. ఈసారి బీసీ, ఎస్సీ వర్గాలకు ప్రాధాన్యం ఇవ్వాలని ఆయా వర్గాల నేతలు కోరుతున్న నేపథ్యంలో, దానం ఢిల్లీ పర్యటనకు ప్రాధాన్యం ఏర్పడింది. అధిష్టానం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందోనని కాంగ్రెస్ శ్రేణులు ఉత్కంఠగా ఎదురుచూస్తున్నాయి.

## 14 నుంచి అర్హులైన ప్రతి ఒక్కరికీ కొత్త రేషన్ కార్డులు



**హైదరాబాద్-నవభూమి:** తెలంగాణ ప్రభుత్వం పేదల పక్షాన నిలబడుతూ.. రేషన్ కార్డుల పంపిణీ విషయంలో కీలక ప్రకటన చేసింది. ఈ నెల 14వ తేదీ నుంచి అర్హులైన ప్రతి ఒక్కరికీ కొత్త రేషన్ కార్డులు అందించబోతున్నట్లు మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ప్రకటించారు. గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో జరగని పనులు 18 నెలల తమ ఇందిరమ్మ ప్రభుత్వంలో చేసి చూపుతున్నామని ఆయన పేర్కొన్నారు. తమ ప్రభుత్వం ఒక్కో హామీని నిలబెట్టుకుంటూ ముందుకు వెళ్తుంటే.. ప్రతిపక్షాలు ఆరు గ్యారెంటీలపై అనవసరంగా విమర్శలు చేస్తున్నాయని ధ్వజమెత్తారు.నాగర్‌కర్నూల్ జిల్లాలో జరిగిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పత్రాల పంపిణీ కార్యక్రమంలో పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ.. గత బీఆర్ఎస్ ప్రభుత్వం కేవలం ఉపఎన్నికలు జరిగే నియోజకవర్గాల్లో మాత్రమే రేషన్ కార్డులు ఇచ్చిందని.. మిగిలిన చోట్ల ఒక్క కార్డు కూడా జారీ చేయలేదని తీవ్రంగా విమర్శించారు. అయితే.. ప్రస్తుత ఇందిరమ్మ ప్రభుత్వం కొత్త రేషన్ కార్డులు ఇవ్వడమే కాకుండా, పేదలందరికీ సన్నబియ్యం అందిస్తోందని.. ఇది ప్రజల దీవెనలతోనే సాధ్యమైందని చెప్పారు. ప్రభుత్వం చేస్తున్న మంచి కార్యక్రమాలను ప్రజలు మర్చిపోవద్దని, రాబోయే ఏ ఎన్నికలు వచ్చినా తమ ప్రభుత్వానికే ప్రజల ఆశీస్సులు ఉండాలని ఆయన కోరారు.మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి గత బీఆర్ఎస్ ప్రభుత్వంపై తీవ్ర ఆరోపణలు చేశారు. తమ స్వలాభం కోసం తెలంగాణ రైతుల హక్కులను కాలరాస్తూ.. పక్క రాష్ట్రంతో కుమ్మక్కైంది బీఆర్ఎస్, మాజీ ముఖ్యమంత్రి కేసీఆరేనని విమర్శించారు. కేవలం కమిషన్ల కోసమే ప్రాణహిత ప్రాజెక్టును పక్కన పెట్టి, కాళేశ్వరం ప్రాజెక్టును తెరపైకి తీసుకువచ్చారని.. వారి వేసిన పునాదే ఈనాటి బనకచర్ల ప్రాజెక్టు సమస్యలకు కారణమని పేర్కొన్నారు.తెలంగాణలో ఇందిరమ్మ ప్రభుత్వం ఉన్నంతవరకు ఒక్క చుక్క నీటి బొట్టును కూడా, తెలంగాణ రాష్ట్ర హక్కులను వదులుకునే ప్రసక్తే లేదని ఆయన స్పష్టం చేశారు. తమ ప్రభుత్వానికి చిత్తశుద్ధి, నిజాయితీ ఉన్నాయని.. తల తాకట్టు పెట్టైనా పేదలకు ఇచ్చిన హామీలను తప్పకుండా నెరవేరుస్తామన్నారు. కుల, మత, రాజకీయాలకు అతీతంగా అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లను అందిస్తున్నామని చెప్పారు. ప్రస్తుతం మొదటి విడత ఇందిరమ్మ ఇళ్లు పంపిణీ చేశామని.. మరో మూడు విడతలు కూడా ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వబోతున్నామని మంత్రి తెలిపారు. ఇళ్లు రాని వారు ఎవరూ నిరుత్సాహ పడవలసిన అవసరం లేదని భరోసా ఇచ్చారు.

## రీల్స్ చేస్తుండగా.. ప్రమాదవశాత్తు బాలిక మృతి



**సంగారెడ్డి-నవభూమి:** సోషల్ మీడియా రీల్స్ మోజులో పడి యువత ప్రాణాలు కోల్పోతున్నారు. సంగారెడ్డి జిల్లాలో తొమ్మిదేళ్ల చిన్నారి సహస్ర రీల్ చేస్తూ ప్రమాదవశాత్తు మరణించింది. ఫ్యానుకు తాడు బిగించుకొని రీల్ చేస్తుండగా ఊపిరాడక చనిపోయింది. ఇలాంటి ఘటనలు దేశవ్యాప్తంగా అనేకం జరుగుతున్నాయి. ప్రమాదకర విన్యాసాలు, సెల్ఫీలు దిగుతూ చాలామంది ప్రాణాలు కోల్పోతున్నారు. ఈ రీల్స్ వ్యసనంపై అవగాహన కల్పించాలని నిపుణులు సూచిస్తున్నారు.

ఇటీవల కాలంలో సోషల్ మీడియాలో రీల్స్ మోజు యువత ప్రాణాలను హరించివేస్తుంటే, ఇప్పుడు పసిపిల్లల ప్రాణాలకు కూడా ముప్పుగా మారింది. పటాన్‌చెరు మండలం చిట్కుల్ గ్రామంలో జరిగిన ఒక హృదయ విదారక ఘటన ఈ విషయాన్ని మరోసారి రుజువు చేసింది. కేవలం ఆట కోసం, తమకున్న సరదా కోసం, తొమ్మిదేళ్ల చిన్నారి తన ప్రాణాలు కోల్పోయింది. ఇది తల్లిదండ్రులకు జీవితాంతం వెంటాడే తీరని శోకాన్ని మిగిల్చింది.చిట్కుల్ గ్రామానికి చెందిన సహస్ర అనే తొమ్మిదేళ్ల చిన్నారి తన ఇంటిలో ఆడుకుంటున్న సమయంలో అనుకోని ప్రమాదానికి గురైంది. ఇంట్లో కరెంటు లేకపోవడంతో, సహస్ర తన తమ్ముడితో కలిసి ఫ్యానుకు టవల్ కట్టుకొని ఊయల ఊగుతున్నారు. దురదృష్టవశాత్తు.. ఫ్యాన్ స్విచ్ ఆన్‌లోనే ఉంది. ఊయల ఊగుతున్న సమయంలో ఒక్కసారిగా కరెంటు వచ్చింది. అంతే.. ఫ్యాన్ వేగంగా తిరగడంతో, టవల్ సహస్ర మెడకు బిగ్గరగా చుట్టుకుపోయింది. ఊపిరాడక ఆ చిన్నారి అక్కడికక్కడే కుప్పకూలి మృతి చెందింది.సహస్ర 4వ తరగతి చదువుతోంది. ఈ దారుణం జరిగిన సమయంలో ఇంట్లో తల్లిదండ్రులు లేకపోవడం మరింత విషాదకరం. వారు ఇంటికి తిరిగి వచ్చేసరికి తమ బిడ్డ విగతజీవిగా పడి ఉండటం చూసి తట్టుకోలేక గుండెలవిసేలా రోదించారు. వారి కన్నీరు, ఆర్తనాదాలు చూసేవారిని కదిలించాయి. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటనాస్థలికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.ఈ సంఘటన నేపథ్యంలో.. పిల్లలు ఇంట్లో ఉన్నప్పుడు తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని, వారిని ఒక కంట కనిపెడుతూ ఉండాలని పోలీసులు సూచించారు. చిన్నపిల్లలు ఇంట్లో చేసే పనులు, ఆడే ఆటల పట్ల తల్లిదండ్రులు ఎల్లప్పుడూ జాగ్రత్తగా ఉండాలి. ముఖ్యంగా విద్యుత్ ఉపకరణాలు, ఫ్యాన్లు, వైర్లు, పదునైన వస్తువుల పట్ల వారికి అవగాహన కల్పించాలి. ప్రమాదకరమైన ఆటల పట్ల హెచ్చరించాలన్నారు.ఇటీవలి కాలంలో దేశవ్యాప్తంగా ఇలాంటి ఘటనలు అనేకంగా వెలుగు చూస్తున్నాయి. బైకులపై, కార్ల పై ప్రమాదకరమైన విన్యాసాలు చేస్తూ రీల్స్ తీయబోయి యువకులు మృత్యువాత పడుతున్నారు. హైవేలపై అతివేగంగా వెళుతూ, ప్రమాదకరమైన మలుపుల వద్ద విన్యాసాలు చేయబోయి నియంత్రణ కోల్పోయి ప్రాణాలు కోల్పోయిన సంఘటనలు అనేకం. సాహసం పేరుతో ఎత్తైన భవనాల పై నుంచి, కొండల పైనుంచి దూకడం, లేదా ప్రమాదకరమైన ప్రదేశాల్లో నిలబడి సెల్ఫీలు, రీల్స్ తీసుకోవడం వల్ల జారిపడి మరణిస్తున్నారు. వీటితో పాటు.. అడవి జంతువులతో లేదా ప్రమాదకరమైన పాములతో రీల్స్ తీయబోయి వాటి దాడికి గురై ప్రాణాలు కోల్పోతున్నారు.నీటిలో దూకడం, ప్రమాదకరంగా ఈత కొట్టడం వంటివి చేస్తూ.. లోతు తెలియక లేదా ప్రవాహ వేగాన్ని అంచనా వేయలేక నీట మునిగి ప్రాణాలు కోల్పోయిన సంఘటనలున్నాయి. విద్యుత్ స్తంభాలపై, రైలు పట్టాలపై నిలబడి రీల్స్ చేయబోయి విద్యుదాఘాతానికి గురై లేదా రైలు ఢీకొని మరణించిన కేసులు కూడా ఉన్నాయి. ఎంతో కష్టపడి పెంచి, పెద్ద చేసిన పిల్లలు.. చిన్నపాటి సరదాలకు బలవుతున్నప్పుడు ఆ తల్లిదండ్రుల వేదన వర్ణనాతీతం.

## స్థానికంలో గెలుపునకు మాస్టర్ ప్లాన్

**(1వపేజీ తరువాయి)**స్థాయి కమిటీలు ఏర్పాటు చేసి విధివిధానాలను రూపొందించనున్నారు. రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలు రానున్న నేపథ్యంలో పార్టీని మరింత బలోపేతం చేసే దిశగా కాంగ్రెస్ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు రాష్ట్రంలోని 10 ఉమ్మడి జిల్లాలకు ఇన్‌ఛార్జిలను నియమించింది. పార్టీ సంస్థాగత నిర్మాణమే లక్ష్యంగా ఒక్కో జిల్లాకు సీనియర్ నేతను కేటాయించింది. జిల్లాల వారీగా ఇన్‌ఛార్జిల వివరాలు పరిశీలిస్తే.. జగ్గారెడ్డి-హైదరాబాద్, అద్దంకి దయాకర్- కరీంనగర్, పొన్నం ప్రభాకర్- మెదక్, అడ్లూరి లక్ష్మణ్- వరంగల్, సంపత్ కుమార్ - నల్గొండ, కుసుమ కుమార్ - మహబూబ్ నగర్ కు ఇన్‌ఛార్జిలుగా కాంగ్రెస్ హైకమాండ్ నియమించింది. ఉమ్మడి 10 జిల్లాలకు ఇన్‌చార్జిలను నియమించిన కాంగ్రెస్ పార్టీ వంశీ చంద్ రెడ్డి - ఖమ్మం సంపత్ కుమార్ - నల్గొండ అడ్లూరి లక్ష్మణ్ - వరంగల్ పొన్నం ప్రభాకర్ - మెదక్ జగ్గారెడ్డి - హైదరాబాద్ కుసుమకుమార్ - మహబూబ్ నగర్ అనిల్ యాదవ్ - ఆదిలాబాద్ అద్దంకి దయాకర్ - కరీంనగర్ అజ్మత్ హుసేన్ - పొన్నం ప్రభాకర్ - మెదక్ అడ్లూరి లక్ష్మణ్ - వరంగల్ అద్దంకిదయాకర్ - కరీంనగర్ జగ్గారెడ్డి - హైదరాబాద్ వంశీ చంద్ రెడ్డి - ఖమ్మం సంపత్ కుమార్ - నల్గొండ కుసుమకుమార్ - మహబూబ్ నగర్ అనిల్ యాదవ్ - ఆదిలాబాద్ అజ్మత్ హుస్సేన్ - నిజామాబాద్ శివసేనా రెడ్డి - రంగారెడ్డి మరోవైపు తెలంగాణలో సర్పంచ్ ఎన్నికల హడావిడి మొదలవుతోంది. బీసీ రిజర్వేషన్లు ఖరారు అయ్యాకనే స్థానిక సంస్థల ఎన్నికలను నిర్వహించాలని కాంగ్రెస్ నేతలు ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి కేసి వేణుగోపాల్ తో చెప్పినట్లు సమాచారం. ఇటీవల వేణుగోపాల్ తో జరిగిన భేటీలో స్థానిక ఎన్నికలు, బీసీలకు 42% రిజర్వేషన్లపై చర్చలు జరిగాయి. మరికొద్ది రోజుల్లో వీటిపై స్పష్టత రానుంది.

## ట్రంప్ మళ్లీ దూకుడు

**(1వపేజీ తరువాయి)**డాలర్‌పై ఆధార పడటాన్ని తగ్గించుకోవడానికి, స్థానిక కరెన్సీల్లో వాణిజ్యాన్ని ప్రోత్సహించడానికి ప్రయత్నిస్తున్న తరుణంలో ట్రంప్ ఈ హెచ్చరికలను జారీ చేశారు. ట్రంప్ ఈ వైఖరితో.. అమెరికా డాలర్ ఆధిపత్యాన్ని కాపాడటానికి, ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో అమెరికా స్థానాన్ని పటిష్టం చేయడానికి ప్రయత్నిస్తున్నారని విశ్లేషకులు భావిస్తున్నారు.బ్రిక్స్ సదస్సు వంటి కీలక అంతర్జాతీయ వేదిక జరుగుతున్న సమయంలో ఇలాంటి ప్రకటన వెలువడటం ప్రాధాన్యతను సంతరించుకుంది. ఇది బ్రిక్స్ సభ్య దేశాలకు, వారితో సంబంధాలు నెరుపుతున్న ఇతర దేశాలకు స్పష్టమైన సంకేతం పంపిందని చెప్పవచ్చు. ట్రంప్ ఈ నిర్ణయంతో, భవిష్యత్ అంతర్జాతీయ వాణిజ్య విధానాలపై తన దూకుడు వైఖరిని కొనసాగించడానికి సిద్ధంగా ఉన్నారని సూచిస్తున్నారు. రాబోయే రోజుల్లో ఈ టారిఫ్ హెచ్చరికలు ప్రపంచ ఆర్థిక రంగంపై ఎలాంటి ప్రభావం చూపుతాయో చూడాలి.

## జీరో క్రైం లక్ష్యం

**(1వపేజీ తరువాయి)**రాజకీయ ముసుగులో నేరాలకు పాల్పడే వారి విషయంలో టెక్నాలజీని మరింతగా వాడుకోవాలన్నారు. కొందరు తెలివిగా నేరాలు చేసి, దాన్ని ప్రభుత్వంపై నెడుతున్నారని, పోలీసులకు సహకరించని వ్యక్తులు, నేతల విషయంలో మరింత అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఇలాంటి వారి కోసం పబ్లిక్ సేఫ్టీ యాక్టు కింద వారి వద్ద నుంచి డేటా తీసుకునేలా చర్యలు చేపట్టాలన్నారు. వారిని ఆయా నేరాలకు బాధ్యులుగా చేసే అంశంపైనా దృష్టి పెట్టాలన్నారు. వివిధ రంగాల్లో డ్రోన్లు, సీసీ కెమెరాల వినియోగం పెంచాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. ఓర్వకల్లులో డ్రోన్ సిటీ పురోగతిపైనా అధికారుల నుంచి వివరాలు తీసుకున్నారు. అలాగే వివిధ ప్రభుత్వ శాఖలకు చెందిన రికార్డులు, డేటా భద్రతకు బ్లాక్ చెయిన్ టెక్నాలజీని వాడాలన్నారు. ప్రస్తుతం రెవెన్యూ రికార్డులను కూడా పూర్తి స్థాయి ప్రక్షాళన చేసి నూతన సాంకేతికతనే వినియోగించి భద్రంగా ఉండేలా చూడాలన్నారు.

## కాచిగూడ-యశ్వంత్‌పూర్ వందే భారత్ కోచ్‌లు 8 నుంచి 16కు పెంపు..

**కాచిగూడ-నవభూమి:** హైదరాబాద్-బెంగళూరు మధ్య ప్రయాణించే ప్రయాణికులకు గుడ్ న్యూస్ వచ్చేసింది. ఎందుకంటే కాచిగూడ నుంచి బెంగళూరులోని యశ్వంత్‌పూర్‌కువెళ్లే వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైలు ఇప్పుడు మరింత ఎక్కువ మంది ప్రయాణికుల కోసం సిద్ధమైంది. ఈ రైలు, ఇంతకు ముందు 8 కోచ్‌లతో 530 మంది ప్రయాణికుల సామర్థ్యంతో నడుస్తుండగా.. ఇప్పుడు 16 కోచ్‌లతో 1,128 మంది ప్రయాణికులను తీసుకెళ్లేలా అప్‌గ్రేడ్ అయింది. ఈ మార్పు జులై 10 నుంచి అమలులోకి వస్తుందని సౌత్ సెంట్రల్ రైల్వే అధికారులు తెలిపారు.

ఈ మార్పు ఎందుకు?:ఈ వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైలు ప్రారంభమైనప్పటి నుంచి కాచిగూడ, బెంగళూరు నగరాల మధ్య అత్యంత ప్రజాదరణ పొందిన రైలుగా నిలిచింది. ఈ ట్రైన్ ప్రతిసారి కూడా 100 శాతానికి పైగా ఆక్యుపెన్సీతో నడస్తోండటం విశేషం. అంటే అనేక మంది ఈ ట్రైన్లో సీట్ల కోసం వేచిచూస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రయాణికుల డిమాండ్ దృష్ట్యా భారతీయ రైల్వే, ఈ రైలుకు అదనంగా మరో 8 కోచ్‌లను చేర్చాలని నిర్ణయించింది. ప్రస్తుతం ఈ రైలు మొత్తం 16 కోచ్‌లతో మరింత సౌకర్యవంతంగా, మరింత మంది ప్రయాణికులకు సేవలు అందించనుంది.

కొత్త కోచ్‌ల వివరాలు:ఇంతకు ముందు ఈ రైలులో 1 ఎగ్జిక్యూటివ్ క్లాస్ కోచ్, 7 చైర్ కార్ కోచ్‌లు ఉండేవి. కానీ ఇప్పుడు, కొత్త మార్పులో 14 చైర్ కార్ కోచ్‌లు (1,024 మంది ప్రయాణికుల సామర్థ్యం), 2 ఎగ్జిక్యూటివ్ క్లాస్ కోచ్‌లు (104 మంది ప్రయాణికుల సామర్థ్యం ) ఉంటాయి. ఈ కొత్త మార్పుతో మొత్తం 1,128 మంది ప్రయాణికులు ఒకేసారి ప్రయాణించవచ్చు.

రెండు ఐటీ నగరాల మధ్య ప్రయాణం:హైదరాబాద్, బెంగళూరు ఈ రెండు నగరాలు భారతదేశంలోని ఐటీ రాజధానులుగా ప్రసిద్ధి గాంచాయి. ప్రధానంగా వ్యాపారవేత్తలు, ఉద్యోగులు, విద్యార్థులు, పర్యాటకులు ఈ రెండు నగరాల మధ్య తరచూ ప్రయాణిస్తుంటారు.

## పాక్‌పై మోదీ నిప్పులు

**(1వపేజీ తరువాయి)**మద్దతు దారు అని.. కాబట్టి బాధితులు, మద్దతుదారులను ఒక స్థాయిలో తూచలేమని ప్రధాని మోదీ స్పష్టం చేశారు. వ్యక్తిగత లేదా రాజకీయ లాభాల కోసం ఉగ్రవాదం వ్యాప్తికి వ్యతిరేకంగా మాట్లాడని లేదా చర్యలు తీసుకోని వారిని కూడా ఆయన పరోక్షంగా ప్రస్తావించారు. ఉగ్రవాదులకు మౌన సమ్మతి ఇవ్వడం ఆమోదయోగ్యం కాదని ఎత్తి చూపారు. రియో డి జనీరో డిక్లరేషన్: బ్రిక్స్ కూటమి దేశాలు 'రియో డి జనీరో డిక్లరేషన్' పేరుతో సంయుక్త ప్రకటనను చేశాయి. ఈ ప్రకటన 2025 ఏప్రిల్ 22న జరిగిన పహల్గాం ఉగ్రదాడిని తీవ్రంగా ఖండిచింది. ఉగ్రవాదం ఏ రూపంలో ఉన్నా, దాని ప్రేరణ ఏదైనా, ఎప్పుడైనా, ఎక్కడైనా, ఎవరు పాల్పడినా అద నేరమేనని, అన్యాయమేనని తీవ్రంగా ఖండించింది. సరిహద్దులు దాటి వచ్చే ఉగ్రవాదు లను, ఉగ్రవాదానికి నిధులు సమకూర్చడాన్ని, వారికి సురక్షిత స్థావరాలు కల్పించడాన్ని కలిసికట్టుగా ఎదుర్కొంటామని బ్రిక్స్ దేశాలు సంయుక్తంగా ప్రకటించాయి. బ్రిక్స్ 2026 సదస్సుకు ఆతిథ్యం ఇవ్వనున్న భారత్ భారతదేశం 2026లో బ్రిక్స్ సదస్సును నిర్వహించనుంది, ఇది అంతర్జాతీయ స్థాయిలో ఉగ్రవాదంపై తన నిబద్ధతను, సహకారాన్ని మరింత బలోపేతం చేసుకోవడానికి ఒక అవకాశంగా నిలుస్తుంది.

## ప్రతి ఒక్కరూ రెండు మొక్కలు నాటాలి

**(1వపేజీ తరువాయి)**గౌరవంతో రాణిస్తే రాష్ట్రం అన్ని రంగాలలో అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో మంత్రి కొండ సురేఖ, స్థానిక ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్, నాగర్ కర్నూల్ఎంపీ మల్లు రవి తదితరులు పాల్గొని మొక్కలు నాటారు. యూనివర్సిటీలోని అధికారులు స్థానిక ప్రజాప్రతినిధులు విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొని ఇతర ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున మహిళలను తరలించారు.

వచ్చే ఎన్నికల్లో మహిళలకు 60 ఎమ్మెల్యే సీట్లు: సీఎం రేవంత్ రెడ్డి తీసుకుంటానని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. త్వరలో అసెంబ్లీ ఎన్నికల్లోనూ మహిళా రిజర్వేషన్ రాబోతోందని వెల్లడించారు. ఇందిరమ్మ రాజ్యంలో ఆడ బిడ్డలు ఆత్మగౌరవంతో నిలబడేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. అన్ని రంగాల్లో ఆడబిడ్డలను ముందు భాగాన నిలపాలని ప్రయత్నిస్తున్నామని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. రాజేంద్రనగర్‌లోని వ్యవసాయ వర్సిటీలో "వన మహోత్సవం" కార్యక్రమాన్ని ప్రారంభించిన అనంతరం సీఎం రేవంత్ మాట్లాడారు.

కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని.. పట్టణ ప్రాంతాల్లో మహిళలు కూడా మహిళా సంఘాల్లో చేరాలని సూచించారు. ఈ ఏడాది మహిళా సంఘాలకు రూ.21 వేల కోట్లు రుణాలు అందించామన్నారు. మహిళలను ప్రోత్సహిస్తూ మా ప్రభుత్వం ముందుకు వెళుతోందన్నారు. సోలార్ ప్లాంట్ల ఏర్పాటు, ప్రభుత్వ పాఠశాలల నిర్వహణ బాధ్యతను ఆడబిడ్డలకు అప్పగించామని సీఎం చెప్పారు. ఆర్టీసీలో మహిళలకు ఆర్టీసీలో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించడమే కాదు.. ఆర్టీసీకి వెయ్యి బస్సులను అద్దెకు ఇచ్చేలా ప్రోత్సహించి వారిని బస్సులకు యజమానులను చేశామన్నారు. హైటెక్ సిటీలో విప్రో, మైక్రోసాఫ్ట్ సంస్థలు ఉండేచోట మహిళా సంఘాలు తయారు చేసిన వస్తువులను మార్కెటింగ్ చేసుకునే సదుపాయం కల్పించామని ముఖ్యమంత్రి వెల్లడించారు.

వనమే మనం... మనమే వనం అని పెద్దలు చెప్పారని.. ప్రకృతిని మనం కాపాడితే ప్రకృతి మనల్ని కాపాడుతుందని సీఎం వ్యాఖ్యానించారు. ఈ ఏడాది 18 కోట్ల మొక్కలు నాటాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందన్నారు. అమ్మ పేరుతో ఒక మొక్కను నాటాలని ప్రధాని పిలుపునిచ్చారని.. అమ్మలు కూడా పిల్లల పేరుతో మొక్కను నాటాలని సూచించారు. ప్రతీ ఇంట్లో కనీసం రెండు మొక్కలు నాటాలని.. మీ పిల్లల్లాగే వాటిని సంరక్షిస్తే తెలంగాణ రాష్ట్రమంతా పచ్చదనంతో నిండిపోతుందని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.

## నిర్మలమ్మే బీజేపీ అధ్యక్షురాలు?


**(1వపేజీ తరువాయి)**ఈసారి పార్టీ కోసం ఉపయోగించుకోవాలని చూస్తోంది అని అంటున్నారు. పైగా మహిళా కోటా పేరుతో రిజర్వేషన్లు ఆమోదించిన ఘనతను ఇప్పటికే సొంతం చేసుకున్న బీజేపీలో పురుషాధిపత్యం ఎక్కువగా ఉందని విమర్శలు ప్రత్యర్థుల నుంచి వస్తున్న వేళ ఈసారి లేడీస్ కి చాన్స్ అన్నది గట్టిగా వినిపిస్తోంది. అంతే కాదు 2029 ఎన్నికలు చాలా డిఫరెంట్ గా సాగుతాయని అంటున్నారు. దేశంలో మూడవ వంతు ఎంపీ సీట్లలో మహిళలే పోటీ చేస్తారు. 33 శాతం రిజర్వేషన్లు ఆ ఎన్నికల్లో అమలు చేస్తారు అని అంటున్నారు. ఇక జనాభా గణన తరువాత దేశంలో మరో రెండు వందల సీట్లు పెరుగుతాయని అంటున్నారు. అలా ఈ రెండు అంశాలను ఆసరాగా చేసుకుని మరోసారి గెలవాలని బీజేపీ చూస్తోంది. దాంతో సమర్థురాలు అయిన మహిళా అధ్యక్షురాలు ఉండాలని భావిస్తున్నారు. ఇప్పటికే గత పదకొండేళ్ళుగా దేశంలో కీలక మంత్రిత్వ శాఖలను చూసిన వారుగా దేశంలో ఎంతో కొంత పరిచయం ఉన్న నిర్మలమ్మ అయితే జాతీయ అధ్యక్ష స్థానానికి జనానికీ మధ్య కనెక్షన్ బాగా ఉంటుందని భావిస్తున్నారు. పైగా ఆమె నిరాడంబరత. ఒక సాధారణ గృహిణి మాదిరిగా ఆమె వ్యవహరించే తీరు మహిళా ఓట్లను బీజేపీకి మరింతగా తెచ్చి పోస్తుందని కూడా బీజేపీ పెద్దలు విశ్వసిస్తున్నారుట. దాంతో బీజేపీ కొత్త అధ్యక్ష రేసులో ఎంతో మంది మహిళల పేర్లు వినిపించినా చివరికి నిర్మలమ్మకే ఆ పదవిని ఖరారు చేస్తారు అని అంటున్నారు. ఆమెను ఆ పదవిలోకి తెచ్చాక కేంద్ర మంత్రి వర్గ విస్తరణను చేపడతారు అని కీకలమైన ఆర్థిక శాఖను తమ మనసులో ఉన్న ఒక నాయకుడికి అప్పచెబుతారని అంతే కాకుండా మంత్రివర్గంలో మార్పులు చేర్పులూ చేస్తారు అని అంటున్నారు. మొత్తానికి కాబోయే బీజేపీ ప్రెసిడెంట్ నిర్మలమ్మ అన్నది హస్తిన వర్గాల భోగట్టా. భారతీయ జనతా పార్టీ కొత్త అధ్యక్షురాలిగా ఒక మహిళ ఈసారి స్వాతంత్ర దినోత్సవం నాటికి జెండా ఎగరేస్తారు అని అంటున్నారు. చూడాలి మరి ఏమి జరుగుతుందో.

## వల్లభనేని వంశీకి అస్వస్థత

**(1వపేజీ తరువాయి)**ఎమ్మెల్యేలు సింహాద్రి రమేశ్, కైలే అనిల్, పెనమలూరు నియోజకవర్గ ఇంఛార్జ్ దేవ భక్తుని చక్రవర్తిలతో పాటు వైఎస్సార్ సీపీ శ్రేణులు, వంశీ అభిమానులు వచ్చారు. జైలు నుంచి విడుదల అనంతరం వల్లభనేని వంశీ తన భార్యతో కలిసి మాజీ సీఎం జగన్ ను కలిశారు.ఇక వల్లభనేని వంశీని జులై 5 శనివారం రోజున మాజీ మంత్రులు కొడాలి నాని, పేర్ని నాని కలిసి పరామర్శించారు. చాలా రోజుల తర్వాత కొడాలి నాని, వల్లభనేని వంశీ బహిరంగంగా కలవడం ఇదే మొదటిసారి కావడం విశేషం. వీరిద్దరి భేటీ తర్వాత పేర్ని నాని కూడా అక్కడకు చేరుకుని వారితో ముచ్చటించారు.

నవభూమి
www.navabhoomi.in
www.epaper.navabhoomi.in
3 | హైదరాబాద్ | మంగళవారం | 08 | జులై | 2025

# బాలికకు సీఎం యోగి హామీ.. లెక్కచెయ్యని స్కూలు యాజమాన్యం..





**లక్నో-నవభూమి:** ఉత్తర ప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్‌ని ఓ స్కూలు యాజమాన్యం లెక్కచేయలేదు. 'సీఎం చెబితే భయపడాలా?' అన్నట్లు వ్యవహరించింది. ఓ బాలికకు ఆయన ఇచ్చిన మాటను పట్టించుకోలేదు. ఇంతకీ ఏం జరిగిందంటే.. గోరఖ్‌పూర్, పక్కీబాగ్‌కు చెందిన పంఖురి త్రిపాఠీ.. సరస్వతీ శిశు మందిర్‌లో 7వ తరగతి చదువుతోంది. ఆ స్కూలు ఆర్ఆర్ఎస్‌కు చెందిన విద్యా భారతి ఆధ్వర్యంలో నడుస్తోంది. ఆ స్కూలులో చదివే ఏడవ తరగతి విద్యార్థులు నెలకు 1650 రూపాయలు చెల్లించాలి. పంఖురి త్రిపాఠీ చాలా నెలల నుంచి ఫీజులు కట్టడం లేదు. ఆమె తండ్రి రాజీవ్ కుమార్ త్రిపాఠీ కాలికి కరోనా సమయంలో గాయం అయింది. ఆ గాయం కారణంగా ఉద్యోగం చేయలేని పరిస్థితి ఏర్పడింది. దీంతో కుటుంబం ఆర్థికంగా బాగా దిగజారిపోయింది. ఈ నేపథ్యంలోనే ఆమె గత కొన్ని నెలలనుంచి స్కూలు ఫీజు కట్టలేదు. దాదాపు 18 వేల రూపాయలు చెల్లించాల్సి ఉంది. అయితే, ఇంత డబ్బు కట్టడం తమ వల్ల కాదని పంఖురి కుటుంబానికి అర్థమైంది. ఈ నేపథ్యంలోనే పంఖురి త్రిపాఠి ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్‌ను కలిసింది. కుటుంబ సమస్యల్ని, చదువుపై తనకున్న ఇష్టాన్ని ఆయనకు చెప్పింది. ఆర్థిక సాయం చేస్తే.. ఐఏఎస్ అవుతానని అంది. ముఖ్యమంత్రి యోగి కూడా సానుకూలంగా స్పందించాడు. పంఖురి స్కూలుకు కట్టాల్సిన 18 వేల రూపాయలు మాఫీ చేయిస్తామని హామీ ఇచ్చారు. అయితే, స్కూలు మాత్రం డబ్బులు మాఫీ చేయడానికి ఒప్పుకోలేదు. 'ఒక పాపకు ఫీజు మాఫీ చేస్తే.. మిగిలిన వాళ్లు కూడా ఫీజు మాఫీ కావాలంటారు. అలా చేస్తే స్కూలు మూసుకోవాలి' అని తేల్చి చెప్పింది.

## అధిక పనితో మెదడుకు చేటు..

### సామర్థ్యం తగ్గుతుందన్న సైంటిస్టులు




**న్యూఢిల్లీ-నవభూమి:** వారానికి 50 గంటలు మించి పని చేస్తున్నారా? అయితే అది మీ మెదడుపై తీవ్ర ప్రతికూల ప్రభావం చూపి, మీ భావాల నియంత్రణ, జ్ఞాపక శక్తి కుచించుకుపోయే ప్రమాదముంది. దీర్ఘకాల పని గంటలు ముఖ్యంగా వారానికి 52 గంటలు మించి పనిచేస్తే అది మెదడు భౌతిక నిర్మాణాన్ని మార్చి వేస్తుందని ఒక కొత్త పరిశోధన వెల్లడించింది. దక్షిణ కొరియాలో నిర్వహించిన ఈ పరిశోధనలో పరిశోధకులు కొందరు ఆరోగ్య కార్యకర్తల మెదడు పరిమాణాన్ని ఎంఆర్ఐ స్కాన్ ద్వారా కొలిచారు. వీరిలో అధికంగా పనిచేసిన వారిలో నిర్ణయం తీసుకోవడం, జ్ఞాపకశక్తి, భావోద్వేగాల నియంత్రణకు బాధ్యత వహించే మెదడులోని ప్రాంతాల్లో గణనీయమైన మార్పులు సంభవించినట్టు గుర్తించారు.
పరిశోధన నిర్వహించిన చుంగ్-అంగ్, యూనస్ యూనివర్సిటీ పరిశోధకులు 32 మంది ఆరోగ్య కార్యకర్తలను నిర్దేశిత పని గంటల కన్నా ఎక్కువగా వారానికి 50 నుంచి 72 గంటల పాటు పని చేయించి వారి మెదళ్లను పరిశీలించారు. కార్య నిర్వాహక నైపుణ్యాలకు కీలకమైన మెదడు ఎడమ మధ్య ఫ్రంటల్ గైరస్ వాల్యూమ్‌లో 19 శాతం పెరుగుదలను కనుగొన్నారు. వోక్సెల్ ఆధారిత మోర్ఫోమెట్రీని ఉపయోగించి, ఇన్సులా, సుపీరియర్ ఫ్రంటర్ గైరస్‌తో సహా 17 మెదడు భాగాల్లో ఇలాంటి పెరుగుదలను పరిశోధకులు గుర్తించారు. అయితే అధిక వాల్యూమ్ తొలుత సానుకూలంగా కన్పించినప్పటికీ అది దీర్ఘకాలిక ఒత్తిడికి మెదడు ప్రతిస్పందన కావచ్చునని నిపుణులు అంటున్నారు. ఇది తాత్కాలికంగా సామర్థ్యాన్ని పెంచవచ్చు. కానీ దీర్ఘకాలిక దుష్ప్రభావాలలో అలసట, భావోద్వేగ నియంత్రణ, జ్ఞాన సంబంధ సామర్థ్యాన్ని కూడా తగ్గించవచ్చు. ప్రస్తుతానికి ఈ అధ్యయనం చిన్న పరిణామ నమూనాకే పరిమితమైందని, భవిష్యత్తులో దీనిపై పెద్ద స్థాయిలో పరిశోధన అవసరమని పలువురు సూచిస్తున్నారు.

## మహారాష్ట్ర తీరంలో అనుమానాస్పద బోటు.. హైఅలర్ట్



**ముంబై-నవభూమి:** మహారాష్ట్రలోని రాయ్‌గఢ్ జిల్లా రేవ్‌దండలోని కొర్లాయ్ తీరం సమీపంలో ఒక అనుమానాస్పద పడవను గుర్తించారు. దీంతో భద్రతా సిబ్బంది అప్రమత్తమయ్యారు. ఈ పడవ పాకిస్థాన్‌కు చెందినది కావచ్చని అనుమానిస్తున్నారు. దీంతో రాయ్‌గఢ్ పోలీసులు, తీర ప్రాంత భద్రతా ఏజెన్సీలు అప్రమత్తమయ్యాయి. కొర్లాయ్ తీరానికి రెండు నాటికల్ మైళ్ల దూరంలో ఒక అనుమానాస్పద పడవను ఇండియన్ నేవీ రాడార్ ఆదివారం రాత్రి గుర్తుపట్టింది. ఇది పాకిస్థాన్ పడవ కావచ్చని, అయితే పడవను అడ్డుకుని అధీనంలోకి తీసుకున్న తర్వాతే దాని పూర్తి వివరాలు తెలుస్తాయని సీనియర్ అధికారి ఒకరు తెలిపారు. ప్రాథమిక సమాచారం ప్రకారం, పడవ రాయ్‌గఢ్ తీరానికి కొట్టుకుని వచ్చి ఉండవచ్చని అధికారులు భావిస్తున్నారు. పడవను గుర్తించడంతో తీర ప్రాంతం వెంబడి గస్తీని పెంచారు. పడవ సమాచారం తెలిసిన వెంటనే రాయ్‌గఢ్ పోలీసులు, బాంబ్ డిటెక్షన్ అండ్ డిస్పోజల్ స్క్వాడ్ (బీడీడీఎస్), తక్షణ స్పందన బృందం (క్యూఆర్‌టీ), నేవీ, కోస్ట్ గార్డ్ సిబ్బంది రాత్రికి రాత్రి ఘటనా స్థలికి చేరుకుని గాలింపు చర్యలు చేపట్టారు. అయితే భారీ వర్షాలు, బలమైన గాలులు కారణంగా పడవ వద్దకు చేరడానికి ఆటంకం ఎదురవుతోందని రాయ్‌గఢ్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ ఆంచల్ దలాల్ తెలిపారు. ఆయనతో పాటు పోలీసులు అధికారులు తీరప్రాంతం వద్ద పరిస్థితిని సమీక్షిస్తున్నారు. పెద్ద ఎత్తున పోలీసు బలగాలను సైతం మోహరించారు.
ఈ ఘటన 26/దాడులను గుర్తు చేస్తుండటంతో అధికారులు హై అలర్ట్ ప్రకటించారు. లష్కరే తొయిబా ఉగ్ర ముఠాకు చెందిన 10 మంది ఉగ్రవాదులు కొలాబా సముద్ర తీరం నుంచి ముంబైలోకి అప్పట్లో చొరబడ్డారు. బృందాలుగా విడిపోయి ముంబైలో 12 చోట్ల మూడు రోజుల పాటు సృష్టించిన మారణహోమంలో 166 మంది ప్రాణాలు కోల్పోగా, అనేక మంది గాయపడ్డారు.

## దలైలామాకు భారతరత్న ఇవ్వాలి.. కేంద్రానికి ఎంపీల లేఖ



**న్యూఢిల్లీ-నవభూమి:** టిబెటన్ల ఆధ్యాత్మక గురువు దలైలామాకు భారతదేశ అత్యున్నత పౌర పురస్కారమైన 'భారత రత్న' ఇవ్వాలని కోరుతూ అల్ పార్టీ ఫోరమ్ కేంద్రానికి లేఖ రాసింది. పార్లమెంటు సంయుక్త సమావేశంలో దలైలామా ప్రసంగించే అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేసింది. ఆల్ పార్టీ ఇండియన్ పార్లమెంటరీ ఫోరం ఫర్ టిబెట్ ఈ లేఖను రాసింది. ఈ ఫోరంలో భారతీయ జనతా పార్టీ బిజూ జనతాదళ్ , జనతాదళ్ యునైటెడ్ ఎంపీలు సైతం ఉన్నారు. ఈ నెలలో రెండుసార్లు సమావేశమైన ఫోరం ఏకగ్రీవంగా ఇందుకు సంబంధించిన ప్రతిపాదనను ఆమోదించింది. దలైలామా భారతరత్న నామినేషన్‌కు మద్దతుగా సంతకాల సేకరణ చేపట్టేందుకు పది మంది సభ్యుల కమిటీ ఏర్పాటయింది. ఇంతవరకూ వివిధ పార్టీలకు చెందిన సుమారు 80 మంది ఎంపీల సంతకాలను సేకరించింది. రాబోయే రోజుల్లో దీనిని ప్రధాన మంత్రికి, రాష్ట్రపతికి సమర్పించనుంది. దీనిపై రాజ్యసభ ఎంపీ సుజీత్ కుమార్ మాట్లాడుతూ, దలైలామాకు భారతరత్న ఇవ్వాలని కోరుతూ 80 మంది ఎంపీలు విజ్ఞానపత్రంపై సంతకాలు చేశారని, 100 మంది ఎంపీల సంతకాలు పూర్తికాగానే దానిని సమర్పిస్తామని చెప్పారు. సంతకాలు చేసిన వారిలో విపక్ష పార్టీల ఎంపీలు సైతం ఉన్నారని చెప్పారు. దలైలామాకు భారతరత్న ఇవ్వాలంటూ చేపట్టిన సంతకాల ప్రచారానికి పలువురు ఎంపీలు ముందుకు రాగా, కొందరు తమ ప్రచారానికి మద్దతు తెలుపుతూ వీడియో సందేశాలు పంపారని తెలిపారు. పార్లమెంటు ఉభయసభలను ఉద్దేశించి దలైలామా మాట్లాడేందుకు అనుమతించాలని కోరుతూ లోక్‌సభ, రాజ్యసభ స్పీకర్లకు లేఖలు రాయనున్నట్టు చెప్పారు. బౌద్ధమతాన్ని విస్తృతంగా ప్రచారం చేస్తున్న దలైలామా 90వ పుట్టినరోజు వేడుకలు హిమాచల్‌ప్రదేశ్‌లో ఆదివారం ఘనంగా జరిగాయి. ప్రపంచ దేశాల నుంచి వేలాదిగా బౌద్ధ భిక్షువులు పాల్గొన్నారు.

# ఓటరు జాబితా సవరణపై ఒవైసీ ఆందోళన



**న్యూఢిల్లీ-నవభూమి:** బీహార్‌లో జరగనున్న అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఓటర్ల జాబితా ప్రత్యేక విస్తృత సవరణ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ - ప్రక్రియపై ఏఐఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఓవైసీ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఎన్నికల సంఘం (ఈసీ) చేపట్టిన ఈ ప్రక్షాళన ప్రక్రియ సమయం, దాని అమలు తీరుపై ఆయన ప్రశ్నలు లేవనెత్తారు. అగమేఘాల మీద ఈసీ చేయాలనుకుంటున్న ఈ తొలగింపుల వల్ల వేలాది మంది.. ముఖ్యంగా పేదలు, సరైన పత్రాలు లేని వలస కార్మికులు తమ ఓటు హక్కును కోల్పోయే ప్రమాదం ఉందని ఒవైసీ హెచ్చరించారు. ఓటు హక్కు మాత్రమే కాకుండా వారి పౌరసత్వం కూడా గల్లంతు అయ్యే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఏఐఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీ తన ఆందోళనను స్పష్టం చేస్తూ.. కొందరు వ్యక్తులు నిజంగా అక్రమ వలసదారులే అయితే వారికి 2024 లోక్‌సభ ఎన్నికల్లో ఓటు వేయడానికి ఎందుకు అనుమతించారని ప్రశ్నించారు. ఈ ప్రక్రియ వెనుక బీజేపీ, ఆర్ఎస్ఎస్‌ల హస్తం ఉందని అన్నారు. ముఖ్యంగా ఈ రెండు పార్టీలే బంగ్లాదేశ్ నుంచి చొరబాటుదారుల గురించి తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేస్తున్నాయని ఆయన ఆరోపించారు. ఈ కుట్రపూరిత చర్యల ద్వారా ఒక నిర్దిష్ట వర్గానికి చెందిన ఓటర్లను జాబితా నుండి తొలగించే ప్రయత్నం జరుగుతోందని ఒవైసీ అభిప్రాయపడ్డారు. ఈ మొత్తం ప్రక్రియను నిలిపివేయాలని లేదా గడువును పొడిగించాలని ఏఐఎంఐఎం ఈసీఐని కోరింది. ఓటర్ల జాబితా నుంచి పేర్లను తొలగించడం అనేది కేవలం ఓటు హక్కును మాత్రమే కాకుండా, వారి జీవనోపాధిని, ప్రభుత్వ సంక్షేమ పథకాలకు అర్హులు కూడా కాకుండా ప్రభావితం అయ్యే అవకాశం ఉందని ఒవైసీ నొక్కి చెప్పారు. చాలా మంది వలస కార్మికులు తాత్కాలిక నివాసాలలో నివసిస్తున్నారని.. వారికి శాశ్వత చిరునామా పత్రాలు ఉండవని చెప్పారు. అలాంటి వారిని జాబితా నుంచి తొలగించడం అన్యాయమని ఆయన పేర్కొన్నారు. సవరించే ఓటర్ జాబితాలో 15 నుంచి 20 శాతం మంది పేర్లు గల్లంతు అయినా వారు కేవలం తమ ఓటు హక్కును మాత్రమే కోల్పోరని.. తమ పౌరసత్వాన్ని కూడా కోల్పోతారని స్పష్టం చేశారు. ఈసీఐ పారదర్శకను పాటించి ఈ సవరించే ప్రక్రియను రద్దు చేయాలని కోరారు. అలాగే ఏ ఒక్క సామాన్య పౌరుడికీ అన్యాయం జరగకుండా చూడాలని విజ్ఞప్తి చేశారు. బీహార్‌లోని రాజకీయ పార్టీలు, పౌర సమాజ సంస్థలు కూడా ఈ ఓటర్ల జాబితా ప్రక్షాళన ప్రక్రియను నిశితంగా పరిశీలిస్తున్నాయి. రాబోయే ఎన్నికలలో ఈ ఓటర్ల తొలగింపు అంశం ఒక ప్రధాన రాజకీయ చర్చగా మారే అవకాశం ఉంది. ప్రజాస్వామ్య ప్రక్రియలో ప్రతి పౌరుడి ఓటు హక్కును పరిరక్షించడం అత్యంత ముఖ్యమని ఓవైసీ పునరుద్ఘాటించారు.

# జగన్నాథుడికి 9 కుండల్లో ప్రత్యేక పానీయం



**పూరి-నవభూమి:** ఒడిశాలోని పూరీ జగన్నాథ బహుడా (తిరుగు) రథయాత్ర అత్యంత వైభవంగా కొనసాగింది. కోట్లాది మంది భక్తుల జయజయ ధ్వానాల మధ్య జగన్నాథ, బలభద్ర, సుభద్రలు (ముగ్గురు మూర్తులు) నందిఘోష్, తాళధ్వజ, దర్పదళన్ రథాల్లో శ్రీక్షేత్ర వెలుపలకు చేరుకున్నారు. ఆ తర్వాత 'సున్నాభెషో'లో భాగంగా 208 కిలోల బంగారు ఆభరణాలతో దర్శనమిచ్చారు. ఇప్పుడు 'అధర్‌పణ' కార్యక్రమానికి సేవాయత్(సేవకుడు) లు సిద్ధం చేస్తున్నారు. ఆ కార్యక్రమంలో రథాలపై ఉన్న దేవతామూర్తుల దాహాన్ని తీర్చడం కోసం మట్టికుండల్లో 'పానా' (తీపి పానీయం) నివేదిస్తారు. ఆ తర్వాత కుండలు పగలుగొట్టి పానీయాన్ని పారబోస్తారు. మరి ఆ పానీయాన్ని ఎలా తయారు చేస్తారు? దాని విశిష్టత, వాడే పదార్థాలు ఏంటి ఎందుకు పారబోస్తారు'సున్నాభెషో' తర్వాత రోజు మహాప్రభు మధ్యాహ్న ప్రసాదం నివేదన తర్వాత 'అధర్??పణ' నిర్వహిస్తారు. రథంపై ఉన్న దేవతామూర్తుల పెదవులను తాకే ఎత్తులో కుండలను ఏర్పాటు చేస్తారు. ఆ కుండల్లో తీపి పానీయాన్ని ఉంచుతారు. ఇందుకోసం ఆలయం ముందున్న బావి నుంచి నీటిని ఇత్తడి కుండల్లో తెచ్చి ప్రత్యేక మట్టి కుండల్లో వేస్తారు. అందులో పసుపు, జాజికాయ, పాలు, చక్కెర, యాలకులు, బెల్లం, నెయ్యి, కుంకుమ, కర్పూరం, అరటిపండ్లు వంటి వివిధ రకాల పదార్థాలను వేసి తయారు చేస్తారు.
ఆ తర్వాత ఆలయ సేవాయత్?లు తొమ్మిది కుండల్లో పానీయాన్ని నివేదిస్తారు. ప్రతి రథం వద్ద మూడు కుండల్లో మొత్తం తొమ్మిది కుండల్లో నైవేద్యాన్ని సమర్పిస్తారు. ఆ తర్వాత స్వామివారి తృప్తి కోసం ఆ కుండలను పగలగొడతారు. అలా చేస్తే మిగిలిన దేవతలు, చండి చాముండా, నిరాకార జీవులు పానీయాన్ని తాగి వారి యథాస్థానాలకు చేరుకుంటారని భక్తుల నమ్మకం. చండి చాముండ సహా దేవతలంతా జగన్నాథుడి రథయాత్రలో ప్రయణిస్తారని అక్కడి ప్రజల నమ్మకం. గతంలో మూడు రోజుల పాటు 'అధర్?పణ' చేపట్టేవారు. కొన్నేళ్ల తర్వాత ఆ ఆచారాన్ని 'సున్నాభెషో' తర్వాత రోజు మాత్రమే నిర్వహిస్తున్నారు. జగన్నాథ, బలభద్ర, సుభద్రలు ఆలయంలోకి వెళ్లేముందు నిరాకార జీవులను, ఇతర దేవతలను సంతృప్తిపరచడానికి చేస్తారు.
జగన్నాథుడు, బలభద్రుడు, సుభద్రతల దేవతామూర్తులను పసిడితో అలంకరించి రథంపై ఊరేగించడాన్ని 'సునా భేషా'గా పిలుస్తారు. ఆచారాన్ని ఆదివారం సాయంత్రం 6.30 నుంచి రాత్రి 11 గంటల వరకు నిర్వహించారు. దేవుళ్లను 208 కిలోల బంగారు ఆభరణాలతో చక్కగా అలంకరించారు. జగన్నాథుడు, బలభద్రుడు, సుభద్రలకు బంగారం, వెండి, వజ్రం ఇతర విలువైన లోహాలతో సహా దాదాపు 30 రకాల ఆభరణాలతో అలంకరించారు.

# వ్యర్థాలతో విద్యుత్ ఉత్పత్తి- ఏడాదికి రూ.10లక్షల ఆదాయం



**మొహియుద్దీన్‌పూర్-నవభూమి:** సంపన్న దేశానికి మార్గం స్వావలంబన గ్రామాల ద్వారానే జరుగుతుంది. ఈ సామెత ఉత్తర్‌ప్రదేశ్ లోని మొహియుద్దీన్‌పూర్ గ్రామానికి సరిగ్గా సరిపోతుంది. ఆ ప్రాంతంలో చెత్తను బయట పడవేయడం గానీ,కాల్చివేయడం గానీ జరగదు. ఎందుకో తెలుసా? అక్కడి గ్రామ పంచాయతీ చెత్తను కొన్ని సంస్థలకు విక్రయిస్తుంది. అంతే కాదు మిగిలిన చెత్తను అమ్ముతుంది. అమ్మగా వచ్చిన డబ్బును గ్రామ అభివృద్ధికి కేటాయిస్తుంది. శుభ్రతను పాటించినందుకు రాష్ట్ర ప్రభుత్వంచే అవార్డు పొందిన మొదటి గ్రామం కూడా ఇదే కావడం విశేషం. వినడానికి వింతగా ఉంది కదూ! మరి దాని గురించి పూర్తి సమాచారం తెలుసుకుందామా? వ్యర్థాలతో విద్యుత్ ఉత్పత్తి- ఏడాదికి రూ.10లక్షల ఆదాయం- వచ్చిన డబ్బుతో గ్రామ అభివృద్ధి!
మీరట్‌లోని మొహియుద్దీన్‌పూర్ గ్రామంలో దాదాపు 1200 ఇళ్లు ఉన్నాయి. జనాభా పరంగా 10 నుంచి 12 వేల మంది ఉంటారు. గ్రామానికి ఉన్న ప్రత్యేకత ఏమిటంటే ఇక్కడి గ్రామ పంచాయతీ ఒక ప్రణాళికను రూపొందించింది. దీని ప్రకారం గ్రామాన్ని శుభ్రంగా ఉంచడమే కాకుండా, ప్రతి ఇంటి నుండి రోజూ చెత్తను సేకరిస్తారు. స్వయం సహాయక సంఘాల సహాయంతో చెత్తను వేరు చేసి విద్యుత్ ఉత్పత్తిలో వినియోగించడానికి కొంత భాగాన్ని ఒక సంస్థకు పంపిస్తారు. మిగిలిన చెత్తను అమ్మేస్తారు.
"గ్రామ ప్రజలందరూ ఆరోగ్యంగా ఉండేలా, ప్రతి ఒక్కరూ పరిశుభ్రతను పాటించేలా ఇంటింటికి రెండు చెత్త డబ్బాలు కేటాయించాం. ఒకటి పొడి చెత్త కోసం, మరొకటి తడి చెత్త కోసం ఉపయోస్తున్నాం. నాలుగు వాహనాలు ఇంటింటికీ వెళ్లి చెత్త సేకరించి, ఒక నిర్దిష్ట ప్రదేశానికి తీసుకువెళతాయి. అక్కడ గ్రామంలోని మహిళలు వ్యర్థాలను వేరు చేస్తారు. వేరు చేసిన చెత్తను వివిధ స్క్రాప్ డీలర్ల ద్వారా విక్రయిస్తారు. దీని కోసం, గ్రామ అధిపతికి రాష్ట్ర స్థాయిలో అవార్డు కూడా లభించింది. ఈ గ్రామంలో చెత్త పారవేయడం చొరవను పెద్ద ఎత్తున తీసుకున్నందున, రాష్ట్రంలో ఇదే మొదటి గ్రామం" అని పంచాయతీ కార్యదర్శి మనోజ్ శర్మ చెప్పారు. "గ్రామంలో పది మందికి ఉపాధి కల్పించింది. చెత్త పారవేయడాన్ని 2022 లో ప్రారంభించగా, అది ఇప్పుడు విజయవంతమవుతోంది. గత ఒకటిన్నర సంవత్సరాలలో, సుమారు 15 లక్షల రూపాయల ఆదాయం లభించింది. దీన్ని గ్రామ అభివృద్ధికి ఉపయోగిస్తున్నాం"..ప్రతి ఇంటి నుంచి చెత్త సేకరణకు గ్రామ పంచాయతీ నెలకు రూ.60, దుకాణదారుల నుంచి రూ.120 వసూలు చేస్తుంది. చెత్త సేకరణ కోసం గ్రామాన్ని 4 జోన్‌లుగా విభజించింది. వాహనాల ద్వారా తడి, పొడి చెత్తను సేకరిస్తారు. ఆ తర్వాత గ్రామంలోని కొందరు మహిళలు ఈ వర్థాలను వేరు చేసి మరోచోటుకు పంపిస్తారు. ఆ తర్వాత విద్యుత్ సంస్థలతో పాటు ఇతర స్క్రాప్ డీలర్లకు మంచి ధరకు అమ్ముతారు. గత ఒకటిన్నర సంవత్సరంలో గ్రామం నుంచి వచ్చే చెత్త నుంచి సుమారు రూ.15 లక్షలు సంపాదించారు. ఈ సందర్భంగా మొహియుద్దీన్‌పూర్ గ్రామ అధిపతి? విమలా దేవి మాట్లాడారు. గ్రామంలో అందరి సహకారంతోనే ఈ విజయాన్ని సాధించామన్నారు.

# పహల్గాం ఉగ్రదాడిని తీవ్రంగా ఖండించిన బ్రిక్స్..

## టెర్రరిజం ఏ రూపంలో ఉన్న వ్యతిరేకిస్తామంటూ..!




**న్యూఢిల్లీ-నవభూమి:** అంతర్జాతీయ వేదికపై ఉగ్రవాద వ్యతిరేక పోరాటానికి తమ సంకల్పాన్ని మరోసారి చాటుకుంటూ.. బ్రిక్స్ (బ్రెజిల్, రష్యా, ఇండియా, చైనా, దక్షిణాఫ్రికా) దేశాల నాయకులు జమ్మూ కశ్మీర్‌లోని పహల్గాంలో జరిగిన భయంకరమైన ఉగ్రదాడిని తీవ్రంగా ఖండించారు. ఏప్రిల్ 22న జరిగిన ఈ దాడిలో 26 మంది అమాయక పౌరులు ప్రాణాలు కోల్పోవడం పట్ల తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ఉగ్రవాదం ఏ రూపంలో ఉన్నా దానిపై పోరాడటానికి తమ ముందుంటామని పేర్కొన్నారు. ముఖ్యంగా ఐక్యరాజ్య సమితి గుర్తించిన ఉగ్రవాదులు, ఉగ్ర సంస్థలపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బ్రిక్స్ కూటమిలోని ఐదు దేశాల అధినేతలు ఉగ్రవాదాన్ని సమర్థవంతంగా ఎదుర్కోవడంలో ఐక్యంగా ముందుకు సాగాలని తీర్మానించారు. సరిహద్దుల గుండా ఉగ్రవాదుల కదలికలు, ఉగ్రవాద కార్యకలాపాలకు నిధులు సమకూర్చడం, ఉగ్రవాదులకు సురక్షిత ఆశ్రయాలు కల్పించడం వంటి అన్ని రూపాలనూ నిర్మూలించడానికి తమ నిరంతర కృషిని కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఉగ్రవాదాన్ని ఏమాత్రం సహించబోమని, దాని పట్ల 'సున్నా సహనం' విధానాన్ని అవలంబించాలని పిలుపునిచ్చారు. ఉగ్రవాద నిరోధక చర్యలలో 'ద్వంద్వ ప్రమాణాలను' తిరస్కరించడం అత్యవసరం అని బ్రిక్స్ నేతలు నొక్కి చెప్పారు. ఉగ్రవాదాన్ని ఒక దేశం లేదా మతం పేరుతో ముడి పెట్టకుండా, దానిని ఒక సార్వత్రిక బెదిరింపుగా పరిగణించాలని వెల్లడించారు. అంతర్జాతీయ శాంతి, భద్రతకు ఉగ్రవాదం ఒక పెను ముప్పు అని.. దానిని ఎదుర్కోవడానికి అన్ని దేశాలు సమన్వయంతో పని చేయాలని వారు పునరుద్ఘాటించారు. జమ్మూకశ్మీర్‌లోని పహల్గాంలో అమాయకులపై జరిగిన దాడి, ఉగ్రవాదం ఇంకా ఒక తీవ్రమైన సమస్యగా కొనసాగుతోందని మరోసారి గుర్తు చేసిందని బ్రిక్స్ దేశాధినేతలు తమ ప్రకటనలో పేర్కొన్నారు.
ఈ ఉగ్ర దాడిని ఖండించడమే కాకుండా.. ఉగ్రవాద బాధితులకు, వారి కుటుంబాలకు తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ముష్కరులకు ఎలాంటి ఆశ్రయం లభించకుండా చూడాలని, వారిని గుర్తించి, న్యాయస్థానం ముందు నిలబెట్టాలని అంతర్జాతీయ సమాజాన్ని కోరారు. ఈ మేరకు బ్రెజిల్‌లోని 'రియో డీ జెనీరోలో' జరుగుతున్న బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సులో రియో డీ జెనీరో డిక్లరేషన్'ను సభ్య దేశాలు విడుదల చేశాయి. అయితే ఈ తీర్మానంలో ఎక్కడా పాకిస్థాన్ పేరును ప్రస్తావించలేరు. ఈ ఉమ్మడి ప్రకటన ఉగ్రవాదంపై బ్రిక్స్ దేశాల మధ్య బలమైన సమన్వయాన్ని, సహకారాన్ని ప్రతిబింబిస్తుంది. అంతర్జాతీయ ఉగ్రవాద నిర్మూలనకు ఈ కూటమి కట్టుబడి ఉందని ఇది మరోసారి స్పష్టం చేస్తుంది.

## కేంద్ర మంత్రిని కాదు, నా వద్ద నిధులు కూడా లేవు


### హిమాచల్‌లో వరదలపై కంగనా రనౌత్ వ్యాఖ్యలు



**మండి-నవభూమి:** హిల్‌స్టేట్ హిమాచల్ ప్రదేశ్‌ను గత కొన్ని రోజులుగా కుండపోత వర్షాలు అతలాకుతలం చేస్తున్న విషయం తెలిసిందే. ఈ వర్షాల కారణంగా జనజీవనం స్తంభించిపోయింది. భారీగా ప్రాణ, ఆస్తి నష్టం సంభవించింది. ఈ వర్షాలకు మండి జిల్లా తీవ్రంగా ప్రభావితమైంది.
ఈ సందర్భంగా మండి జిల్లాలోని వరద ప్రభావిత ప్రాంతాన్ని బాలీవుడ్ నటి, మండి నియోజకవర్గ బీజేపీ ఎంపీ కంగనా రనౌత్ ఆదివారం సందర్శించారు. జిల్లాలోని తునాగ్‌లో వరద బాధితులతో మాట్లాడారు. అనంతరం జిల్లాలో తాజా పరిస్థితిపై అధికారులను ఆరా తీశారు. ఈ సందర్భంగా విపత్తు సహాయక చర్యలను ఉద్దేశించి కీలక వ్యాఖ్యలు చేశారు. తాను కేంద్ర కేబినెట్‌లో లేనని, తన వద్ద నిధులు కూడా లేవని పేర్కొన్నారు. 'నేను కేంద్ర మంత్రివర్గంలో లేను. నా దగ్గర విపత్తు సహాయానికి నిధులుకూడా లేవు' అంటూ కంగన వ్యాఖ్యానించారు. కేంద్రం నుంచి ఆర్థిక సహాయం అందించేందుకు తాను అన్ని ప్రయత్నాలు చేస్తున్నానని ఈ సందర్భంగా కంగన తెలిపారు. విపత్తుల సమయంలో మండి ప్రజలకు ఎంపీ అందుబాటులో లేరంటూ కాంగ్రెస్ నేతలు తీవ్ర విమర్శలు గుప్పిస్తున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో వరద ప్రభావిత ప్రాంతాల్లో ఎంపీ పర్యటన ఆసక్తికరంగా మారింది. భారీ వర్షాలు, విరిగి పడుతున్న కొండ చరియలు, ఆకస్మిక వరదలతో హిల్ స్టేట్ హిమాచల్‌ప్రదేశ్ అతలాకుతలమవుతోంది. జూన్ 20న రుతుపవనాలు ప్రారంభమైనప్పటి నుంచి జులై 6 నాటికి దాదాపు 23 ఆకస్మిక వరదలు సంభవించాయి. 19 క్లౌడ్ బరస్ట్‌లు , 16 చోట్ల కొండచరియలు విరిగిపడ్డాయి ఈ ప్రకృతి విపత్తులో భారీగా ఆస్తి, ప్రాణ నష్టం సంభవించింది. వర్షాల కారణంగా సంభవించిన ప్రమాదాల్లో రాష్ట్ర వ్యాప్తంగా ఇప్పటి వరకూ మరణించిన వారి సంఖ్య 78కి పెరిగినట్లు అధికారులు తాజాగా వెల్లడించారు. ఇందులో వర్ష సంబంధిత ఘటనల్లో 50 మంది ప్రాణాలు కోల్పోగా.. రోడ్డు ప్రమాదాల్లో 28 మంది మరణించినట్లు రాష్ట్ర విపత్తు నిర్వహణ అథారిటీ తెలిపింది. 'హిమాచల్ ప్రదేశ్‌లో వర్షాల కారణంగా సంభవించిన ఘటనల్లో జులై 6 నాటికి మొత్తం మరణించిన వారి సంఖ్య 78కి చేరుకుంది' అని వెల్లడించింది. ఇక ఈ వర్షాలు, వరదల కారణంగా 37 మంది గల్లంతయ్యారు. వారి కోసం సహాయ బృందాలు తీవ్రంగా గాలిస్తున్నాయి. మరోవైపు 115 మంది గాయపడ్డారు. ఈ విపత్తు కారణంగా దాదాపు రూ.500 కోట్ల మేర నష్టం వాటిల్లినట్లు ప్రభుత్వం అంచాన వేస్తోంది. భారీ వర్ష సూచన..మరోవైపు నేడు రాష్ట్ర వ్యాప్తంగా ఉరుములు, మెరుపులతో కూడి భారీ నుంచి అతిభారీ వర్షాలు కురుస్తాయని భారత వాతావరణ శాఖ హెచ్చరించింది. అదేవిధంగా జులై 8, 9 తేదీల్లోనూ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని అంచనా వేసింది. ఈ మేరకు పలు జిల్లాలకు అలర్ట్ జారీ చేసింది. సిర్మౌర్, కాంగ్రా, మండి.. ఈ మూడు జిల్లాలకు రెడ్ అలర్ట్ ఇచ్చింది. సిమ్లా, సోలన్, హమీర్‌పూర్, బిలాస్‌పూర్, ఉనా, కులు, చంబా.. ఈ ఏడు జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది.

## 23 ఆకస్మిక వరదలు, 19 క్లౌడ్ బరస్ట్‌లు

### కుండపోత వర్షాలకు హిమాచల్ అతలాకుతలం



**మండి-నవభూమి:** భారీ వర్షాలు, విరిగి పడుతున్న కొండ చరియలు, ఆకస్మిక వరదలతో హిల్ స్టేట్ హిమాచల్‌ప్రదేశ్ అతలాకుతలమవుతోంది. జూన్ 20న రుతుపవనాలు ప్రారంభమైనప్పటి నుంచి జులై 6 నాటికి దాదాపు 23 ఆకస్మిక వరదలు సంభవించాయి. 19 క్లౌడ్ బరస్ట్‌లు 16 చోట్ల కొండచరియలు విరిగిపడ్డాయి ఈ ప్రకృతి విపత్తులో భారీగా ఆస్తి, ప్రాణ నష్టం సంభవించింది. వర్షాల కారణంగా సంభవించిన ప్రమాదాల్లో రాష్ట్ర వ్యాప్తంగా ఇప్పటి వరకూ మరణించిన వారి సంఖ్య 78కి పెరిగినట్లు అధికారులు తాజాగా వెల్లడించారు. ఇందులో వర్ష సంబంధిత ఘటనల్లో 50 మంది ప్రాణాలు కోల్పోగా.. రోడ్డు ప్రమాదాల్లో 28 మంది మరణించినట్లు రాష్ట్ర విపత్తు నిర్వహణ అథారిటీ తెలిపింది. 'హిమాచల్ ప్రదేశ్‌లో వర్షాల కారణంగా సంభవించిన ఘటనల్లో జులై 6 నాటికి మొత్తం మరణించిన వారి సంఖ్య 78కి చేరుకుంది' అని వెల్లడించింది. ఇక ఈ వర్షాలు, వరదల కారణంగా 37 మంది గల్లంతయ్యారు. వారి కోసం సహాయ బృందాలు తీవ్రంగా గాలిస్తున్నాయి. మరోవైపు 115 మంది గాయపడ్డారు. ఈ విపత్తు కారణంగా దాదాపు రూ.500 కోట్ల మేర నష్టం వాటిల్లినట్లు ప్రభుత్వం అంచాన వేస్తోంది. ఈ వర్షాలకు రెండు జాతీయ రహదారులు సహా దాదాపు 243 రోడ్లను అధికారులు మూసివేశారు. 278 విద్యుత్ కేంద్రాలు, 261 నీటి ప్రాజెక్టులు మూతపడ్డాయి.
మరోవైపు నేడు రాష్ట్ర వ్యాప్తంగా ఉరుములు, మెరుపులతో కూడి భారీ నుంచి అతిభారీ వర్షాలు కురుస్తాయని భారత వాతావరణ శాఖ హెచ్చరించింది. అదేవిధంగా జులై 8, 9 తేదీల్లోనూ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని అంచనా వేసింది.
ఈ మేరకు పలు జిల్లాలకు అలర్ట్ జారీ చేసింది. సిర్మౌర్, కాంగ్రా, మండి.. ఈ మూడు జిల్లాలకు రెడ్ అలర్ట్ ఇచ్చింది. సిమ్లా, సోలన్, హమీర్‌పూర్, బిలాస్‌పూర్, ఉనా, కులు, చంబా.. ఈ ఏడు జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది.

## ప్రేమ పెళ్లి.. ప్రతీ రోజూ గొడవలే.. కత్తితో పొడిచి చంపేశాడు



బెంగళూరు - నవభూమి: ఆ ఇద్దరూ ప్రేమించుకున్నారు. పెళ్లి కూడా చేసుకున్నారు. పెళ్లి తర్వాత ప్రేమ ఏమైందో తెలీదు కానీ.. ప్రతీ రోజూ గొడవ పడేవారు. ఆ గొడవలు రోజురోజుకు పెరిగి.. భార్య హత్యకు దారి తీసింది. భర్త తన భార్యను కత్తితో పొడిచి చంపేశాడు. ఈ సంఘటన కర్ణాటకలోని తుమ్మూరులో శనివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. తమ్మూరుకు చెందిన నవీన్, గీతలు ప్రేమ పెళ్లి చేసుకున్నారు. పెళ్లైన కొంత కాలం వీరి కాపురం సజావుగానే సాగింది. తర్వాతినుంచి గొడవలు మొదలయ్యాయి. నవీన్ ఓ కూరగాయల మార్కెట్‌లో పని చేసేవాడు. వారంలో రెండు రోజులు మాత్రమే పనికి పోయేవాడు. మిగిలిన రోజులు ఇంట్లో ఖాళీగా ఉండేవాడు. బాగా తాగేవాడు కూడా. ఈ నేపథ్యంలోనే నవీన్, గీతలు తరచుగా గొడవలు పడేవారు. ఇంటి ఓనర్ కలుగజేసుకుని గొడవ ఆపాల్సి వచ్చేది. ఈ గొడవలు ఎక్కువవటంతో రెండు సార్లు ఇళ్లు ఖాళీ చేయించాడు. అయితే, అధిక రెంటులు కట్టలేక మళ్లీ వెనక్కు తిరిగి వచ్చారు. అయినా గొడవలు మాత్రం ఆగలేదు. శనివారం రాత్రి నవీన్ తాగి ఇంటికి వచ్చాడు. దీంతో భార్యాభర్తల మధ్య గొడవ జరిగింది. నవీన్ గొడవ సందర్భంగా గీతను కత్తితో పొడిచి చంపేశాడు. అనంతరం అక్కడినుంచి పారిపోయాడు. మరుసటి రోజు ఇంటి యజమాని కొడుకు అక్కడికి వచ్చాడు. నవీన్ మూడు నెలలుగా రెంటు కట్టకపోవటంతో అడగడానికి వచ్చాడు. ఇంటి దగ్గరకు రాగానే అక్కడి దృశ్యం చూసి షాక్ అయ్యాడు. గీత రక్తం మడుగులో పడి ఉంది. వెంటనే పోలీసులకు సమాచారం

## ట్రంప్ కలల బిల్లు రాజకీయంగా గెలుపేనా?

అమెరికా రాజకీయం ఓ కొత్త మలుపు తిరిగింది. అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ కలల బిల్లు అయిన "ఒన్ బిగ్ బ్యూటిఫుల్ బిల్" చివరికి ఉభయ సభల ఆమోదాన్ని పొంది, చరిత్రలోకి అడుగుపెట్టింది. అయితే, ఈ బిల్లు ఆమోదం పొందిన తీరూ, దాని ఆర్థిక, సామాజిక, నైతిక ప్రభావాలూ... అమెరి కా ప్రజాస్వామ్యాన్ని దెబ్బతీసే విధంగా మారుతున్నాయి. దీన్ని అమెరికా నూతన విధాన రూపకల్పనగా కాకుండా, మూల్యాలపై దాడిగా భావించాల్సిన అవసరం కనిపిస్తోంది. ఈ బిల్లుకు వ్యతిరేకంగా కొంతమంది డెమోక్రాట్లు సభలో గంటల తరబడి ప్రసంగించినప్పటికీ, అది ఫలితాన్ని తారుమారు చేయలేకపోయింది. ట్రంప్ నేతృత్వంలో రిపబ్లికన్లు పార్టీ లైనుకు కట్టుబడి, చివరి నిమిషాల్లో కూడా గట్టి వ్యతిరేకత చూపిస్తారని భావించిన వారికే షాక్ ఇచ్చారు. వాస్తవానికి బిల్లులోని అంశాలు ప్రజావ్యతిరేకతకు పరాకాష్ఠగా ఉన్నప్పటికీ, పార్టీలుగా వ్యవహరించిన తీరు ప్రజాస్వామ్య ఆచారాలకు వ్యతిరేకంగా మారింది. బిల్లులో కీలక అంశం – 3 ట్రిలియన్ డాలర్ల పన్ను మినహాయింపులు అమెరికాలోని అత్యంత ధనవంతులకు ఇవ్వడం. ఈ పన్ను మినహాయింపుల వలన ప్రభుత్వ ఖజానాకు ఏర్పడే లోటును పేదల పట్ల కఠినమైన కోతలతో నింపే ప్రయత్నం జరుగుతోంది. ఆరోగ్య బీమా పథకాల్లో భారీగా కోతలు, ఆహార భద్రత కార్యక్రమాల తగ్గింపులు, అభివృద్ధి చెందుతున్న వలస కుటుంబాలపై ఆర్థిక భారాలు... ఇవన్నీ ఈ బిల్లులోని అసలైన మర్మాన్ని వివరిస్తున్నాయి. బిల్లుకు మద్దతుగా ట్రంప్ చేసిన ప్రచారం "అమెరికా ఆర్థిక పునరుద్ధరణకు మార్గం"గా పేర్కొనబడుతున్నా, అది అసలు ఆర్థిక నైతికతను తుడిచిపెట్టే విధంగా ఉంది. ఆయన మాటలతో, "ఇది అమెరికా పుట్టిన 250వ సంవత్సరం సందర్భంగా జాతీయ పునరాగమనానికి సంకేతం," అన్న వాక్యాలు ఊహల ప్రపంచానికి చెందినవిగా కనిపిస్తున్నాయి. వాస్తవంగా చూస్తే, ఇది అమెరికాలో ఉన్నవాళ్లను మరింతగా ఉన్నతస్థాయికి చేర్చడం, లేనివాళ్లను మరింత కిందకి తొక్కేయడమే. ఈ బిల్లులో మరో కీలక అంశం %–% వలసదారులపై ట్రంప్ విధించే ఆంక్షలు. ఈ కొత్త చట్టం వలసదారులను ఎదుర్కొనే పేరుతో మరింత తీవ్రమైన భద్రతా చర్యలకు నిధుల కేటాయింపుని చేర్చింది. కేవలం శరణార్థులే కాదు, అమెరికాలో ఉన్న ఇతర ప్రవాసులపైనా గగుర్పొడిచే విధంగా చర్యలు తీసుకునే అధికారం ఈ బిల్లుకు ద్వారా ప్రభుత్వం పొందుతోంది. 'ఏలియన్స్' గా వర్ణిస్తూ వలసదారులపై అణిచివేత నాటకీయంగా ప్రోత్సహించబడుతోంది. అంతేకాకుండా, బిల్లు అమలులోకి వస్తే కార్పొరేట్ సంస్థలు వాస్తవానికి, పన్ను చెల్లింపులోని బాధ్యతల నుంచి విముక్తమవుతాయి. కార్మికులు, ఉద్యోగులు మాత్రం, పన్ను భారం మోయాల్సి వస్తుంది. వ్యవస్థలన్నీ కుబేరులకు అనుకూలంగా మారతాయి. డిజిటల్ ఆధునీకరణ పేరుతో ప్రజలపై మరింత నిఘా పెరుగుతుంది. సోషల్ మీడియా వేదికలపై విమర్శలు చేసే సామాన్యుల పైనే కన్నెత్తి చూస్తారు. అలానే, అమెరికా రాజకీయాల్లో వ్యక్తిగత అనుబంధాల ప్రభావం ఈ బిల్లుతో స్పష్టమవుతోంది. టెక్ దిగ్గజం ఎలాన్ మస్క్ ఈ బిల్లుకు వ్యతిరేకంగా మాట్లాడగానే, ట్రంప్ ఆయనను దేశం నుంచి గెంటేస్తానంటూ బెదిరించడం అమెరికన్ స్వేచ్ఛా భావనకు వ్యతిరేకం. ఇది అధ్యక్ష పదవిని వ్యక్తిగత కోపాలకు వేదికగా మార్చే ధోరణి. ఇంకొక ప్రధాన విమర్శ %–% ఈ బిల్లులోని మార్పులపై సరైన ప్రజా చర్చ లేకపోవడం. వేల పేజీల ఈ బిల్లును సభ్యులు పూర్తిగా చదివారా లేదా అనే అనుమానం తీవ్రమవుతోంది. ఆర్థిక న్యాయంపై ఈ బిల్లులో చర్చకంటే ప్రచారం ఎక్కువైంది. ప్రజల జీవన ప్రమాణాలు తగ్గిపోతున్నా, విపరీత ధనిక వర్గానికి ప్రయోజనం కలిగే విధంగా చట్టం రూపొందించడం ప్రమాదకరం. సామ్యవా దులు, సమాజ న్యాయవాదులు ఎత్తిచూపిన మరో ప్రధాన అంశం ప్రతిపక్ష పాత్ర. డెమోక్రాట్లు ఈ బిల్లును వ్యతిరేకిం చినంత మాత్రాన, ప్రజా రచ్చతో ఒత్తిడి తేవలేకపోయారు. ర్యాలీలు, ఉద్యమాలు, ప్రచార వేదికలు వదిలిపెట్టి, సభలో తక్కువ ఉత్సాహంతో మాత్రమే నిరసన తెలియజేయడాన్ని విఫలమైన వ్యూహంగా పలువురు విమర్శిస్తున్నారు. ఇక బిల్లుతో ఏర్పడే ప్రభావాలు చూస్తే ట్రంప్ తిరిగి అధ్యక్ష పదవిలోకి రావాలని ఆశిస్తున్న అతిపెద్ద దాతలకు ఇది బహుమతి. అదే సమయంలో, ఫుడ్ స్టాంప్స్‌పై ఆధారపడే అనేక మంది అమెరికన్లు తమ నిత్యావసరాలను కోల్పోయే ప్రమాదంలో ఉన్నారు. ఈ బిల్లుతో వైద్యం ఖరీదవుతుంది. ప్రవాసులపై పన్నుల భారాలు పెరుగుతాయి. విద్యా అవకాశాలపై నిబంధనలు కఠినమవుతాయి. అమెరికా ఒక విశాలమైన ప్రజాస్వామ్యం. దాని బలపడటానికి, ప్రజలంతా నూతన మార్గాల్లో ఆలోచించి, రాజకీయ నేతల నిర్ణయాలను విశ్లేషణాత్మకంగా ప్రశ్నించాల్సిన అవసరం ఉంది. "కుబేరుల బిల్లు"కి అనుకూలంగా ఓటు వేసిన ప్రతినిధులు తమ సమర్థనకు నైతికమైన కారణాలేమిటో ప్రజలకు వివరించాలి. బిల్లు ఆమోదం పొందిందని మాత్రమే కాదు, దాని ఫలితాలు ఏమిటన్నదానిపై బహిరంగ చర్చ అవసరం. ఈ చట్టం మానవ హక్కులు, ఆర్థిక సమానత్వం, ప్రజల సంక్షేమం వంటి విలువలపై దాడి చేస్తూ... అమెరికా రాజ్యాంగం తలపెట్టిన లక్ష్యాలను కాలరాసే ప్రమాదంలో ఉంది. ధనికులను మరింత ధనవంతులుగా, పేదలను మరింత పేదలుగా చేసే విధానం సమాజాన్ని చీల్చే ప్రమాదం కలిగి ఉంది. అంతిమంగా ఈ బిల్లు ఓటింగ్ ద్వారా ఆమోదించబడినా, చరిత్ర దానిని ఎలా మదిస్తుందన్నది ఎక్కువ ప్రాధాన్యం గల విషయం. పాలకులు తీసుకునే ప్రతి నిర్ణయానికీ, సామాన్యుడి జీవితాన్ని ప్రభావితం చేసే దానికి... సమాజం నుంచి పటిష్ఠమైన స్పందన రావాలి. లేకపోతే, అమెరికా లాంటి ప్రజాస్వామ్య దేశంలో సైతం "ప్రభుత్వం కుబేరుల కోసం ప్రజల ఖర్చుతో" అనే ధోరణి అభివృద్ధి

# ఉద్యోగ అనుబంధ ప్రోత్సాహక పథకం






భారతదేశ ఆర్థిక ప్రయాణం వేగంగా విస్తరిస్తున్నది. ప్రపంచ వ్యాప్తంగా ప్రాధాన్యత పెరుగుతున్నది, ఆర్థిక సంస్కరణలు ఊపందుకున్నవీ నిశ్చయమే. కానీ ఈ అభివృద్ధి కథనాన్ని నిలబెట్టే ఒక ప్రధాన ప్రశ్న ఇంకా ఎదురుగానే ఉంది. దేశంలో ఉద్యోగాలు ఎక్కడ? అవి ఎంత స్థిరమైనవి? కేంద్ర ప్రభుత్వం ఇటీవల ఆమోదించిన "ఉద్యోగ అనుబంధ ప్రోత్సాహక పథకం" ఈ ప్రశ్నకు సమాధానంగా కొత్త మార్గాన్ని సూచిస్తుంది. జూలై 1, 2025న కేంద్ర కేబినెట్ ఆమోదించిన ఈ పథకం, ఆగస్టు 1, 2025 నుంచి ప్రారంభమవుతుంది. ఈ పథకం ప్రధానంగా రెండు సంవత్సరాల్లోగా 3.5 కోట్ల కొత్త ఉద్యోగాలు సృష్టించాలని లక్ష్యంగా పెట్టుకున్నది. మొత్తం ఖర్చు రూ. 99,446 కోట్లు. గతంలో ఉన్న ఉపాధి పథకాల వలె కేవలం జీతాల సహాయానికి మాత్రమే కాకుండా, దీని గమ్యం దీర్ఘకాలిక ఉపాధిని కల్పించడం, ఉద్యోగాల అధికారీకరణను ప్రోత్సహించడం, ఉద్యోగులతో పాటు సంస్థలకూ ప్రత్యక్ష ప్రయోజనాలు కల్పించడం. ఉద్యోగాల కల్పన మాత్రమే కాదు, ఈపీఎఫ్ఓ సంస్థలతో అనుసంధానించడంవల్ల ఈ ఉద్యోగాలకు సామాజిక భద్రతా పదును కూడా ఏర్పడుతుంది. ఈ పథకం రెండు భాగాలుగా నిర్మితమైంది. మొదటిది "భాగం ఎ" ం మొట్టమొదటి ఉద్యోగాన్ని సంపాదించే యువతకు ప్రత్యక్షంగా ప్రయోజనం కలిగిస్తుంది. నెలకు ఒక లక్ష రూపాయల లోపు జీతం పొందే వారు అర్హులు. ఆరు నెలల నిరంతర సేవ చేసిన తర్వాత ఒక నెల ఈపీఎఫ్ జీతానికి సమానంగా (గరిష్టంగా రూ. 15,000) ప్రోత్సాహకంగా డబ్బు వారి ఖాతాలోకి వస్తుంది. ఏడాది పూర్తి చేసాక మరో విడత డబ్బు అందుతుంది. అయితే అది ఆర్థిక విజ్ఞాన శిక్షణ పూర్తి చేసిన తరువాత మాత్రమే. ప్రోత్సాహకం నేరుగా వ్యక్తుల పాన్ ఆధారిత ఖాతాలోకి డీబీటీ ద్వారా జమ అవుతుంది. ఈ విధంగా, పొదుపు అలవాటు, ఆర్థిక స్థిరత్వం రెండింటినీ పెంపొందించే యత్నం ఇది. "భాగం బి" ద్వారా సంస్థలకు ప్రోత్సాహక భత్యం అందుతుంది. 50 మందికి లోపు సిబ్బంది ఉన్న సంస్థలు కనీసం ఇద్దరిని, 50 మందికి మించిన సంస్థలు కనీసం ఐదుగురిని కొత్తగా నియమించాలి. ఈ నియామకాలు స్థిరంగా కనీసం ఆరు నెలలపాటు కొనసాగాలి. వారి జీత స్థాయిని బట్టి నెలకు సంస్థలు ఈ క్రింద పేర్కొన్న విధంగా ప్రోత్సాహాన్ని పొందగలవు జీతం రూ. 10,000 లోపు అయితే రూ. 1,000బీ జీతం రూ. 10,000 నుంచి 20,000 మధ్య అయితే రూ. 2,000బీ జీతం రూ. 20,000 నుంచి 1 లక్ష రూపాయల వరకు అయితే రూ. 3,000. ఈ సహాయం సాధారణంగా రెండు సంవత్సరాలపాటు అందుతుంది. కానీ తయారీ రంగానికి ప్రత్యేక ప్రాధాన్యంతో ఇది మూడవ, నాలుగవ సంవత్సరాల వరకు పొడిగించబడుతుంది. తయారీ రంగానికి ఈ ప్రత్యేక దృష్టి అనేది ఊహాజనిత నిర్ణయం కాదు. ఇది భారతదేశ ఆర్థిక స్వావలంబనకు కీలకంగా భావించే రంగం. దీని ద్వారా స్థిర ఉద్యోగాలు, నైపుణ్యాల పెరుగుదల, ఉత్పాదకత మెరుగవుతాయి. అందుకే నాలుగు సంవత్సరాల ప్రోత్సాహం ఈ రంగాన్ని ప్రోత్సహించేందుకు సరైన విధానం. ఈ పథకం ద్వారా తయారీ రంగం ద్వారా సుమారు 2.6 కోట్ల ఉద్యోగాలు, అలాగే 1.92 కోట్ల మొట్టమొదటి ఉద్యోగులకూ ప్రత్యక్ష ప్రయోజనం అందే అవకాశం ఉంది. మొత్తం 3.5 కోట్ల ఉద్యోగాల లక్ష్యం అందుబాటులో ఉందనిపించడంలో ఆశాభావం ఉంది. ఇప్పటి వరకు అమలైన పథకాలతో పోలిస్తే, ఈ పథకం వేరియే. ఉదాహరణకు, కరోనా సమయంలో అమలులో ఉన్న "ఆత్మనిర్భర్ భారత్ రోజ్గార్ యోజన" తాత్కాలిక సహాయం మాత్రమే. ఈ పథకం మాత్రం సంక్షేమాన్ని దాటి దీర్ఘకాలిక భద్రతను లక్ష్యంగా పెట్టుకున్నది. ఆర్థిక విజ్ఞానం, డీబీటీ ఆధారిత పారదర్శక వ్యవస్థ, తయారీ రంగంపై ప్రత్యేక దృష్టి వంటి అంశాలు దీన్ని కొత్త తరహాలో నిలబెడుతున్నాయి. అయితే, ఈ పథకాన్ని విజయవంతం చేయాలంటే అమలు కీలకం. సంస్థలు నిజంగా కొత్త ఉద్యోగులను నియమించగలవా? ఉద్యోగులు ఈ అవకాశాన్ని పూర్తిగా వినియోగించుకుంటారా? కేంద్ర, రాష్ట్ర స్థాయిలలో పర్యవేక్షణ, గణాంకాల సేకరణ, మూల్యాంకన విధానాలు సమర్థవంతంగా అమలవుతాయా? ముఖ్యంగా చిన్న పట్టణాల్లో తక్కువ సాంకేతిక వనరులు ఉన్న చోట్లనైనా డీబీటీ ఆలస్యాలు లేకుండా అమలు చేయగలమా అన్నదే అసలైన పరీక్ష. ప్రభుత్వం ఒక శక్తివంతమైన ఐటీ మౌలిక వ్యవస్థను, జాతీయ స్థాయి అవగాహన కార్యక్రమాలను, సేవా మద్దతు కేంద్రాలను, పబ్లిక్ డాష్‌బోర్డులను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది. ఆర్థిక విజ్ఞాన శిక్షణను అందుబాటులో ఉండే భాషలలో అందించకపోతే అది అవరోధంగా మారే ప్రమాదమూ ఉంది. పథకం భారత యువత ముఖ్యంగా కొత్తగా ఉద్యోగం ప్రారంభించే వారికి ఒక నూతన మార్గాన్ని తెరుస్తోంది. ఉపాధి అనేది కేవలం జీవనాధారం కాదు. అది గౌరవానికీ భద్రతకూ మార్గం. సంక్షేమం గణాంకాల్లో మాత్రమే కాకుండా ప్రతి ఇంట్లో పరిమళించాలన్న లక్ష్యాన్ని ఇది ప్రతిబింబిస్తుంది. ఈ ప్రయోగం విజయవంతమైతే, భారతదేశంలో ఉద్యోగాల రంగంలో ఒక నూతన అధ్యాయాన్ని తెరిచే అవకాశం ఉంది. ఈ విధంగా చూడగా, ఇది కేవలం ప్రణాళిక కాదని, గమనించదగిన మార్పులకు బాట చూపే చర్యగా భావించాలి.

**జనక మోహనరావు దుంగ**
**8247045230**

# మోదీ ప్రకటనల వెనుక వాస్తవాలు



దేశంలో సంక్షోభాల రాష్ట్రీయాకరణ, సంపదల ప్రైవేటీకరణ అనే విరుద్ధ ధోరణుల మధ్య నడుస్తున్న పాలక విధానాలు అత్యంత మౌలికమైన ప్రశ్నలను మన ముందుకు తెస్తున్నాయి. ఈ పాలనల మధ్యలో బలైపోతున్నవారు అసలు సంపద సృష్టికర్తలైన శ్రామికులు. వారిని అభివృద్ధి పథంలో భాగస్వాములుగా చూడకుండా, ఓ భారంగా చూడడం వెనుక ఉన్న రాజకీయ ఆలోచనలే ఈ రోజు భారతదేశాన్ని ఆర్థిక, సామాజిక అసమానతల దిశగా నడిపిస్తున్నాయి. ప్రధాని నరేంద్ర మోదీ తన పదకొండేళ్ల పాలనను శ్రామిక సంక్షేమానికి అంకితమైందని ప్రకటించిన దూరదర్శన్ ప్రసంగం, వాస్తవ గణాంకాలతో సరిపోలని అసత్య ప్రకటనగా మిగిలిపోయింది. ఎందుకంటే అదే సమయంలో దేశంలో శతకోటీశ్వరుల సంఖ్య రెట్టింపు అవ్వగా, పౌష్టికాహారం లేక ఆకలితో బాధపడుతున్న గ్రామీణ ప్రజల సంఖ్య మూడు రెట్లు పెరిగింది. ఈ పరిస్థితికి మూలకారణం కేంద్ర ప్రభుత్వం చేపట్టిన కార్పొరేట్ అనుకూల విధానాలే. కార్మికుల శ్రామిక హక్కుల కోసం దశాబ్దాలుగా సాగిన పోరాటాలను ఒక్క క్షణంలో తుడిచిపెట్టేలా చట్టసవరణలు జరపడం, కార్మిక చట్టాలను రద్దు చేసి నాలుగు కొత్త లేబర్ కోడ్‌ల రూపంలో హక్కుల హరణకు దారితీయడం, రోజు 8 గంటల పని స్థానంలో 12 గంటల మానవరహిత వ్యవస్థను తీసుకురావడం **all these form the foundation of this distortion.** ఇది కేవలం శ్రామికులపై ఓ దాడి మాత్రమే కాదు, నూతన భారత్ నిర్మాణం అనే పేరుతో జరుగుతున్న ఓ సామాజిక నిర్మూలన ప్రయత్నం కూడా. కేంద్ర ప్రభుత్వం చెప్పే ఉపాధి కల్పన ప్రకటనలు ఒక వాస్తవిక పరిశీలనకు గురిచేస్తే, దాని వెనుక ఉన్న అసత్య ప్రబంధం కనిపిస్తుంది. ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాల హామీ ఇచ్చిన మోదీ ప్రభుత్వం, పదకొండేళ్లలో కనీసం పదకొండు కోట్ల ఉద్యోగాలు సృష్టించాలి. కానీ కేంద్ర ప్రభుత్వ స్వయంకృత నివేదికల ప్రకారమే ప్రభుత్వ రంగ ఉద్యోగాలు తగ్గుముఖం పట్టినవి. 2013లో 17.3 లక్షల ఉద్యోగాలు ఉన్న ప్రభుత్వ రంగ పరిశ్రమలు, 2022 నాటికి 14.6 లక్షలకు పడిపోయాయి. ఇది కేవలం ఉద్యోగ నష్టం మాత్రమే కాదుబీ దేశ ప్రజల జీవిత ప్రమాణాలపై ప్రభావం చూపే సంకేతం. ప్రభుత్వ బ్యాంకుల ఉద్యోగులు కూడా 8.5 లక్షల నుంచి 7.5 లక్షలకు తగ్గిపోయారు. అదే సమయంలో కాంట్రాక్టు ఉద్యోగుల శాతం 19 నుంచి 42.5 శాతానికి పెరిగిన పరిస్థితి, కూలీలు ఎంత అపస్వరంగా బతుకుతున్నారన్నదికి నిదర్శనం. ఇంకా దారుణమేమిటంటే, కార్మిక హక్కులపై జరిగిన దాడి మాత్రమే కాకుండా, కార్మికుల దైనందిన బతుకుబండిపైనూ వాణిజ్యపు నిశ్చితత్వం ప్రహారాలు మోదీ పాలనలో పెరిగిపోయాయి. దేశవ్యాప్తంగా కనీస వేతనం చట్టం అమలవ్వడం లేదు. దీనితో పాటు కార్పొరేట్ పన్ను తగ్గింపుతో ప్రభుత్వం ప్రతి ఏటా రూ.1.45 లక్షల కోట్ల ఆదాయం కోల్పోతోంది. ఇందులోని ద్వంద్వ ధోరణి ఏమిటంటే, కార్మిక సంక్షేమం కోసం నిధులు లేవన్న ప్రభుత్వం, కార్పొరేట్ సంస్థలకు పన్ను మినహాయింపులు, రుణాల మాఫీ, ప్రభుత్వ రంగ ఆస్తుల విక్రయాలతో లక్షల కోట్ల విలువైన నిధులను బహుమతుల్లా పంచుతోంది. 2014 నుంచి 2025 వరకు రూ.16.61 లక్షల కోట్ల కార్పొరేట్ బ్యాంకు రుణాలను రద్దు చేయడం ఒక ప్రభుత్వ వ్యర్థ బాధ్యతాపూరిత ఆచరణకు పరాకాష్ట. వాస్తవంలో కార్మికులు ఎన్ని కష్టాలు పడుతున్నారన్న దానికి సంబంధించి పౌష్టికాహారం, ఆరోగ్యం, ఉపాధి అంశాలు తీవ్రంగా ప్రతిబింబిస్తాయి. 2023%–%24లో గ్రామీణ భారతదేశంలో 40 శాతం మంది ప్రజలు రెండుపూటలు తినలేని స్థితిలో ఉన్నారు. ఐదేళ్ల లోపు పిల్లలలో 36 శాతం మందికి తగిన బరువు లేనిదే జీవితం సాగుతోంది. మహిళలలో రక్తహీనత శాతం 57.2కి పెరగడం, గర్భిణీలలో అది 52.2 శాతంగా ంఈ ఆర్థిక అసమానతల ప్రక్రియ కేవలం శ్రామికులపై మోదీ పాలన దాడి చేసింది అన్నదికాదు, అది భారత ప్రజాస్వామ్యానికి తలపెట్టిన కుట్రగా కూడా చూడాలి. రిజర్వేషన్ నెపంతో వచ్చే సామాజిక న్యాయం అవకాశాలే తగ్గిపోతున్నాయి. ప్రభుత్వ రంగ ఉద్యోగాల లోపం దాని దుష్ఫలితంగా కార్మికులు, దళితులు, ఆదివాసీలు, మైనారిటీ వర్గాలు ఉపాధి అవకాశాల నుంచి మరింత వెనుకబడుతున్నారు. కేంద్ర ప్రభుత్వం వ్యవస్థాపితంగా ప్రభుత్వ రంగాన్ని ఖండించి, ప్రైవేటీకరణ దిశగా అన్ని రంగాలను మలుచుకోవడమే దీనికి మూలకారణం. అదే సమయంలో ఉపాధి పొందే అవకాశాలను పూర్తిగా ప్రైవేట్ రంగానికి వదిలేస్తూ, ఆ రంగాన్ని నియంత్రించని విధానాల వల్ల సంపద కొద్దిమందిలో కేంద్రీకృతమవుతోంది. 2014లో వంద మంది శతకోటీశ్వరులు ఉన్న దేశంలో 2024 నాటికి వారి సంఖ్య రెండు వందలకు చేరడం, వారి సంపద రూ.85 లక్షల కోట్లకు పైగా చేరడం ఈ ధోరణికి ప్రతీక. ఇంకా గమనించవలసిన విషయం ఏమిటంటే, కార్మిక వేతనాల్లో గణనీయమైన క్షీణత ఏర్పడినప్పటికీ, కార్పొరేట్ లాభాలు మాత్రం 13 శాతం మేర పెరిగాయి. నికర జోడింపు విలువలో కార్మికుల వాటా 18.9 శాతం నుంచి 15.9 శాతానికి పడిపోతే, అదే సమయంలో కార్పొరేట్ లాభాల వాటా 38.7 శాతం నుంచి 51.9 శాతానికి పెరిగిన దృష్టాంతం ఈ దేశంలో సంపద కేవలం కొందరికి మాత్రమే చెందుతోందన్నది నిర్ధారిస్తుంది. ఇది కేవలం ఆర్థిక అసమానత మాత్రమే కాదుఒక విధంగా సామాజిక ఆత్మహత్య కూడా. అలాంటి సమయంలో కార్మిక సంఘాల ఆధ్వర్యంలో జూలై 9న అఖిల భారత సమ్మెకు పిలుపు ఇవ్వడం యాదృచ్ఛికం కాదు. ఇది కేవలం ఆందోళన మాత్రమే కాదు, దీని వెనుక ఉన్నది ఓ స్పష్టమైన సందేశం. శ్రామికులు ఈ న్యాయహీన వ్యవస్థను %ఖుఅఎఎశీతీవ% భరించలేరు. ఈ పోరాటం దినచర్యల్లోనే ఒక భాగంగా మారాల్సిన అవసరం ఉంది. ఇదో రాజకీయ పోరాటం, సామాజిక పోరాటం, ఆర్థిక సమానత్వానికి ప్రతిజ్ఞగా మారవలసిన సమయం. కార్మికుల సంక్షేమం అంటే కేవలం వేతనాల పెంపు కాదు, అది జీవన ప్రమాణాల మెరుగుదల, హక్కుల పరిరక్షణ, మానవ మర్యాదకు భద్రత అనే భావనగా మారాలి.

భారతదేశం విశ్వగురుగా మారాలంటే మొదటిది కార్మికులను విశ్వసింహాలుగా చూడాలి. అసలైన సంపద సృష్టికర్తలు భద్రతగా ఉండకపోతే, దేశ ఆర్థిక నిర్మాణమే కూలిపోతుంది. వాస్తవికంగా చూస్తే, బ్రిటిష్ ఇండియాలో కూడా కార్మికులు నేడు ఎదుర్కొంటున్న అంత ఆర్థిక అసమానతలను చూడలేదు. మోదీ పాలనలో కార్మికులు ఒక్క వైపు తమ హక్కులు కోల్పోతూ, మరో వైపు అధికంగా పని చేయాల్సిన అవసరంతో, జీవన ఖర్చులు భరించలేని స్థితిలో ఉన్నారు. ప్రభుత్వ విధానాలు ప్రజల అభివృద్ధిని గాక, కార్పొరేట్ వ్యాపారాల అభివృద్ధికి మాత్రమే దోహదపడుతున్నాయి. దేశం యొక్క భవిష్యత్ విషయంలో ఇటువంటి పాలన తీరును గట్టిగా ప్రశ్నించకపోతే, అది ఓ సమాజంగా మనం చేస్తున్న ఘోర తప్పిదమవుతుంది. ఆర్థిక రాజ్యాంగం సమానత్వం, న్యాయం అనే విలువలపై ఆధారపడి ఉండాలి. అది కేవలం వృద్ధి అనే పదం చుట్టూ తిరగకూడదు. వృద్ధికి అర్థం శ్రామికుడికి మేలు జరిగితేనే. లాభం అంటే ఆ లాభంలో కార్మికుడికి వాటా ఉంటేనే. ప్రగతి అంటే అందరికీ సమానంగా పంచిన నాణ్యత ఉన్న జీవితమైతేనే. లేదంటే ఈ దేశానికి ఎన్ని డబుల్ డిజిట్ జీడీపీ గణాంకాలు ఉన్నా, అది ఓ బోసిన అభివృద్ధి. ఈ నేపథ్యంలో, జూలై 9న జరిగే అఖిల భారత సమ్మె ఒక ఉద్యమముగా నిలవాలి. ఈ సమ్మె కేవలం కార్మిక హక్కుల కోసం కాకుండా, భారత రాజ్యాంగాన్ని, సామాజిక న్యాయాన్ని, సమానత్వాన్ని పరిరక్షించే సమ్మెగా మారాలి. ఇది సంపద సృష్టికర్తలకు ఓ గౌరవప్రదమైన జీవితాన్ని సమర్పించాలన్న సంకల్పానికి రూపం కావాలి. ఇందుకోసం మనందరం కేవలం పర్యవేక్షకులుగా కాకుండా, భాగస్వాములుగా మారాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఎందుకంటే, ఒక సమాజంలో సంపద సృష్టికర్తలు బాధలో ఉన్నపుడు, ఆ సమాజం సంక్షేమ భవిష్యత్తు కలగలిపే కలగా మిగిలిపోదు. అది ఒక చెరగా మారుతుంది. ఈ చెర నుంచి విముక్తికి పోరాటమే మార్గం.

**–సహాయ మీడియా సర్వీస్**
**9246213493**

భక్తి

## ఆయన దీక్షకు నూరేళ్లు



"ప్రతి ఒక్కరిలో భగవంతుడు ఉన్నాడు. కాబట్టి మీ ఎదుటి వ్యక్తిలోని ఆ దేవుణ్ణి దర్శించండి" అని ప్రబోధించిన మానవతావాది... "మానవ జీవిత లక్ష్యం భగవదైక్యం, మోక్షసాధన. నిరంతరం భగవంతుని ధ్యాసలో గడపడం, ప్రేమతో నిస్వార్థంగా సేవ చేయడం ద్వారా ఆ జీవిత లక్ష్యం నెరవేర్చుకోగలం" అని ప్రవచించిన ఆధ్యాత్మికవాది... అవతార్ మెహెర్‌బాబా. ఆయన మౌనం చేపట్టి ఈనెల 10వ తేదీకి వందేళ్ళు పూర్తవుతున్నాయి. ఈ సందర్భంగా 'మెహెర్‌బాబా శతవర్ష మౌన వార్షికోత్సవాల' కోసం భక్తులు ఘనంగా ఏర్పాట్లు చేస్తున్నారు.

"నేను బోధించడానికి రాలేదు. మేలుకొలపడానికి వచ్చాను" అని ప్రకటించిన మెహెర్‌బాబా 1894 ఫిబ్రవరి 25న పుణేలో జన్మించారు. తల్లితండ్రులు పెట్టినపేరు మేర్వాన్. పుణేలోని దక్కన్ కళాశాలలో మేర్వాన్ చదువుకొనేవాడు. ఒకరోజు అతను కాలేజీ నుంచి వస్తున్నాడు. అప్పటికే నూరేళ్ళ వయసు పైబడిన హజ్రత్ బాబాజాన్ అనే మహిళా గురువు ఆయన నుదుటిమీద ముద్దాడింది. వెంటనే మేర్వాన్ బాహ్య ప్రపంచ చైతన్యాన్ని కోల్పోయాడు. ఆ తరువాత... మేర్వాన్‌ను భగవంతుని స్వరూపంగా నాటి గురువులైన షిరిడీ సాయిబాబా, ఉపాసినీ మహరాజ్, నారాయణ్ మహరాజ్, తాజుద్దీన్ బాబా తదితరులు కీర్తించారు. తదనంతరం మేర్వాన్‌ను 'మెహెర్‌బాబా... అంటే దయగల తండ్రి' అని ఆయన శిష్యులు పిలవడం ప్రారంభించారు.

ప్రేమే నా మతం...మెహెర్‌బాబా 1925 జూలై 10న మౌన దీక్ష చేపట్టారు. దాన్ని 1969 జనవరి 31న శరీరత్యాగం చేసేవరకూ... అంటే 44 ఏళ్ళు విడనాడలేదు. మౌనంగానే వేలాది కిలోమీటర్లు పర్యటించారు. మౌనం చేపట్టిన మొదటి ఏడాదిన్నరకాలం పలక మీద బలపంతో తన మాటలు చెప్పేవారు. ఆ తరువాత నుంచి 1954 అక్టోబర్ ఏడోతేదీ వరకు... అక్షరమాల ఉన్న ఒక పలక ద్వారా అనేక విషయాలు సంభాషించేవారు. తరువాత దాన్ని కూడా త్యజించి... కేవలం సంజ్ఞల ద్వారా తన సందేశాలను, ఆదేశాలను తన అనుయాయులకు అందించారు. 1950వ దశకంలో ఆయన ఘోరమైన రెండు కారు ప్రమాదాలకు గురయ్యారు. వాటిలో ఆయన దేహంలోని కుడి, ఎడమ భాగాలు దాదాపు నుజ్జు నుజ్జయ్యాయి. సాధారణ మానవులెవరూ ఈ ప్రమాదాలను తట్టుకొని తిరిగి నడవలేరని ప్రముఖ వైద్యులు ప్రకటించారు. భౌతికంగా ఎదురైనా తన మౌన దీక్షను ఆయన విడిచి పెట్టలేదు. మౌనం ఆయన ఆధ్యాత్మిక కార్యకలాపాలకు ఏమాత్రం ఆటంకం కాలేదు. తన మౌనం గురించి వివిధ సందర్భాల్లో ఆయన ప్రస్తావిస్తూ "నేను ఎప్పుడూ మౌనంగా లేను. నా ప్రేమికుల హృదయాలతో నిరంతరం మాట్లాడుతూనే ఉన్నాను" అని చెప్పారు. పూర్వం శ్రీరామునిగా, శ్రీకృష్ణుడిగా, బుద్ధునిగా, ఏసు ప్రభువుగా... ప్రస్తుత కాలంలో మెహెర్‌బాబాగా మానవరూపంలో అవతరించానని స్పష్టం చేశారు. తాను ఎలాంటి మతం స్థాపించడానికి రాలేదని, అన్ని మతాలు ఒక్కటేనని, "నా మతం ప్రేమ" అని స్పష్టం చేశారు. "మీరు చూస్తున్న ఈ ప్రపంచం ఒక మిధ్య. ఇది ఒక కలలాంటిది. ఈ నిజాన్ని మీకు తెలియజేయడానికే ఈ అవతార కాలంలో మెహెర్‌బాబాగా మీ ముందుకు వచ్చాను" అని చెప్పారు.

నవభూమి
www.navabhoomi.in
www.epaper.navabhoomi.in
9 హైదరాబాద్ మంగళవారం 08 జులై 2025

## మళ్లీ టీవీ షోలోకి మాజీ కేంద్ర మంత్రి.. ఫస్ట్ లుక్ రిలీజ్



**న్యూదిల్లీ-నవభూమి:** మాజీ కేంద్ర మంత్రి స్మృతి ఇరానీమళ్లీ టీవీ షోల్లో నటిస్తోంది. రాజకీయాల్లోకి రాకముందు .. క్యోంకి సాస్ బీ కబీ బహు తి .. టీవీ సీరియల్‌లో స్మృతి నటించేది. అయితే ఫుల్ టైం రాజకీయాల్లోకి వచ్చాక ఆమె ఆ షోకు బ్రేక్ వేసింది. ఇప్పుడు మళ్లీ క్యోంకి సాస్ బీ కబీ బహు తీ షోలో నటిస్తోంది. దానికి సంబంధించిన ఫస్ట్ లుక్‌ను రిలీజ్ చేశారు. క్యోంకి సాస్ బీ కబీ బహు తీ సీరియల్ 2000 నుంచి 2008 మధ్య ప్రసారమైంది. ఏడేళ్ల పాటు వరుసగా ఆ సీరియల్ నెంబర్ వన్ స్పాట్‌లో ఉన్నది.తులసీ వీర్వాని పాత్రలో స్మృతి ఇరానీ నటిస్తోంది. ఫస్ట్ లుక్ డ్రెస్సులో.. స్మృతి మెరూన్ రంగు చీరలో ఉన్నది. జరీ పట్టు బోర్డర్ ఉన్న చీరను ఆమె ధరించింది. చాలా పెద్ద సైజులో ఉన్న ఎరుపు రంగ బొట్టు పెట్టుకున్నది. బంగారు ఆభరణంతో పాటు బ్లాక్ బీమ్ మంగళసూత్రాన్ని ఆమె ధరించింది. వీ ద వుమెన్ షోలో బర్కా దత్త, కరణ్ జోహార్ తో మాట్లాడుతూ తన పాత్ర గురించి ఆమె తెలిపారు.క్యోంకి సాస్ బీ కబీ బహు తీ షోలో నటించాలన్న ఒప్పందం ఉందని, 2014లో మళ్లీ ఆ సీరియల్ చేయాలన్న ఒప్పందం ఉంది అని, కానీ పార్లమెంట్‌కు ఎన్నిక కావడం వల్ల టీవీ షో ఒప్పందాన్ని బ్రేక్ చేయాల్సి వచ్చిందన్నారు. కేంద్ర మంత్రిగా ప్రమాణం చేయాలని పీఎంవో ఆఫీసు నుంచి కాల్ రాగానే తన నిర్ణయాన్ని మార్చుకున్నట్లు ఆమె వెల్లడించారు. టీవీ, సినిమాల్లో నటించడం కన్నా.. దేశానికి సేవ చేయడం గొప్ప విషయం అవుతుందని రిషి కపూర్ చెప్పిన మాటల్ని ఆమె గుర్తు చేశారు.


## 'స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్'పై సుప్రీంలో పిటిషన్‌లో..

### 10న విచారించనున్న సర్వోన్నత న్యాయస్థానం..!



**న్యూదిల్లీ-నవభూమి:** ఓటర్ జాబితా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియను సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లపై ఈ నెల 10న సుప్రీంకోర్టు విచారించనున్నది. ఈ కేసులో దాఖలైన పిటిషన్లను విచారించేందుకు సర్వోన్నత న్యాయస్థానం అంగీకరించింది. ఎన్నికల కమిషన్ తీసుకున్న చర్యల చెల్లుబాటును పరిశీలించనున్నట్లు పేర్కొంది. పలువురు పిటిషన్ల తరఫున సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ వినిపించిన వాదనలను పరిగణలోకి తీసుకున్న జస్టిస్ సుధాన్షు ధులియా, జస్టిస్ జోయ్‌మల్యా బాగ్చి బెంచ్ గురువారం కేసును విచారించేందుకు అంగీకరించింది.%ఈ పిటిషన్‌లపై ఎన్నికల కమిషన్‌కు నోటీసులు జారీ చేయాలని బెంచ్‌ను సిబల్ కోరగా.. విచారణ జరుగుతుందని జస్టిస్ సుధాన్షు తెలిపారు. బిహార్ ఎన్నికల నేపథ్యంలో ఓటర్ల జాబితా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ నిర్వహించాలన్న కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాలను సవాల్ చేస్తూ ఆర్జేడీ ఎంపీ మనోజ్ ఝా, టీఎంసీ ఎంపీ మహువా మొయిత్రాతో పాటు ఏడీఆర్ సంస్థ పిటిషన్ దాఖలు చేశారు. ఓటర్ల జాబితా సవరణకు వ్యతిరేకిస్తూ స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియను వెంటనే అమలు చేయాలని ఎన్నికల కమిషన్ ఇచ్చిన ఆదేశాలను కొట్టివేయాలని మనోజ్ ఝా కోరారు.ఈసీ ఉత్తర్వులు ఉత్తర్వు రాజ్యాంగంలోని ఆర్టికల్ 14 (సమానత్వ హక్కు), ఆర్టికల్ 21 (జీవించే హక్కు-వ్యక్తిగత స్వేచ్ఛ), ఆర్టికల్ 325 (కులం, మతం, లింగం ఆధారంగా ఎవరినీ ఓటరు జాబితా నుంచి మినహాయించకూడదు), ఆర్టికల్ 326 (18 సంవత్సరాలు నిండిన ప్రతి భారతీయ పౌరుడు ఓటరుగా నమోదు చేసుకోవడానికి అర్హులు)లను ఉల్లంఘిస్తుందని.. ఆదేశాలను రద్దు చేయాలని మనోజ్ ఝా కోరారు. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ రాజ్యాంగంలోని నిబంధనలు ఉల్లంఘించిందని ఎంపీ మహువా మొయిత్రా ఆరోపించారు. ఇది ఇలాగే కొనసాగితే దేశంలో పెద్ద సంఖ్యలో ఓట్లు కోల్పోయే అవకాశం ఉంటుందని పేర్కొంది. ప్రజాస్వామ్యాన్ని, స్వేచ్ఛాయుతమైన ఎన్నికలను బలహీనంగా మారుస్తుందన్నారు. అసోసియేషన్ ఆఫ్ డెమోక్రటిక్ రిఫార్మ్స్‌సైతం పిటిషన్ దాఖలు చేసింది.

## హిమాచల్ ప్రదేశ్‌లో నీట మునిగిన బ్యాంకు.. కోట్లలో నష్టం అంచనా



**సిమ్లా-నవభూమి:** హిమాచల్ ప్రదేశ్‌ను వరదలు ముంచెత్తాయి. ఈ నేపథ్యంలో ఆ రాష్ట్ర సహకార బ్యాంకు నీట మునిగింది. లక్షల్లో నగదు, లాకర్లలో దాచిన నగలు, విలువైన పత్రాలు పాడైనట్లు భావిస్తున్నారు. దీంతో కోట్లలో నష్టం జరిగినట్లు అంచనా వేస్తున్నారు. మండి జిల్లాలోని తునాగ్‌లో హిమాచల్ ప్రదేశ్ రాష్ట్ర సహకార బ్యాంకు చాలా ప్రసిద్ధి. సమీపంలోని పట్టణాలకు చెందిన వందలాది మంది వ్యాపారులు, వేలాది మంది ఖాతాదారులు తమ డబ్బును ఈ బ్యాంకులో డిపాజిట్ చేస్తుంటారు. నగదుతోపాటు నగలు, విలువైన పత్రాలను బ్యాంకు లాకర్లలో దాచుకున్నారు.కాగా, జూన్ 20 నుంచి జూలై 6 వరకు హిమాచల్ ప్రదేశ్‌లో భారీ వర్షాలు కురిశాయి. ఈ నేపథ్యంలో ఆ రాష్ట్రాన్ని 23 ఆకస్మిక వరదలు ముంచెత్తాయి. వర్షాలు, వరదలకు మండి జిల్లా అతలాకుతలమైంది. ఈ నేపథ్యంలో తునాగ్ మార్కెట్ ప్రాంతంలోని రెండతస్తుల బిల్డింగ్‌లో ఉన్న రాష్ట్ర సహకార బ్యాంకు వరద నీటిలో పూర్తిగా మునిగిపోయింది. నీటి ప్రవాహం ఉధృతికి ఒక షట్టర్ పైకి లేచింది. మరో రెండు షట్టర్‌లు వంకరపోయాయి.మరోవైపు వరద నీటి వల్ల ఆ బ్యాంకులోని లక్షలాది నగదుతోపాటు లాకర్లలో ఉన్న నగలు, డబ్బు, ఇతర పత్రాలు పాడై ఉంటాయని బ్యాంకు అధికారులు భావిస్తున్నారు. కోట్లలో నష్టాన్ని అంచనా వేస్తున్నారు. దీంతో వ్యాపారులు, కస్టమర్లు ఆందోళన చెందుతున్నారు. వరదల వల్ల ఆ బ్యాంకు నుంచి కొట్టుకుపోయిన విలువైన వస్తువులు చోరీ కాకుండా ఉండేందుకు స్థానికులు అక్కడ కాపలా ఉన్నారు.

## బీహార్ ఎన్నికల సంఘం పోస్టాఫీస్‌లా పనిచేస్తోంది : తేజస్వి యాదవ్



**పాట్నా-నవభూమి:** అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో బీహార్‌లో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ పేరుతో ఓటర్ల జాబితా ను సవరించనున్నట్లు కేంద్ర ఎన్నికల సంఘం ఇటీవల ప్రకటించింది. దీనిపై బీహార్‌లో ప్రతిపక్ష మహాకూటమి తీవ్ర అభ్యంతరం వ్యక్తంచేస్తోంది. ఎన్నికలకు కేవలం రెండు నెలల ముందు ఓటర్ల జాబితా సవరణ దేనికని, రెండు నెలల్లో జాబితాను సవరించడం సాధ్యమా..? అని ఆర్జేడీ కీలక నేత తేజస్వి యాదవ్ ప్రశ్నిస్తున్నారు. తాము ఈ నెల 5న ఎన్నికల సంఘాన్ని కలిసి అతి తక్కువ సమయంలో ఎన్నికల జాబితాను సవరించడంతో వచ్చే సమస్యలపై సందేహాలు లేవనెత్తామని తేజస్వి యాదవ్ తెలిపారు. కానీ ఎన్నికల సంఘం నుంచి తమకు ఇంతవరకు ఎలాంటి వివరణ రాకపోవడం ఆందోళనకరమైన విషయమని అన్నారు. బీహార్ ఎన్నికల సంఘం కేవలం పోస్టాఫీస్‌లా పనిచేస్తున్నదని, తమ సందేహాలకు సమాధానం ఇచ్చే అధికారం రాష్ట్ర ఎన్నికల సంఘం దగ్గర లేదని విమర్శించారు.ఎన్నికల సంఘం ఆదివారం మూడు పరస్పర విరుద్ధమైన సూచనలు చేసిందని, దీన్నిబట్టి పోల్ బాడీ కన్ఫ్యూజన్‌లో ఉందనే విషయం స్పష్టమవుతోందని తేజస్వియాదవ్ చెప్పారు. ఎన్నికల సంఘం చేస్తున్న పరస్పర విరుద్ధ సూచనలు, పత్రికా ప్రకటనలు తమ కూటమి పార్టీలను ఆందోళనకు గురిచేస్తున్నాయని అన్నారు. తమ సందేహాలకు ఎన్నికల సంఘం సమాధానం ఇవ్వాలని డిమాండ్ చేశారు.

## మహారాష్ట్ర తీరంలో అనుమానాస్పద బోటు కలకలం.. పోలీసులు హై అలర్ట్

**రాయ్‌గఢ్-నవభూమి:** మహారాష్ట్ర సముద్రతీరంలో ఓ విదేశీ బోటు కలకలం రేపుతోంది. రాయ్‌గఢ్ జిల్లాలోని రేవ్‌దండాలో గల కొర్లై తీరం సమీపంలో అనుమానాస్పద బోటును భద్రతా సిబ్బంది గుర్తించారు. దీంతో అలర్ట్ అయిన అధికారులు తీర ప్రాంతంలో భద్రతను పెంచారు.రేవ్‌దండాలోని కొర్లై తీరానికి రెండు నాటికల్ మైళ్ల దూరంలో ఈ పడవను భద్రతా సిబ్బంది గుర్తించింది. పడవకు పాకిస్థాన్ గుర్తులు ఉన్నట్లు సమాచారం. అది తీరానికి కొట్టుకొచ్చి ఉండొచ్చని అనుమానిస్తున్నారు. అనుమానాస్పద పడవ గురించి సమాచారం అందుకున్న రాయ్‌గఢ్ పోలీసులు బాంబ్ స్క్వాడ్ బృందంతో అక్కడికి చేరుకొన్నారు.

# బ్రిక్స్ దేశాలకు ట్రంప్ సుంకాల బెదిరింపులపై స్పందించిన చైనా



**న్యూదిల్లీ-నవభూమి:** బ్రిక్స్ దేశాలకు అదనంగా 10 శాతం సుంకాలు విధిస్తానన్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హెచ్చరికలపై చైనా ఘాటుగా స్పందించింది. టారిఫ్‌ల వల్ల మానవ సంబంధాలకు మేలు జరగదని, అవి రాజకీయ ఒత్తిడికి సాధనంగా మారరాదని చైనా స్పష్టం చేసింది. "టారిఫ్‌ల వినియోగం ఎవరికి కూడా ఉపయోగపడదు. మేము ఇతరులను బెదిరించే సాధనంగా సుంకాలను ఉపయోగించడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాం" అని బీజింగ్‌లో జరిగిన మీడియా సమావేశంలో చైనా విదేశాంగ శాఖ ప్రతినిధి పేర్కొన్నారు.అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తన సొంత సామాజిక మాధ్యమం ట్రూత్ సోషల్‌లో "బ్రిక్స్ ( విధానాలను అనుసరిస్తున్న ఏ దేశమైనా 10 శాతం అదనపు సుంకానికి గురవుతుంది.. ఇందులో ఎలాంటి మినహాయింపు ఉండదు" అని హెచ్చరించారు. అమెరికా సుంకాలను విమర్శిస్తూ ఇటీవల బ్రిక్స్ కూటమి ప్రకటన వెలువరించిన అనంతరం ట్రంప్ బెదిరింపులకు పాల్పడటం గమనార్హం. ఈ నేపథ్యంలో బ్రిక్స్ ఉద్దేశం ఘర్షణ కాదు, సహకారం, సమావేశాత్మక అభివృద్ధి అని స్పష్టం చేసింది. "బ్రిక్స్ ఘర్షణలకు కోసం కాదు.. ఇది సమతుల్యమైన, సమావేశిత ప్రపంచ వ్యవస్థను నిర్మించేందుకు ఉద్దేశించిన వేదిక," అని చైనా విదేశాంగ శాఖ పేర్కొంది. కాగా, అమెరికా డాలర్‌కు ప్రత్యామ్నాయంగా బ్రిక్ కూటమి కరెన్సీని కూడా తీసుకొచ్చే ప్రయత్నాలు చేస్తోంది.

బ్రిక్స్ కూటమిలో బ్రెజిల్, రష్యా, భారతదేశం, చైనా, దక్షిణాఫ్రికాలు ఉండగా.. ఇటీవల ఈజిప్ట్, యూఏఇ వంటి దేశాలు కూడా చేరిన సంగతి తెలిసిందే. ట్రంప్ వ్యాఖ్యలు ఈ దేశాలపై అమెరికా ఒత్తిడి పెంచే అవకాశమున్నాయని విశ్లేషకులు భావిస్తున్నారు.అయితే, బ్రిక్స్ దేశాల కూటమిని అమెరికా వ్యతిరేక కూటమిగా ట్రంప్ అభివర్ణించారు. ఏ దేశమైనా అమెరికా వ్యతిరేక విధానాలకు మద్దతు ఇస్తే.. వాటిపై అదనంగా 10 శాతం టారిఫ్‌లు విధిస్తామని స్పష్టం చేశారు. ఇక, రెండోసారి అధికారం చేపట్టిన అనంతరం ఈ ఏడాది ఏప్రిల్ 2 న ట్రంప్ లిబరేషన్ డే పేరుతో భారీగా సుంకాలను ప్రకటించి వాణిజ్య యుద్ధానికి తెరతీశారు. అమెరికా వాణిజ్య భాగస్వామ్య దేశాలు దశాబ్దాలుగా తమను దోచుకుంటున్నాయని ట్రంప్ ఆరోపించారు. బ్రిక్స్ కూటమిలో మరో 30 దేశాలు చేరేందుకు ఆసక్తి చూపుతున్నాయి.

ఈ క్రమంలో వాణిజ్య భాగస్వామ్య దేశాలపై టారిఫ్‌లు వడ్డించారు. వీటి అమలు నిలిపివేయాలంటే తమతో ఒప్పందాలు చేసుకోవాలని షరతులు విధించారు. ఇప్పటి వరకూ అమెరికాతో కేవలం రెండు దేశాలు మాత్రమే ఒప్పందాలు చేసుకున్నాయి. ఇక, చైనాపై కూడా ట్రంప్ భారీ సుంకాలు విధించగా.. దీనికి ప్రతీకారంగా చైనా కూడా రెట్టింపు టారిఫ్‌లు ప్రకటించింది. ఇరు దేశాలూ పోటాపోటీగా టారిఫ్‌లు వేసుకోవడంతో ఉద్రిక్తతలు నెలకున్నాయి. చివరకు ట్రంప్ మెట్టుదిగి.. చైనాపై సుంకాలను తాత్కాలికంగా నిలిపివేశారు.

## దళపతి విజయ్‌కి షాక్ ఇచ్చిన ప్రశాంత్ కిషోర్..!



**చెన్నై-నవభూమి:** స్టార్ హీరో దళపత్తి విజయ్ పొలిటికల్ ఎంట్రీ ఇచ్చిన విషయం తెలిసిందే. తమిళగ వెట్రి కళగం (టీవీకే) పేరుతో పార్టీ స్థాపించి.. ముఖ్యమంత్రి అభ్యర్థిగా బరిలోకి దిగుతున్నారు. ఈ ఏడాది ఫిబ్రవరిలో జరిగిన టీవీకే రెండవ వార్షికోత్సవ కార్యక్రమానికి ప్రత్యేక అతిథిగా హాజరైన ప్రశాంత్ కిశోర్, విజయ్ నాయకత్వంలోని పార్టీకి పూర్తి మద్దతు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నట్లు ప్రకటించారు. తమిళనాడులో రాజకీయ మార్పు తేవడమే లక్ష్యంగా టీవీకే పని చేస్తోందని, అందుకు తన వ్యూహాత్మక మార్గదర్శకత ఇవ్వడానికి ముందుకు వచ్చారు. పార్టీ ఎన్నికల వ్యూహాల రూపకల్పనలో కీలకపాత్ర పోషిస్తూ, టీవీకేను రాష్ట్రంలో ప్రధాన శక్తిగా మార్చేందుకు ప్రయత్నిస్తున్నారు. అయితే కానీ అనూహ్యంగా పార్టీకి వ్యూహకర్తగా ఉన్న ప్రశాంత్ కిశోర్ (పీకే) ప్రస్తుతం తాత్కాలికంగా విరామం తీసుకున్నాడు. ఇది టీవీకే రాజకీయ వ్యూహాలపై తాత్కాలిక ప్రభావం చూపే అవకాశం ఉందని భావిస్తున్నారు. అయితే ప్రస్తుతం బీహార్ శాసనసభ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో, ప్రశాంత్ కిశోర్ తన సొంత రాష్ట్రంలోని 'జన్ స్వరాజ్ పార్టీ' అభ్యర్థులను బరిలోకి దించేందుకు జోరుగా ఏర్పాట్లు చేస్తున్నారు. దీంతో తమిళనాడులో టీవీకే ఎన్నికల వ్యూహాలపై సమయం కేటాయించలేని పరిస్థితి నెలకొంది. ఈ కారణంగా ఆయన తాత్కాలికంగా టీవీకే బాధ్యతల నుంచి తప్పుకున్నారు. నవంబర్ నాటికి పీకే తిరిగి బాధ్యతలు చేపడతారని అంచనాలు ఉన్నాయి. 2026లో జరగనున్న తమిళనాడు శాసనసభ ఎన్నికల ప్రణాళికలు రూపొందించనున్నారని చెబుతున్నారు. %ుశీషవతీవఎ దీఎ% మరోవైపు విజయ్ నాయకత్వంలోని టీవీకే పార్టీ ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా పలు నియోజకవర్గాల్లో పార్టీ కార్యకర్తల్ని నియమిస్తూ, ప్రజలలో మార్పు తేవాలన్న ఆశయంతో ముందుకు సాగుతోంది. రాబోయే ఎన్నికల్లో ఎవరితో పెట్టుకోమని స్పష్టం చేసింది.

## ఆపరేషన్ బ్లాక్ ఫ్లాగ్.. యెమెన్‌పై విరుచుకుపడిన ఇజ్రాయెల్



**న్యూదిల్లీ-నవభూమి:** ఇజ్రాయెల్-ఇరాన్ దేశాల మధ్య శాంతి నెలకొన్నప్పటికీ.. ఇజ్రాయెల్ ఇప్పుడు మరో కొత్త దేశంపై దాడి చేసింది. ఇజ్రాయెల్ దాడి చేసిన ఆ దేశం యెమెన్. ఇజ్రాయెల్ యెమెన్‌లోని హౌతీ తిరుగుబాటుదారులను లక్ష్యంగా చేసుకుంది. దీని కారణంగా మధ్యప్రాచ్యంలో మరోసారి ఉద్రిక్తతలు పెరిగాయి. "ఆపరేషన్ బ్లాక్ ఫ్లాగ్" ద్వారా ఇజ్రాయెల్ యెమెన్ పశ్చిమ భాగంలో ఉన్న మూడు ప్రధాన నౌకాశ్రయాలపై దాడి చేసింది. ఇజ్రాయెల్ వైమానిక దళం యెమెన్‌లోని హౌతీ నియంత్రణలోని హుదైదా, రాస్ ఈసా, సైఫ్ ఓడరేవులపై భారీ వైమానిక దాడులు చేసింది. హౌతీల మిస్సైల్ దాడులకు ప్రతీకారంగా ఇజ్రాయెల్ ఈ దాడి చేసింది. అంతకు ముందు ఇజ్రాయెల్ ఇరాన్ అణు స్థావరాలను లక్ష్యంగా చేసుకున్న సంగతి తెలిసిందే. దాడికి ముందు ఇజ్రాయెల్ యెమెన్‌లోని హుదైదా, రాస్ ఈసా, సైఫ్ ప్రాంతాల పౌరులకు హెచ్చరికలు జారీ చేసింది. ఆ ప్రాంతాలను ఖాళీ చేసి సురక్షిత ప్రాంతాలకు వెళ్లమని సూచించింది. ఇజ్రాయెల్ వైమానిక దళం ఎప్పుడైనా దాడి చేయవచ్చని వారికి తెలిపారు. హెచ్చరికలు జారీ చేసిన కొన్ని గంటల్లోనే వైమానిక దాడులు ప్రారంభమయ్యాయి. గాజాలోని పాలస్తీనియన్లకు మద్దతుగా హౌతీలు ఇజ్రాయెల్ పై మిస్సైల్ దాడులకు దిగారు. ఈ క్రమంలో ఇజ్రాయెల్ హౌతీ స్థావరాలపై గురిపెట్టింది. ఈ క్రమంలో ఇజ్రాయెల్ రక్షణ మంత్రి ఇజ్రాయెల్ కాట్జ్ ఈ దాడులను ధ్రువీకరించారు. రక్షణ మంత్రి హెచ్చరిస్తూ.. "హౌతీలు ఏ చర్య తీసుకున్నా.. దానికి వారు మూల్యం చెల్లించుకోవలసి ఉంటుంది. యెమెన్‌కు కూడా ఇరాన్‌కు పట్టిన గతే పడుతుంది. ఇజ్రాయెల్ కు వ్యతిరేకంగా చేయి ఎత్తిన వారి చేతులు నరికేయబడతాయి." అని ఆయన హెచ్చరించారు. ఇజ్రాయెల్ ఎందుకు దాడి చేసింది? ఇజ్రాయెల్ డిఫెన్స్ ఫోర్స్(ఎక్స్ వేదికగా పోస్ట్ చేస్తూ దాడికి కారణాన్ని వెల్లడించింది. ఇజ్రాయెల్ పౌరులు, దాని మిత్రదేశాలపై ఉగ్రవాద కుట్రలను అమలు చేయడానికి హౌతీ తిరుగుబాటుదారులు ఇరాన్ నుంటి ఆయుధాలను దిగుమతి చేసుకుంటున్నారని ఐడీఎఫ్ పేర్కొంది. ఈ దాడిలో ఇబ్, తైజ్ నగరాలకు విద్యుత్ సరఫరా చేసే హౌతీ నియంత్రిత విద్యుత్ కేంద్రం 'రాస్ కనాటిబ్'ను కూడా లక్ష్యంగా చేసుకున్నారు. 2023లో హౌతీలు స్వాధీనం చేసుకున్న "గెలాక్సీ లీడర్" ఓడను ఇజ్రాయెల్ సైన్యం లక్ష్యంగా చేసుకుంది. గెలాక్సీ లీడర్ ఓడను హౌతీలు అంతర్జాతీయ సముద్ర మార్గాల్లో నౌకలను గమనించడానికి రాడార్ సిస్టమ్‌గా ఉపయోగిస్తున్నారని ఇజ్రాయెల్ ఆరోపిస్తోంది. హౌతీ తిరుగుబాటుదారులు ఏమన్నారంటే? హౌతీ తిరుగుబాటుదారులకు సంబంధించిన మీడియా ఈ దాడిని ధ్రువీకరించింది. అయితే వారు కేవలం హుదైదా పోర్టుపై జరిగిన దాడిని మాత్రమే అంగీకరించారు. దాడి వల్ల జరిగిన నష్టం లేదా మరణాల గురించి ఎటువంటి సమాచారం ఇవ్వలేదు. ఇజ్రాయెల్ దాడి తర్వాత తమ వాయు రక్షణ వ్యవస్థలు చురుకుగా మారాయని, క్షిపణులతో దాడులకు ప్రతిస్పందించామని హౌతీ తిరుగుబాటుదారులు పేర్కొన్నారు. ఇజ్రాయెల్-హౌతీ తిరుగుబాటుదారుల మధ్య ఎందుకు శత్రుత్వం? ఇజ్రాయెల్-హమాస్ సంఘర్షణ ప్రారంభమైనప్పటి నుండి, హౌతీ తిరుగుబాటుదారులు ఇజ్రాయెల్‌పై నిరంతరం క్షిపణులను ప్రయోగిస్తున్నారు. అంతేకాకుండా, వారు ఎర్ర సముద్రంలో ఇజ్రాయెల్, పశ్చిమ దేశాలకు చెందిన నౌకలను కూడా లక్ష్యంగా చేసుకుంటున్నారు. హౌతీ తిరుగుబాటుదారులకు ఇరాన్ నుంచి మద్దతు లభిస్తుంది. గత నెలలో కూడా ఇజ్రాయెల్ నావికాదళం హుదైదాలోని అనేక సైనిక స్థావరాలను ధ్వంసం చేసింది.

## న్యూ వియర్ వెల్ దుస్తుల షోరూమ్ ముందే ఓనర్ కాల్చివేత



**న్యూదిల్లీ-నవభూమి:** పంజాబ్‌లో ఇవాళ షాకింగ్ మర్డర్ ఘటన జరిగింది. అబోహార్ సిటీలో న్యూ వియర్ వెల్ షోరూమ్ ఓనర్ సంజయ్ వర్మను కాల్చి చంపారు ఉత్తర భారతంలో న్యూ వియర్ వెల్ కంపెనీ దుస్తులకు పేరున్నది. అయితే ఇవాళ పట్టపగలే ఈ ఘటన చోటుచేసుకున్నది. స్వంత షోరూమ్ ముందే అతన్ని హతమార్చారు. ప్రత్యక్ష సాక్షుల ప్రకారం ముగ్గురు వ్యక్తులు మోటర్‌బైక్‌పై వచ్చి .. షోరూమ్ ముందే వర్మపై ఫైరింగ్‌కు పాల్పడ్డారు. ఆ తర్వాత అక్కడ నుంచి పరారీ అయ్యారు.పరారీ అయిన దుండగులు కొంత దూరం పరుగు తీసి ఆ తర్వాత ఓ మోటర్‌సైకిల్‌ను ఎత్తుకెళ్లారు. షాపు నుంచి బయటకు రాగానే వర్మపై కాల్పులు చోటుచేసుకున్నాయి. కాల్పుల శబ్ధం వినబడగానే.. స్థానిక షాపుఓనర్లు, పాదచారులు భయంతో పరుగులు తీశారు. క్రిటికల్ కండీషన్‌లో వర్మను ఆస్పత్రికి తరలించారు. కానీ అతను మృతిచెందినట్లు డాక్టర్లు చెప్పారు. షూటింగ్‌కు పాల్పడి పరారీ అయిన అనుమానితుల కోసం పోలీసులు గాలిస్తున్నారు.నిందితులను పట్టుకునేందుకు సీసీటీవీ ఫుటేజ్‌ను పరిశీలిస్తున్నారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు నిందితుల్ని పట్టుకోనున్నట్లు చెప్పారు. ఏ ఉద్దేశంతో హత్య చేశారో ఇంకా తెలియరాలేదు. ఉత్తర భారత దేశంలో న్యూ వియర్ వెల్ కంపెనీకి ప్రత్యేక పేరున్నది. ఆ షాపు కస్టమర్లలో ఎక్కువగా సివిల్, పోలీస్, జుడిషియల్ ఆఫీసర్లు ఉన్నారు. వర్మహత్య నేపథ్యంలో స్థానిక మార్కెట్‌ను ఇవాళ బంద్ చేశారు.

## నేను పాక్ సైన్యానికి నమ్మకమైన ఏజెంట్‌ను..

### నేరం అంగీకరించిన ముంబై ఉగ్రదాడి నిందితుడు రాణా



**ముంబై-నవభూమి:** ముంబై 26/11 పేలుళ్ల కేసులో ప్రధాన నిందితుడు తహవ్వుర్ హుస్సేన్ రాణా అరెస్టైన విషయం తెలిసిం దే. ప్రస్తుతం అతను ఎన్ఐఏ కస్టడీలో ఉన్నారు. ఈ సందర్భంగా తహవ్వుర్‌ను ఎన్ఐఏ అధికారులు విచారిస్తున్నారు. విచారణ సందర్భంగా అతడు ముంబై ఉగ్రదాడి వెనుక తన పాత్రను అంగీకరించినట్లు తెలిసింది. ఈ మేరకు సంబంధిత వర్గాలను ఉటంకిస్తూ జాతీయ మీడియా ఇండియా టుడే నివేదించింది.ఢిల్లీలోని తీహార్ జైలు లో ఎన్ఐఏ కస్టడీలో ఉన్న తహవ్వుర్ విచారణలో.. తాను పాకిస్థాన్ సైన్యానికి నమ్మకమైన ఏజెంట్‌ను అని చెప్పినట్లు సదరు నివేదిక వెల్లడించింది. అంతేకాదు తాను, తన స్నేహితుడైన డేవిడ్ హెడ్లీకి పాక్‌కు చెందిన లష్కరే తోయిబాతో సంబంధాలు ఉన్నట్లు కూడా అంగీకరించినట్లు సదరు వర్గాలు తెలిపాయి. ఈ ఉగ్ర సంస్థ ప్రధానంగా గూఢచారి నెట్‌వర్క్‌గా పనిచేస్తుందని కూడా రాణా ఎన్ఐఏకి చెప్పినట్లు సమాచారం.ముంబై పేలుళ్ల కేసులో రాణా ప్రధాన నిందితుడు. అతడు పాకిస్థాన్ సంతతికి చెందిన కెనడా పౌరుడు. ముంబై ఉగ్రదాడి కుట్రదారు డేవిడ్ కోల్‌మాన్ హెడ్లీతో తహవూర్ రాణాకు సన్నిహిత సంబంధాలున్నాయి. ఇద్దరూ కలిసి ఉగ్రదాడికి ప్రణాళిక రచించారు. దాడి అనంతరం అమెరికాకు పారిపోయాడు. 2009లో రాణాను అక్కడి అధికారులు అరెస్ట్ చేశారు. అప్పటి నుంచి అమెరికాలోని జైలులో శిక్ష అనుభవిస్తున్న రాణాను అగ్రరాజ్యం ఇటీవలే భారత్‌కు అప్పగించింది. ప్రస్తుతం అతడు ఎన్ఐఏ కస్టడీ లో ఉన్నారు.కాగా భారత్‌లో అక్రమంగా చొరబడిన 10 ఉగ్రవాదులు 2008 నవంబర్ 26న తమ నరమేథం మొదలుపెట్టారు. రెండు లగ్జరీ హెూటళ్లు, రైల్వేస్టేషన్, జెవిస్ సెంటర్ ఇలా నాలుగు వేర్వేరు ప్రాంతాల్లో ఏకంగా 60 గంటలపాటు సాగిన నరమేథంలో 166 మంది ప్రాణాలు కోల్పోయారు. వారిలో పలువురు భద్రతాసిబ్బంది కూడా ఉన్నారు. భద్రతా బలగాల దాడిలో 9 మంది ఉగ్రవాదులు హతమయ్యారు. మరో ఉగ్రవాది కసబ్‌ను ప్రాణాలతో పట్టుకున్నారు. ఆ తర్వాత అతడికి ఉరిశిక్ష విధించారు.

## కేరళ పర్యాటక ప్రచారంలో జ్యోతి మల్హోత్రా..

**న్యూదిల్లీ-నవభూమి:** భారత సైన్యానికి చెందిన సున్నితమైన సమాచారాన్ని పాకిస్థాన్ నిఘా సంస్థలకు చేరవేస్తున్నారన్న ఆరోపణలపై హర్యానాకు చెందిన యూట్యూబర్ జ్యోతి మల్హోత్రా అరెస్టు అయిన విషయం తెలిసిందే. ఆమెకు సంబంధించి మరో కీలక విషయం వెల్లడైంది. కేరళ పర్యాటక శాఖ ప్రచారంలో జ్యోతి భాగమైనట్లు వెల్లడైంది.ఈ విషయాన్ని ఆర్‌టీఏ తాజాగా బయటపెట్టింది. పర్యాటక రంగాన్ని ప్రోత్సహించేందుకు ఏర్పాటు చేసిన ప్రచార కార్యక్రమానికి కేరళ ప్రభుత్వం దాదాపు 41 మంది ఇన్ఫ్లుయెన్సర్లను ఎంపిక చేసినట్లు తెలిపింది. అందులో జ్యోతి కూడా ఒకరని వెల్లడించింది. వారందరికీ రాష్ట్ర ప్రభుత్వం వసతి, ప్రయాణ, ఆహార ఖర్చులను కూడా చెల్లించినట్లు తెలిపింది. అంతేకాదు కేరళ పర్యటనలో ఉన్న వారికి వీడియోలను చిత్రీకరించడంలో సాయం చేసేందుకు ఓ ప్రైవేటు ఏజెన్సీని కూడా ఏర్పాటు చేసినట్లు తెలిపింది.ఆర్‌టీఏ ప్రకారం.. జ్యోతి మల్హోత్రా రాష్ట్రంలోని కన్నూర్, కోజికోడ్, కొచ్చి, అలప్పుజ వంటి ప్రముఖ పర్యాటక ప్రదేశాల్లో ప్రయాణించి, తన అనుభవాలను యూట్యూబ్ ప్రేక్షకుల కోసం వీడియోలతో డాక్యుమెంటరీ చేసింది. అయితే ఆమె వీడియోల్లో ఒక వీడియో ప్రస్తుతం వైరల్ అవుతోంది.

# సంపద కొందరిదే... గడ్కరీ హాట్ కామెంట్స్ !



**న్యూదిల్లీ-నవభూమి:** ఈ దేశంలో పేదరికం లేదని గత పదకొండేళ్ల కాలంలో అది గణనీయంగా తగ్గిందని ఒక వైపు ప్రభుత్వ పెద్దలు చెబుతూ ఉంటారు. దానికి గణాంకాలను నివేదికలను ముందు పెడతారు. ఏకంగా కోట్ల మంది దాకా పేదలు పేదరికం నుంచి బయటకు వచ్చారని కూడా ఈ మధ్యనే చెప్పుకొచ్చారు. అయితే కేంద్ర ప్రభుత్వంలో కీలక మంత్రిగా బాధ్యతలు నిర్వహిస్తున్న నితిన్ గడ్కరీ మాత్రం కుండ బద్దలు కొట్టారు. ఆయన ఉన్నది ఉన్నట్లుగా మాట్లాడారు. నితిన్ గడ్కరీ మహారాష్ట్రకు చెందిన వారు అన్నది తెలిసిందే. పైగా ఆయన నాగపూర్ వాసి. అందుకేనేమో తన సొంత ప్రాంతానికి వచ్చినపుడు ఆయన ఇంకా ధాటీగా మాట్లాడుతారు అని అంటారు. ఇక నాగపూర్ లో జరిగిన ఒక కార్యక్రమంలో పాల్గొన్న గడ్కరీ హాట్ కామెంట్స్ చేశారు. సంపద పెరుగుతోంది అన్నది ఎంత వాస్తవమో అది కొందరి వద్దనే ఉంటోంది అన్నది అంతే వాస్తవం అన్నారు. సంపద సృష్టి జరుగుతోందని కానీ అది సమతూల్యంగా అందరికీ పంచే విషయంలోనే సరైన పాలసీలు అమలు కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు ఇక మాజీ ప్రధానులు పీవీ నరసింహారావు, మన్మోహన్ సింగ్ ల ప్రస్తావన కూడా ఆయన తెచ్చారు. ఆ ఇద్దరూ ఆర్థిక సంస్కరణలను అమలు చేయడం వల్ల సంపద పెరిగిందని అయితే సంపద ఒకే చోట కేంద్రీకృతం అవుతూంటే ఆపే చర్యలను వారు తీసుకోలేకపోయారు అని అన్నారు. అంతే కాదు సంపద ఆ దిశగా ఆలోచనలు పాలసీలు కూడా దశాబ్దాలుగా లేకపోవడం విచారించదగిన విషయం అన్నారు. ఈ రోజున చూస్తే దేశంలో జీడీపీలో ఉత్పాదక రంగం వాటా 22 నుంచి 24 శాతంగా ఉంటే సేవా రంగం వాటా 52 నుంచి 54 శాతంగా ఉందని అదే సమయంలో వ్యవసాయ రంగం వాటా కేవలం 12 శాతంగా ఉందని గడ్కరీ గణాంకాలను వినిపించారు. గ్రామీణ ప్రాంతంలో అరవై నుంచి డెబ్భై శాతం మంది ఆధారపడి అందులో భాగస్వాములు అయ్యే వ్యవసాయ రంగం వాటా కేవలం 12 శాతం ఉంటే ఆర్థిక అసమానతలు ఉండి తీరుతయాని అన్నారు. %ూశ్రీంశీ =ఘుఎ% - బాబు వద్దన్నా.. అమెరికా వెళ్లిన రఘురామ.. మొత్తం ఐదుగురు ఎమ్మెల్యేలు అక్కడే.. అందుకే ఈ వ్యత్యాసాలను అధిగమించి అందరికీ సంపదలో సమాన వాటా లభించేలా విధానాలు పటిష్టంగా అమలు చేయాల్సిన అవసరం ఉందని నితిన్ గడ్కరీ నొక్కి చెప్పారు. నిజానికి గడ్కరీ అన్న మాటలను చూస్తే కనుక భారత దేశంలో అత్యధిక శాతం జనాభా ఉన్న వారికి అతి తక్కువ మొత్తాలే లభిస్తున్నాయి. అదే కొందరికి మాత్రం కుబేరుల మాదిరిగా సంపద అంటా చేరుతోంది. మరి ఇలా కుప్పలా సంపద పోగు అయి ఒకే చోట తక్కువ మందికే దక్కుతూంటే దేశంలో పేదలు అంతకంతకు పెరిగిపోయి ఒకే దేశంలో రెండు దేశాలు ఏర్పాటు అవుతాయన్న ఆందోళన మేధావులు చాలా కాలం క్రితమే వ్యక్తం చేశారు. పేదల భారత ధనికుల భారంతా ఎన్నడూ పూడ్చలేని అగాధం ఏర్పాటు కాకముందే ఆర్థిక నిపుణుల నుంచి సలహాలతో పాలకులు సరైన పాలసీలు రూపొందించాల్సి ఉందని అంటున్నారు. అత్యధికంగా సంపాదించే ధనికులు కుబేరుల వద్ద ఒకటికి రెండు మార్లు పన్నులు వేసి అయినా సంపదను పేదలకు చేర్చాల్సిన అవసరం ఉందని అంటున్నారు.




## సన్ స్క్రీన్ స్టిక్స్ వచ్చేశాయ్..

**సౌం**దర్య పోషణలో 'సన్ స్క్రీన్' అనేది సర్వసాధారణంగా మారిపోయింది. చర్మ సంరక్షణలో అత్యంత కీలకం ఇదే. సూర్యరశ్మి తగిలి చర్మం దెబ్బతినకుండా ఉండాలంటే 'సన్‌స్క్రీన్' ఒక్కటే మార్గం. ఇప్పటిదాకా లోషన్, క్రీమ్‌గానే లభిస్తే... మార్కెట్లోకి సరికొత్తగా 'స్టిక్స్' కూడా వచ్చేశాయి. ఇంతకీ దీనితో ప్రయోజనాలేంటీ?తేడా ఇదీ...ఫచాలా ఏళ్ల నుంచి ఉన్న సంప్రదాయ లోషన్లు, క్రీములు మాదిరిగానే 'సన్‌స్క్రీన్ స్టిక్'లు వాటిలోని పదార్థాలతోనే తయారవుతాయి. కాకపోతే ఫార్మాట్ వేరు. అవి ద్రవంలా ఉంటే... ఇది కాస్త గడ్డకట్టినట్టుగా, లిప్‌స్టిక్‌లా ఉంటుంది.– సాధారణంగా మేకప్ వేసుకున్నాక... అవసరమైనప్పుడు సన్‌స్క్రీన్ లోషన్ రాసుకోవడానికి కుదరదు. కానీ స్టిక్‌తో ఆ ఇబ్బందేమీ ఉండదు. ఎప్పుడు కావాలంటే అప్పుడు రాసుకోవచ్చు.– లోషన్ రాసుకున్నాక చర్మం కాస్త జిడ్డుగా కనిపిస్తుంది. అయితే స్టిక్‌తో అలాంటి సమస్య ఉండదు.– సాధారణంగా ముఖానికి 2 మి.గ్రా. సన్‌స్క్రీన్ అవసరం అవుతుంది. అయితే స్టిక్‌తో అప్లై చేసేటప్పుడు దాన్ని కొలిచేదెలా అనే సందేహం రావొచ్చు. అందుకే ముఖం అంతటా నాలుగుసార్లు ఈ స్టిక్‌తో సుతి మెత్తగా రుద్దితే తగినంత సన్‌స్క్రీన్ ముఖానికి అందినట్లే అంటున్నారు సౌందర్య నిపుణులు.

ప్రయోజనాలివి...– దీనిని రాసుకోవడం చాలా తేలిక. చేతివేళ్లు ఉపయోగించాల్సిన అవసరం లేకుండా నేరుగా చర్మానికి అప్లై చేసుకోవచ్చు. ముక్కు, కళ్లు, చెవులు వంటి సున్నితమైన భాగాలకూ సింపుల్‌గా రాసుకోవచ్చు.



# నేస్తాల అక్షర యజ్ఞం





"**ఒ**కసారి సంపాదిస్తే మనతోనే ఉండేది, ఎవరూ తీసుకోలేనిదీ, ఎంత పంచినా తరగనిది విద్య మాత్రమే. ఎన్నో కారణాలతో విద్యకు దూరమవుతున్న వారిలో భరోసా కల్పించాలనే చిన్న ప్రయత్నం మాది" అంటారు అదితి శ్రీవత్సన్, నేహా గోవిందరాజన్. ఈ చెన్నై అమ్మాయిలు ఏర్పాటు చేసిన 'బ్లూ లిలాక్ ఫౌండేషన్'... పుస్తక విరాళాలు, ఇతర కార్యక్రమాలతో సర్కారు బడుల్లో చదివే అట్టడుగు వర్గాల పిల్లల వికాసానికి దోహదం చేస్తోంది.

"పుస్తకాలను విరాళంగా సేకరించి, పేద పిల్లలకు పంచాలనే ఆలోచనను నా స్నేహితురాలు అదితి శ్రీవత్సన్ చెప్పినప్పుడు... నేను సంకోచించాను. ఇలాంటి స్వచ్ఛంద కార్యక్రమాలను చేపట్టడానికి తగినంత వయసు మాకు లేదనేది నా అభిప్రాయం. అప్పుడు అదితి "సమాజానికి ఏదైనా సేవ చెయ్యాలంటే ముప్పయ్యేళ్ళో, నలభయ్యేళ్ళో రానవసరం లేదు. మనస్ఫూర్తిగా చేసినప్పుడు ఎలాంటి అనుమానాలు అవసరం లేదు" అంది. 'నిజమే కదా!' అనిపించింది. ఆలస్యం చెయ్యకుండా మా 'బ్లూ లిలాక్ ఫౌండేషన్'కు శ్రీకారం చుట్టాం" అని గుర్తు చేసుకుంది నేహా గోవిందరాజన్. చెన్నైలో పుట్టి, పెరిగిన ఈ పదిహేడేళ్ళ అమ్మాయిలిద్దరూ మంచి స్నేహితులు. ప్లస్ వన్ విద్యార్థులు. పుస్తకాలంటే ఇష్టం. కనీస చదువులకు నోచుకోని పేద పిల్లలను చూసి ఇద్దరూ బాధపడేవారు. ఎలాంటి సాయమైనా విద్యకు సంబంధించినదే చెయ్యాలని గట్టిగా నిర్ణయించుకున్నారు. కిందటి ఏడాది వేసవి సెలవుల్లో... తమ ఆలోచనలకు ఒక రూపం ఇచ్చారు.

**తాతయ్య స్ఫూర్తితో...**

"చదువుకొనే స్తోమత లేనివారికి ఏదైనా సాయం చేయాలనేది ఒక్కరోజులో నాకు కలిగిన ఆలోచన కాదు. సామాజిక ఒత్తిడుల కారణంగా మా అమ్మమ్మ అయిదో తరగతితోనే చదువు ఆపేయాల్సి వచ్చింది. ఈ సంగతి నాతో ఎన్నోసార్లు చెప్పి బాధపడింది. బాగా చదువుకోవాలనే కోరిక ఉన్నా... కుటుంబ, ఆర్థిక పరిస్థితుల వల్ల, మౌలిక వనరులు లేకపోవడం వల్లా ఎందరో తమ కలను నెరవేర్చుకోలేకపోతున్నారనే వాస్తవం నన్ను కలవరపెట్టేది. అయితే నా వంతుగా ఏదో చెయ్యాలనే స్ఫూర్తి... రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రిటైర్డ్ అధికారి అయిన మా తాతయ్య ఎ.ఆర్.శ్రీధర్ నుంచి పొందాను. "మనకు ఉన్నదాన్ని పదిమందితో పంచుకోవడం మన బాధ్యత" అని ఆయన చెప్పిన మాటలు నాలో నాటుకుపోయాయి. ఒక రోజు మా ఇంట్లో పాత పుస్తకాలను సర్దుతున్నప్పుడు... దాదాపు వందకు పైగా నా పాత తరగతుల పుస్తకాలు కనిపించాయి. అవన్నీ దుమ్ము కొట్టుకుపోయాయి. వాటిని అవసరం ఉన్నవారికి ఇస్తే ప్రయోజనం ఉంటుందనిపించింది" అంటోంది అదితి. నేహాతో కలిసి ఆ పుస్తకాలను ఒక అనాథాశ్రమానికి తీసుకువెళ్ళింది. అక్కడ అట్టడుగువర్గాల అమ్మాయిలు కూడా ఆశ్రయం పొందుతున్నారు. వారికి ఈ పుస్తకాలను స్నేహితులిద్దరూ పంచిపెట్టారు. ఆ పిల్లల్లో ఉత్సాహాన్ని, ఆనందాన్ని చూసిన తరువాత... ఈ కార్యక్రమాన్ని మరింత ముందుకు తీసుకువెళ్ళాలనుకున్నారు.

**మొదట్లో భయపడినా...**

తొలి ప్రయత్నంగా.. షోలింగనల్లూర్‌లోని ఒక అపార్ట్‌మెంట్ కాంప్లెక్స్‌కు వెళ్ళారు. పుస్తకాలు విరాళాలుగా ఇవ్వాలని కోరుతూ వాటి సేకరణ వెనుక ఉద్దేశాన్ని వివరించారు. ఎలాంటి స్పందన వస్తుందోనని మొదట భయపడ్డారు. కానీ అక్కడ నివసిస్తున్నవారు ఉత్సాహంగా స్పందించారు. తమ దగ్గర ఉన్న పాత పుస్తకాలు, తమకు అవసరం లేదనుకున్న పుస్తకాలు ఇచ్చారు. "కొద్ది రోజుల్లోనే 350 పుస్తకాలు వచ్చాయి. వాటిలో పాఠ్య పుస్తకాల నుంచి కాల్పనిక సాహిత్యం వరకూ ఉన్నాయి. వాటిని ఒక బాలికల పాఠశాలకు అందజేశాం. మా గురించి విన్న వారు పిలిచి మరీ పుస్తకాలు ఇవ్వడం ఆరంభించారు" అని చెప్పారు అదితి, నేహా.. క్రమంగా స్థానికంగా పనిచేసే సంస్థలు, ఇంటి యజమానుల సంఘాల్లో వారు భాగస్వాములయ్యారు. ఏడాది కాలంలో దాదాపు 4,700కు పైగా పుస్తకాలను పాఠశాలలకు అందజేశారు. వీటివల్ల 3,000 మందికి పైగా పిల్లలు ప్రయోజనం పొందుతున్నారు. అంతేకాదు, ఆరు లైబ్రరీల ఏర్పాటుకు కూడా ఈ స్నేహితులు దోహదం చేశారు.

**ఆంగ్లం... ఆర్థికం**

"ఇప్పుడు ఫౌండేషన్ కార్యకలాపాల పరిధిని విస్తరించాం. ప్రధానంగా రెండు అంశాల మీద దృష్టి పెట్టాం. అవి ఆంగ్ల భాషలో నైపుణ్యం, ఆర్థిక అక్షరాస్యత. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే ఎంతోమంది పిల్లలు ఇంగ్లిష్ విషయంలో ఇబ్బంది పడుతున్నారు. తప్పులు మాట్లాడతామనే భయంతో మాట్లాడడానికి సందేహిస్తున్నారు. ఈ పరిస్థితిని మార్చి, వారిలో ఆత్మవిశ్వాసం పెంచడం కోసం కార్యక్రమాలు చేపడుతున్నాం. ఆంగ్ల సంభాషణా నైపుణ్యాలను పెంచడం కోసం విద్యావేత్తలతో కలిసి ఒక పాఠ్య ప్రణాళిక రూపొందించాం" అంటోంది అదితి. అలాగే "జీవితం సక్రమంగా సాగాలన్నా, సురక్షితమైన భవిష్యత్తు కావాలన్నా ఆర్థిక విషయాల్లో నైపుణ్యం ఎంతో ముఖ్యం. అందుకే ఇంటి బడ్జెట్, ఆదా చేసుకోవడం, ఆర్థిక మోసాల బారిన పడకుండా ఉండడం లాంటి అంశాలను బోధిస్తున్నాం" అని చెబుతోంది నేహా. 'బ్లూ లిలాక్ ఫౌండేషన్' చేపడుతున్న కార్యక్రమాలు పలువురు విద్యార్థులను ఆకర్షించాయి. వారు తమ పాఠశాలల్లో 'బుక్‌డ్రైవ్'లను ఏర్పాటు చేస్తున్నారు. తద్వారా మరింతమందికి పుస్తకాలు ఉచితంగా అందించడానికి వీలవుతోంది. "మా స్నేహితురాలు తనుశ్రీ... ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా ఫౌండేషన్ వ్యవహారాల్లో మాకు తోడుగా ఉంది. ఏడాది క్రితం ఫౌండేషన్‌ను ప్రారంభించినప్పుడు ఇంత స్పందన వస్తుందని మేమనుకోలేదు. ఇప్పుడు ఇదొక పూర్తిస్థాయి ఉద్యమంగా రూపుదిద్దుకుంది. అవసరం ఉన్న ప్రతి విద్యార్థికి సాయం అందించాలన్నది మా లక్ష్యం. దాని కోసం కృషి చేస్తాం" అని చెబుతున్నారు అదితి, నేహా.

## తెల్లసొనతో మెరుపులు...





**గు**డ్డులోని తెల్లసొనలో మేనిఛాయను పెంచే పోషకపదార్థాలు చాలా ఉంటాయి. అవి శిరోజాల టెక్చర్‌ని మెరిసేలా చేస్తాయి. జుట్టును ఆరోగ్యంగా, దృఢంగా ఉంచుతాయి. చర్మంలో దెబ్బతిన్న టిష్యూలను బాగు చేసి చర్మం బిగువుగా ఉండేలా తోడ్పడతాయి. శిరోజాల పెరుగుదలకు సైతం సహకరిస్తాయి. తెల్లసొన చిట్కాలు కొన్ని...


. కీర పేస్టులో తెల్లసొన వేసి మెత్తగా చేసి ఆ పేస్టును ముఖానికి రాసుకొని 20 నిమిషాలు అలాగే ఉంచుకోవాలి. ఆ తర్వాత గోరువెచ్చటి నీళ్లతో ముఖాన్ని కడుక్కోవాలి. అలా వారానికి రెండుసార్లు చేయాలి. దీనివల్ల చర్మంలో కొల్లాజన్ పెరుగుతుంది. చర్మంలో రక్తప్రసరణ బాగా జరుగుతుంది. చర్మం మెరుస్తుంది.


చర్మకాంతిని తెల్లసొన పెంచుతుంది. తెల్లసొనలో ఒక టేబుల్‌స్పూను నిమ్మరసం, రెండు టేబుల్‌స్పూన్ల ఆలివ్ ఆయిల్ వేసి బాగా కలిపి ఆ పేస్టును ముఖానికి రాసుకుని పదిహేను నిమిషాలు అలాగే ఉంచుకోవాలి. ఇలా చేయడం వల్ల చర్మం మృదువుగా తయారవడమే కాకుండా మేనిఛాయ కూడా పెరుగుతుంది.

వయసు కనిపించకుండా ఉండడానికి ఒక ఎగ్ తెల్లసొనలో చక్కెర, పెరుగు ఒక్కొక్క టేబుల్‌స్పూను వేసి పేస్టులా చేసి ముఖానికి రాసుకొని పదిహేను నిమిషాలు అలాగే ఉంచుకోవాలి. ఆతర్వాత ముఖాన్ని చల్లటి నీళ్లతో కడగాలి. దీనివల్ల చర్మం బిగువుగా అవడమే కాదు టోనింగ్ కూడా బాగా ఉంటుంది. చర్మంపై మచ్చలు పోతాయి. ఈ మాస్కు చర్మాన్ని బాగా శుభ్రం చేస్తుంది. దీనివల్ల వయసు కనపడదు. ఇలా వారానికి రెండుసార్లు మాస్కు వేసుకుంటే మంచి ఫలితాలు కనిపిస్తాయి.

తెల్లసొనలోని పోషకాల వల్ల శిరోజాలు మెరవడంతోపాటు బాగా పెరుగుతాయి. దీనికి చేయాల్సిందేమిటంటే, తెల్లసొనలో కొద్దిగా ఆలివ్ ఆయిల్ వేసి మాడు బాగా మర్దనా చేసి అరగంటపాటు అలాగే ఉంచుకోవాలి. ఆ తర్వాత మైల్డ్ షాంపుతో తల రుద్ది, నీటితో శుభ్రపరచాలి.

## పండ్లు తింటే బరువు తగ్గుతామా?






**బరువు తగ్గడం కోసం రాత్రి భోజనానికి బదులుగా పండ్లు తినే ధోరణి ఇటీవల ఊపందుకుంది. అయితే పండ్లతో నిజంగానే బరువు తగ్గే వీలుందా? తెలుసుకుందాం!**

**మ**ధ్యాహ్నం భారీగా భోంచేసినప్పుడు, రాత్రికి అంతగా ఆకలి వేయకపోవచ్చు. అలాంటి సందర్భాల్లో, లేదా అజీర్తి తలెత్తినప్పుడు రాత్రి భోజనానికి బదులుగా పండ్లతో సరిపెట్టుకోవడం మంచిదే! అయితే ప్రతి రాత్రీ పండ్లతో సరిపెట్టుకోవడం ఆరోగ్యకరం కాదంటున్నారు వైద్యులు. పండ్లలో ప్రొటీన్లు, ఆరోగ్యకరమైన కొవ్వులు లోపిస్తాయి కాబట్టి ఇదే అలవాటును కొనసాగిస్తే పోషక లోపం తలెత్తే వీలుంటుంది. అలాగే రాత్రి పండ్లతో పొట్ట నింపుకోవడంతో, మరుసటి ఉదయానికి ఆకలి ఎక్కువై భారీ బ్రేక్‌ఫాస్ట్ చేసే అవకాశం ఉంటుందనీ, దాంతో అదనపు క్యాలరీలు శరీరంలోకి చేరిపోయే ప్రమాదం ఉంటుందని కూడా వైద్యులు హెచ్చరిస్తున్నారు. అలాగే పండ్లలో విటమిన్లు, పీచు, ఖనిజ లవణాలతో పాటు, సహజ చక్కెరలు కూడా ఎక్కువే! ఇవి రక్తంలోని చక్కెర మోతాదులను పెంచేస్తాయి. ఇదే అలవాటును దీర్ఘకాలం పాటు కొనసాగిస్తే, ఇన్సులిన్ రెసిస్టెన్స్ తలెత్తే ప్రమాదం కూడా ఉంటుంది. ఈ శక్తిని ఉపయోగించుకోలేకపోతే, కొవ్వుగా శరీరంలో పేరుకుపోతుంది. కాబట్టి ఈ సమస్యలు తలెత్తకుండా ఉండడం కోసం పండ్లను పెరుగు, నట్స్‌తో కలిపి తీసుకోవాలి. అలాగే రాత్రిపూట పండ్లను తినడానికి ఇష్టపడేవారు గ్లైసెమిక్ ఇండెక్స్ తక్కువగా ఉండే, బెర్రీస్, యాపిల్స్, బొప్పాయి, పియర్స్ మొదలైన పండ్లను ఎంచుకోవాలి.

## ఆసనాలతో పొట్ట తగ్గిద్దాం




మారిన జీవనశైలి, ఎక్కువ సేపు కూర్చుని పనిచేయడం వంటి కారణాలతో ఈ రోజుల్లో పొట్ట పెరగడం సాధారణం అయిపోయింది. అయితే కొన్ని యోగా ఆసనాలతో ఆ పొట్టను తగ్గించుకోవచ్చు. అవేంటో తెలుసుకుందాం..

నౌకాసనం : ముందుగా నేలమీద కాళ్లను చాపి కూర్చోవాలి. తర్వాత చేతులను తొడల కింద పెట్టి రెండు కాళ్లను పైకి లేపాలి. అలా లేపుతూ శరీరాన్ని కొంచెం వెనక్కి వంచాలి. ఇలా శరీరం ꠲ ఆకారంలోకి వచ్చేలా చేయాలి. తర్వాత చేతులను నిటారుగా చాపాలి. ఇప్పుడు శరీరం బరువంతా పిరుదుల మీద ఉంటుంది. 10-20 క్షణాల పాటు ఇలానే ఉండాలి. కొన్ని రోజులు అలవాటు అయిన తరువాత సమయం పెంచుకోవాలి. ఈ ఆసనం వలన పొట్టభాగంలోని కండరాలు కదిలి కొవ్వు తగ్గి పొట్ట తగ్గుతుంది. అలాగే జీర్ణక్రియ పెరుగుపడుతుంది. పొట్ట భాగానికి రక్తప్రసనరణ మెరుగుపడుతుంది.


సేతు బంధ సర్వాంగాసనం : ముందుగా నేలపై పడుకోవాలి. మోకాళ్లను మడిచి భూజాలు, చేతులను నేలమీద ఆధారం చేసి నడుమును పైకి లేపాలి. ఇలా 20-30 క్షణాల పాటు ఉండాలి. ఆ భంగిమ మెటబాలిజంను మెరుగుపరుస్తుంది. కొవ్వును కరిగించడానికి సహాయపడుతుంది.

కుంభకాసనం : చేతులను నేలకు ఆనించి పుష్-అప్స్ చేసే భంగిమలో ఉండాలి. ఇలా నడుపు, కాళ్లు వంచకుండా 20-30 క్షణాల పాటు ఉండాలి. ఈ ఆసనం వలన పొట్ట భాగంలోని కొవ్వు తగ్గుతుంది. అలాగే చేతులు, నడుము బలంగా మారుతాయి.

భుజంగాసనం : ముందుగా నేలపై బోర్లా పడుకోవాలి. అరచేతులను నేలకు ఆనించి వాటి ఆధారంతో మెడను పైకి ఎత్తాలి. అరచేతులు నడుము కింద భాగం మాత్రమే నేలకు ఆనాలి. ఇలా 20- 30 సెకన్ల పాటు ఉండి నెమ్మదిగా మాములు స్థితికి రావాలి. ఈ భంగిమ వలన పొట్ట, నడుము కండరాలు బలపడతాయి. ఒత్తిడి కూడా తగ్గుతుంది. పొట్ట భాగంలోని కొవ్వు తగ్గుతుంది.

త్రికోణాసనం : ముందు కాళ్లను దూరంగా పెట్టి నిల్చోవాలి. ఇప్పుడు కుడి కాలిని కొంచెం దూరంగా జరిపి ఆ పక్కకు వంగి కుడి చేతితో ఆ కాలి పాదాలను తాకాలి. ఈ సమయంలో ఎడమ చేతిని నిటారుగా పైకి లేపాలి. ఓ ఇరవై క్షణాల పాటు అలా ఉండి మాములు స్థితి రావాలి. ఇప్పుడు ఇలానే ఎడమ వైపు కూడా చేయాలి. ఈ ఆసనం పొట్టను తగ్గిస్తుంది. జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది. నడుము, కాళ్ల, చేతులను బలోపేతం చేస్తుంది.

## చిన్న గదులు పెద్దవిగా



కొందరి ఇళ్లు ఉండడానికి చిన్నవే కాని చూసేందుకు చాలా పెద్దగా కనిపిస్తాయి. మీ ఇల్లు కూడా చిన్నదే అయినా పెద్దగా కనిపించాలంటే ఇంటీరియర్ విషయంలో జాగ్రత్తపడితే సరిపోతుంది అంటున్నారు డిజైనర్లు.

చిన్న గది అనగానే లైట్ కలర్ వాడాలి అనుకుంటారు. కాని అది అపోహ మాత్రమే. ఆ గదిని మీరు ఎందుకు ఉపయోగిస్తున్నారు అనే దాన్నిబట్టి కలర్ ఎంపికచేసుకోవాలి. అది బెడ్‌రూమ్ అయితే వామ్ కలర్స్, బాతరూమ్ అయితే కూల్ షేడ్స్ వాడాలి. ముదురు నీలం రంగు వేస్తే హాయిగా అనిపిస్తుంది.

గోడలకు పెయింట్ వేసేటప్పుడు సీలింగ్‌కు పది సెంటిమీటర్లు కిందనుంచి వేయాలి. వదిలేసిన దానికి తెలుపు పెయింట్ వేయాలి. తెలుపు రంగును వాడడం వల్ల సీలింగ్ ఎత్తుగా అనిపిస్తుంది. దాంతో గది పొడవుగా ఉన్నట్టు కనిపిస్తుంది. క్రిస్ప్ వైట్ కలర్‌కి తగ్గట్టుగా టీల్ టోన్స్ (బ్లూ, గ్రీన్ రంగుల మిశ్రమం) వాడితే చాలా బాగుంటుంది. సన్నగా ఉన్న కారిడార్ గోడలకి ఇరుచివర్లా ముదురు రంగులు వేస్తే విశాలంగా ఉన్న లుక్ వస్తుంది. డ్రమాటిక్ లుక్ కావాలంటే రిచ్ రెడ్ వేసి చూడండి.

గదుల్లో వాడే ఫ్యాబ్రిక్, ఫర్నిచర్‌లకు దగ్గరి రంగులనే గోడలకు పెయింట్ చేయాలి. ఇలా చేయడం వల్ల చూడగానే ప్రశాంతమైన భావన కలుగుతుంది. గది కూడా ఉన్నదానికంటే పెద్దదిగా కనిపిస్తుంది. ఇందుకు గ్రీన్ కలర్ షేడ్స్ బాగుంటాయి.

చిన్న గదికి ఉడ్‌వర్క్, మౌల్డింగ్స్ చేయించుకునేటప్పుడు అవి గోడ రంగుకంటే ఒక షేడ్ డార్క్ ఉండేలా జాగ్రత్తపడాలి. ఇలా చేయడం వల్ల కాంట్రాస్ట్‌గా ఉండి గది పెద్దదిగా కనిపిస్తుంది. లేత బూడిద రంగు గోడలకు, ముదురు బూడిద రంగు ఉడ్‌వర్క్ చేయిస్తే అధునాతనంగా ఉంటుంది.

గోడలకు పెయింట్ చేశాక పెద్ద పెద్ద అద్దాలు పెట్టడం వల్ల ఆ గది వైశాల్యం రెండింతలు పెరిగినట్టు అనిపించి ఉన్నదానికంటే పెద్దదిగా కనిపిస్తుంది.




# నవ బిజినెస్



## ఫ్లాట్‌గా ముగిసిన స్టాక్ మార్కెట్లు..



**న్యూఢిల్లీ-నవభూమి:**వారంలో తొలిరోజు ఫ్లాట్‌గా దేశీయ స్టాక్ మార్కెట్లు ముగిశాయి. అంతర్జాతీయ మార్కెట్లలోని ప్రతికూల ప్రభావం దేశీయ మార్కెట్లపై పడింది. అమెరికా వ్యతిరేక విధానాలకు మద్దతు తెలిపే ఏ దేశానికైనా అదనంగా పదిశాతం టారిఫ్ విధించనున్నట్లు ఆ దేశ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. దాంతో రూపాయి విలువ పతనమైంది. సోమవారం డాలర్‌తో పోలిస్తే రూపాయి 47 పైసలు తగ్గి 85.86 వద్ద ముగిసింది. ఈ క్రమంలో మార్కెట్లు ఒడిదుడుకులను ఎదుర్కొన్నాయి. క్రితం సెషన్‌తో పోలిస్తే బెంచ్ మార్క్ సూచీలు సోమవారం ఉదయం 83,398.08 స్వల్ప నష్టాల్లో మొదలైంది. ఇంట్రాడేలో 83,262.23 పాయింట్ల కనిష్టానికి చేరిన సెన్సెక్స్.. అత్యధికంగా 83,516.82 పాయింట్లకు చేరింది.చివరకు 9.61 పాయింట్లు పెరిగి 83,442.50 వద్ద స్థిరపడింది. నిఫ్టీ సైతం 0.30 పాయింట్లు పెరిగి 25,461.30 వద్ద ముగిసింది. ట్రేడింగ్‌లో దాదాపు 1,617 షేర్లు లాభపడగా.. 2,294 షేర్లు పతనమయ్యాయి. నిఫ్టీ మిడ్‌క్యాప్ ఇండెక్స్ 0.27 శాతం, స్మాల్ క్యాప్ ఇండెక్స్ 0.4 శాతం క్షీణించింది. ఎఫ్ఎంసీజీ ఇండెక్స్ 1.6శాతం పెరిగింది. ఆయిల్ అండ్ గ్యాస్ ఇండెక్స్ 0.4శాతం లాభపడింది. మీడియా ఇండెక్స్ ఒకశాతం, ఐటీ, మెటల్ ఇండెక్స్ 0.7శాతం తగ్గాయి. టెక్ మహీంద్రా, భారత్ ఎలక్ట్రానిక్స్, అల్ట్రాటెక్ సిమెంట్, ఓఎన్‌జీసీ, ఎటర్నల్ నష్టపోగా.. హెచ్‌యూఎల్, టాటా కన్స్యూమర్, నెస్లే ఇండియా, జియో ఫైనాన్షియల్, ఐషర్ మోటార్స్ లాభపడ్డాయి.

## పీఎస్‌బీల్లో కొలువుల జాతర



**న్యూఢిల్లీ-నవభూమి:** దేశంలోని 12 ప్రభుత్వ రంగ బ్యాంకులు రూటు మార్చాయి. పెద్ద ఎత్తున నియామకాలకు సిద్ధమవుతున్నాయి. ఈ ఆర్థిక సంవత్సరం దాదాపు 50,000 నియామకాలు చేపట్టనున్నాయి. ఇందులో 21,000 ఉద్యోగాలు ఆఫీసర్ పోస్టులు. మిగతా 29,000 క్లరికల్ పోస్టు లు. ఇవే బ్యాంకులు గతంలో ఉద్యోగుల సంఖ్య ఎక్కువగా ఉందనే పేరుతో 2001లో స్వచ్ఛంద పదవీ విరమణ (వీఆర్ఎస్) పథకం ద్వారా లక్ష మంది పైగా ఉద్యోగులను ఇంటికి పంపించాయి. అప్పట్లో 26 పీఎసబీలుంటే విలీనాలతో ఇపుడు వాటి సంఖ్య 12కు తగ్గిపోయింది. అయినా పీఎసబీలు మళ్లీ పెద్ద ఎత్తున నియామకాలకు దిగడం విశేషం. పెరుగుతున్న వ్యాపారం, శాఖల విస్తరణ, ఖాతాదారులకు మరింత మెరుగైన సేవలు అందించాల్సిన అవసరం ఈ నియామకాలకు ప్రధాన కారణంగా కనిపిస్తోంది.పీఎసబీలు ఈ ఆర్థిక సంవత్సరం భర్తీ చేసే 50,000 ఉద్యోగాల్లో ఎస్‌బీఐ వాటానే దాదాపు 20,000 వరకు ఉంది. ఇందులో 505 ప్రొబేషనరీ ఆఫీసర్ (పీఓ) పోస్టులుబీ 13,455 జూనియర్ అసోసియేట్స్ పోస్టుల ఎంపిక ప్రక్రియను ఇప్పటికే పూర్తి చేసింది. ఈ ఏడాది మార్చి నాటికి ఎస్‌బీఐ ఉద్యోగుల సంఖ్య 2,36,226కు చేరింది. ఇందులో అధికారుల సంఖ్య 1,15,066 వరకు ఉంది. గత ఆర్థిక సంవత్సరం ఒక్కో కొత్త ఉద్యోగి నియామకం కోసం ఎస్‌బీఐ రూ.40,440.59 చొప్పున ఖర్చు చేసింది. ఎస్‌బీఐతో పాటు పీఎన్‌బీ 5,500 మందిని, సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా 4,000 మందిని తాజాగా ఉద్యోగాల్లోకి తీసుకోనున్నాయి.

పీఎసబీలకు ప్రస్తుతం దాదా పు 15 వరకు అనుబంధ లేదా జాయింట్ వెంచర్ కంపెనీలున్నాయి. వీటి కార్యకలాపాలను మరింత విస్తరించి ఐపీఓల ద్వారా వాటిల్లో పెట్టుబడులు కొంతైనా వెనక్కి తీసుకోవాలని కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ ఇటీవల పీఎసబీలను కోరింది. ఇందుకోసం కూడా పీఎసబీలు నియామకాలు పెంచుతున్నాయని భావిస్తున్నారు.

## పెట్రోకెమికల్స్ రంగంలోకి అదానీ




**న్యూఢిల్లీ-నవభూమి:** గౌతమ్ అదానీ నేతృత్వంలోని అదానీ గ్రూప్ తన వ్యాపార సామ్రాజ్యాన్ని మరింత విస్తరిస్తోంది. కొత్తగా పెట్రో రసాయనాల (పెట్రో కెమికల్స్) రంగంలోకి ప్రవేశిస్తోంది. ఇందులో భాగంగా గుజరాత్‌లోని ముంద్రా వద్ద ఏటా 10 లక్షల టన్నుల ఉత్పత్తి సామర్థ్యం ఉన్న పోలివినైల్ క్లోరైడ్ (పీవీసీ) ప్లాంట్ ఏర్పాటు చేస్తోంది. 2027-28 ఆర్థిక సంవత్సరం నాటికి ఈ ప్లాంటు నిర్మాణం పూర్తి చేసి ఉత్పత్తి ప్రారంభించాలని అదానీ గ్రూప్ భావిస్తున్నట్టు సమాచారం. దీంతో ఇప్పటికే ఈ రంగంలో ఉన్న రిలయన్స్ ఇండస్ట్రీసకు గట్టి పోటీ ఏర్పడుతుందని భావిస్తున్నారు.సింథటిక్ పాలిమర్ అయిన పీవీసీని అనేక రంగాల్లో విస్తృతంగా ఉపయోగిస్తారు. ప్రస్తుతం మన దేశంలో దీనికి ఏటా 40 లక్షల టన్నుల వరకు డిమాండ్ ఉంది. ఇందులో 15.9 లక్షల టన్నులు మాత్రమే దేశీయంగా ఉత్పత్తి అవుతోంది. అందులో రిలయన్స్ ఇండస్ట్రీస్ వాటా 7.5 లక్షల టన్నులు. దేశంలో పీవీసీ డిమాండ్ ఏటా 8-10 శాతం చొప్పున పెరుగుతోంది. ఈ అవకాశాల్ని అందిపుచ్చుకునేందుకే అదానీ గ్రూప్ పీవీసీ ఉత్పత్తిలోకి ప్రవేశిస్తోందని భావిస్తున్నారు.


నిజానికి ఐదేళ్ల క్రితమే అదానీ గ్రూప్ ఈ ప్రాజెక్టు తలపెట్టింది. అయితే హిండెన్‌బర్గ్ రీసెర్చ్ ఆరోపణలతో 2023 మార్చిలో ఈ ప్రాజెక్టును పక్కన పెట్టింది. పరిస్థితులు కుదుటపడడంతో మళ్లీ ఈ ప్రాజెక్టును పట్టాలెక్కించింది. డిమాండ్‌ను బట్టి ఈ ప్లాంటు వార్షిక ఉత్పత్తి సామర్థ్యాన్ని 20 లక్షల టన్నులకు విస్తరించాలని అదానీ గ్రూప్ యోచిస్తున్నట్టు తెలుస్తోంది.

## ఈడీ జప్తు చేసిన ఆస్తుల విడుదల కుదరదు



**న్యూఢిల్లీ-నవభూమి:** జాతీయ కంపెనీల చట్టం అప్పిలేట్ ట్రైబ్యునల్ (ఎన్‌సీ ఎల్ఏటీ) బ్యాంకులు, ఆర్థిక సంస్థల సొమ్ముతో మజా చేసే ఘరానా వ్యాపారులు, పారిశ్రామిక వేత్తలకు చెంప పెట్టులాంటి తీర్పు ఇచ్చింది. దివాలా చట్టాన్ని (ఐబీసీ) అడ్డుపెట్టుకుని అక్రమ నగదు లావాదేవీల చట్టం (పీఎంఎల్ఏ) నుంచి తప్పించుకోవడం కుదరదని స్పష్టం చేసింది. పీఎంఎల్ఏ చట్టం కింద ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) స్వాధీనం చేసుకున్న ఆస్తులను విడుదల చేయడం కుదరదని తేల్చి చెప్పింది. అక్రమంగా సంపాదించిన ఆస్తులు ఐబీసీ పరిష్కార ప్రక్రియలోకే రావని ప్రకటించింది.ఇదీ కేసు: తీవ్ర అప్పుల ఊబిలో కూరుకుపోయిన దునార్ ఫుడ్స్ కంపెనీ నుంచి తమకు రావలసిన రూ.758.73 కోట్లు రాబట్టుకునేందుకు ఎస్‌బీఐ నాయకత్వంలోని బ్యాంకుల కన్సార్షియం ఎన్‌సీఎల్‌టీ, ముంబై బెంచ్‌ను ఆశ్రయించింది. ఈ లోపు పీఎల్ఏ చట్టం కింద దునార్ ఫుడ్స్ ఆస్తులను ఈడీ జప్తు చేసింది. దాంతో ఈ ఆస్తులను విడిపించాలని ఎన్‌సీఎల్‌టీ, ముంబై బెంచ్‌ను ఆ కంపెనీ కోరింది. కేసును విచారించిన ఎన్‌సీఎల్‌టీ ముంబై బెంచ్ ఈడీ చర్యను సమర్థిస్తూ దునార్ ఫుడ్స్ విజ్ఞప్తిని తోసిపుచ్చింది. దీంతో దునార్ ఫుడ్స్ కంపెనీ దీనిపై ఎన్‌సీఎల్ఏటీకి అప్పీల్ చేసింది. కంపెనీకి ఎన్‌సీఎల్ఏటీలోనూ చుక్కెదురైంది. ఈ తీర్పు ఐబీసీని అడ్డుపెట్టుకుని బ్యాంకుల అప్పులతో మజా చేసే మాయగాళ్లకు చెంప పెట్టని భావిస్తున్నారు.

## స్మార్టెన్ పవర్ సిస్టమ్ ఇష్యూ నేడే




**న్యూఢిల్లీ-నవభూమి:** సోమవారం ప్రారంభం కానున్న స్మార్టెన్ పవర్ సిస్టమ్ పబ్లిక్ ఇష్యూలో షేరు ధరను రూ.100గా ప్రకటించింది. బుధవారం ముగియనున్న ఈ ఇష్యూ ద్వారా రూ.50 కోట్లు సమీకరించాలని కంపెనీ భావిస్తోంది. రూ.40.01 కోట్ల విలువ గల తాజా షేర్లు జారీ చేయడంతో పాటు 10 లక్షల ఈక్విటీ షేర్లు ఓఎఫ్ఎస్ విధానంలో జారీ చేయనున్నట్టు కంపెనీ ప్రకటించింది.

రెండు కంపెనీల దరఖాస్తు: సోలార్ ఫొటో వోల్టాయిక్ మాడ్యూళ్లు తయారుచేసే ఎమ్వీ ఫొటోవోల్టాయిక్ పవర్ లిమిటెడ్, స్మార్ట్ ఎనర్జీ మీటర్ తయారీ కంపెనీ అలైడ్ ఇంజనీరింగ్ వర్క్స్ ఐపీఓల జారీకి అనుమతి కోరు తూ సెబీకి దరఖాస్తు చేశాయి. ఎమ్వీ ఫొటోవోల్టాయిక్ పవ ర్ రూ.3,000 కోట్లు, అలైడ్ ఇంజనీరింగ్ వర్క్స్ రూ.400 కోట్లు సమీకరించనున్నట్టు ప్రకటించాయి.

## రెనో 16 సిరీస్ శ్రేణి ఆవిష్కరించిన ఒప్పో ఇండియా








**న్యూఢిల్లీ-నవభూమి:**ఓప్పో సంస్థ తన నూతనమైన రెనో పదహారు శ్రేణిని భారతదేశంలో ప్రవేశపెట్టింది. ఇది ప్రతి వినియోగదారుని సాంకేతికతలో సంపూర్ణంగా తీర్చిదిద్దే లక్ష్యంతో రూపొందించబడింది. రెనో పదహారు రెనో పదహారు ప్రో అనే రెండు మోడళ్ళు వివిధ రంగాలలో ఉన్నవారికి అనువుగా, మెరుగైన ఫోటోగ్రఫీ, శక్తివంతమైన పనితీరు, మన్నికైన నిర్మాణం ఆధునిక రూపకల్పనలతో అందుబాటులోకి వచ్చాయి.ఈ ఫోన్ల ధర ప్రారంభం ముప్పై నాలుగు వేల రెండు వందల రూపాయలు నుండి మొదలవుతుంది. ప్రారంభ విక్రయ దశలో వినియోగదారులకు ఇవి తక్కువ ధరకే లభిస్తాయి. ఫోన్లతో పాటు ఓప్పో ప్యాడ్ ఎస్ ఈ పేరుతో ఓ గోలికొలచిన గడియారం (ట్యాబ్లెట్) ను కూడా విడుదల చేశారు.రెనో పదహారు ప్రో అనే ఫోన్‌లో ఉపయోగించిన ప్రాసెసర్ ప్రపంచంలోనే తొలిసారి వాడబడుతున్న నాలుగు నానోమీటరు సాంకేతికతతో రూపొందించిన అత్యాధునిక చిప్. ఇది అత్యుత్తమ వేగం ఇంధన సామర్థ్యాన్ని అందిస్తుంది.ఫోన్ల శరీర నిర్మాణం అధిక మన్నిక కలిగిన అంతరిక్ష స్థాయి దృఢత్వంతో రూపొందించబడింది. కార్నింగ్ గోరిల్లా అద్దకం ఏడు ఐ అనే ప్రత్యేకమైన అద్దకంతో పాటు ఐ పి అరవయ్యారు, ఐపి 68 ఐపి 99 ప్రమాణాలను సాధించింది. దీని వల్ల ఈ ఫోన్లు మట్టి, నీరు, అధిక ఉష్ణోగ్రతల నుండి రక్షణ పొందగలవు.ఫోన్లలో సముద్రపు స్పాంజ్‌ల నుండి ప్రేరణ పొందిన బయోనిక్ కుషనింగ్ నిర్మాణం వాడారు. ఇది ఫోన్ పడిపోయినప్పుడు ఎదురయ్యే దెబ్బను తట్టుకునే సామర్థ్యం కలిగి ఉంది.రూపకల్పన పరంగా, ఈ ఫోన్లు వెల్వెట్ మృదుత్వంతో కూడిన ముత్యపు తెలుపు, మెరుస్తూ కనిపించే అరణ్య పచ్చ రంగులో అందుబాటులో ఉన్నాయి. ఫోన్ల వెనుక భాగంలో ప్రత్యేక మెరుపుతో కూడిన ఆకర్షణీయంగా ఉన్న రూపం ఉంటుంది.ప్రదర్శన పరంగా, ఈ రెండు మోడళ్ళు నూరిద్వార సార్లు తిరిగే స్పర్శ స్పందన కలిగిన అమోలెడ్ తెరలతో వస్తాయి. రెనో పదహారు ప్రో ఆరు పాయింట్ ఎనిమిది మూడు అంగుళాల మొగ్గదలచిన తెరను కలిగి ఉండగా, రెనో పదహారు ఆరు పాయింట్ అయిదు తొమ్మిది అంగుళాల తెరను కలిగి ఉంటుంది. రెండు తెరలూ ఒక పాయింట్ ఐదు కె తెర స్పష్టతను కలిగి ఉన్నాయి. ఇవి తక్కువ అంచులుతో, ఎక్కువ తెర భాగాన్ని చూపుతాయి. ఫోటోగ్రఫీ పరంగా, రెనో పదహారు శ్రేణిలో అత్యాధునిక కెమెరా వ్యవస్థను ఉపయోగించారు. ఇందులో యాభై మెగాపిక్సెల్ టెలిఫోటో లెన్స్ వుంది. దీని ద్వారా మీకు కావలసిన దూరపు దృశ్యాలను అద్భుతంగా ఫోటో రూపంలో పొందవచ్చు. పోర్ట్రెయిట్ లెన్స్‌తో సహా, వీధి దృశ్యాలు, ప్రకృతి దృశ్యాలు అన్నీ అత్యంత ఖచ్చితంగా చిత్రీకరించవచ్చు.ఈ కెమెరా వ్యవస్థ కృత్రిమ మేధస్సును ఉపయోగించి వంద ఇరువై రెట్లు జూమ్ చేసే సామర్థ్యాన్ని కలిగి ఉంది. ఇది దూరంలో ఉన్న జంతువులు, భవనాలు, లేదా ప్రకృతి దృశ్యాలను సమీపంగా తీసినట్లు అనిపించేలా చిత్రీకరించగలదు. రెనో పదహారు ప్రో మోడల్ మూడు వెనుక కెమెరాల సహితంగా ముందుభాగంలో ఉన్న కెమెరా ద్వారా కూడా నాణ్యమైన నాలుగు కె వీడియోలను తీసేందుకు వీలు కల్పిస్తుంది. ప్రధాన లెన్స్, వైడ్ లెన్స్, టెలిఫోటో లెన్స్‌ల మధ్య మార్పు సజావుగా జరిగేలా రూపొందించారు. ఈ విధంగా ప్రయాణాలు, దృశ్య చలన చిత్రాలు, సామాజిక మాధ్యమాల క్లిప్పులు కోసం ఈ ఫోన్లు అత్యుత్తమంగా నిలుస్తాయి.తక్కువ కాంతి పరిస్థితుల్లోనూ ఫోటోలు తీయగల సామర్థ్యం కోసం మూడు విడివిడిగా పనిచేసే ప్రకాశ వంతమైన దీపాలు ఉన్నాయి. ఈ దీపాలు ఒక్కో లెన్స్‌కు అనుకూలంగా పనిచేస్తాయి. టెలిఫోటో లెన్స్‌కు కూడా ప్రత్యేకంగా ఒక దీపం ఇవ్వడం విశేషం.నీటిలో ఫోటోలు తీయడానికి ఈ ఫోన్లలో ప్రత్యేకమైన విధానాన్ని అందించారు. హక్కీ పూత లేకుండానే నీటిలో ఉండగల ఫోటోలు, వీడియోలు తీయవచ్చు. ఈ ఫీచర్ వర్షాకాలం, సముద్రతీర విహారాలు, లేదా ఈత కొలమానంలో స్మృతిక్షణాల కోసం అనువుగా ఉంటుంది.

ఈ విధంగా ఓప్పో రెనో పదహారు శ్రేణి ఫోన్లు ప్రతి రంగంలోనూ వినూత్నత, మన్నిక, ఫలితాల పరంగా అత్యుత్తమంగా నిలుస్తూ, మొబైల్ ప్రపంచంలో ఓ కొత్త ప్రమాణాన్ని స్థాపిస్తున్నాయి.

## మొబైల్ యూజర్లకు షాక్.. మళ్లీ రీఛార్జ్ ధరల పెంపు




**న్యూఢిల్లీ-నవభూమి:** ప్రస్తుతం మొబైల్ లేని వారంటూ ఉండరేమో. కనీసం ఫీచర్ ఫోన్ అయినా వాడుతుంటారు. అయితే, చాలా మంది రీఛార్జ్ ధరల భారం పడుతోందని చెబుతున్నారు. గత సంవత్సరం రీఛార్జ్ ప్లాన్ల ధరలను జియో, ఎయిర్‌టెల్ వంటి టెలికాం కంపెనీలు భారీగా పెంచిన సంగతి తెలిసిందే. ఇప్పుడు మరోసారి రీఛార్జ్ ప్లాన్ల ధరలను పెంచేందుకు సిద్ధమవుతున్నాయి. ఈ ఏడాది చివరి నాటికి మొబైల్ టారిఫ్‌లను 10-12 శాతం మేర పెంచే అవకాశం ఉందని ఇండస్ట్రీ ఎగ్జిక్యూటివ్స్, మార్కెట్ విశ్లేషకులు చెబుతున్నారు.రికార్డ్ స్థాయిలో యాక్టివ్ సబ్‌స్క్రైబర్లు పెరగడంతా పాటుగా 5%+% సేవలను చిన్న నగరాలకు సైతం విస్తరిస్తున్న క్రమంలోనే మరోసారి రీఛార్జ్ ధరల పెంపు ఉండవచ్చని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. గత మే నెలలో మొబైల్ యాక్టివ్ యూజర్ల సంఖ్య భారీగా పెరిగింది. ఒక్క నెలలోనే 74 లక్షల మంది కొత్తగా సబ్‌స్క్రిప్షన్ తీసుకున్నారు. గడిచిన 29 నెలల్లో ఇదే గరిష్ఠ సంఖ్య కావడం గమనార్హం. దీంతో మొత్తం యాక్టివ్ సబ్‌స్క్రైబర్ల సంఖ్య ఏకంగా 108 కోట్లకు చేరుకుంది.మే నెలలో రిలయన్స్ జియోలో కొత్తగా 55 లక్షల మంది చేరారు. ఎయిర్‌టెల్ కు 13 లక్షల మంది కొత్త యూజర్లు చేరారు. యూజర్ల సంఖ్య పెరిగిన క్రమంలో టారిఫ్‌ల పెంపుపై టెలికాం కంపెనీలు దృష్టిసారించినట్లు ఆర్థిక సేవల సంస్థ జెఫెరీస్ తెలిపింది. గత ఏడాది జూలైలో బేస్ రీఛార్జ్ ధరలను సగటున 11 శాతం నుంచి 23 శాతం మేర పెంచిన సంగతి తెలిసింది. ఈ ఏడాది చివరి నాటికి మరో 10-12 శాతం మేర పెంచే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. అయితే, ఈసారి బేస్ ప్లాన్ల జోలికి పోకపోవచ్చని తెలుస్తోంది.మధ్య, ఉన్నత శ్రేణి రీఛార్జ్ ప్లాన్లపై రేట్లు పెంచే అవకాశాలు ఉన్నాయి. అలాగే డేటా వినియోగం, డేటా వేగం, డేటాను వినియోగించే టైమ్ ప్రకారం ఈ పెంపు ఉండవచ్చని తెలుస్తోంది. కొత్త రీఛార్జ్ ప్లాన్ల డేటాలో భారీగా కోత పెట్టే అవకాశాలు కనిపిస్తున్నాయి. డేటా ప్యాక్‌లను ప్రత్యేకంగా కొనుగోలు చేసేందుక వీటిని రూపొందించనున్నట్లు సమాచారం. మొబైల్ టారిఫ్‌లలో మార్పులు అవసరమని ఇప్పటికే ఎయిర్ టెల్, వీఐలు అభిప్రాయపడ్డాయి.

## మీ హెల్త్ బీమాతో సురక్షితంగా ఉన్నారా..

### ఈ తప్పులు మాత్రం చేయకండి



**న్యూఢిల్లీ-నవభూమి:**సాధారణ మధ్య తరగతి ప్రజలు హెల్త్ ఇన్సూరెన్స్ పాలసీ తీసుకుని తమ ఆరోగ్యానికి భరోసా ఉందని భావిస్తుంటారు. ప్రీమియం చెల్లించి, ఆ కార్డును వ్యాలెట్‌లో పెట్టుకుని జీవిస్తుంటారు. కానీ ఏదైనా ఆరోగ్య సమస్య వస్తే గాని, దాని కవరేజ్ ఎంత, ఏ విధంగా ఉపయోగ పడుతుందనేది తెలియదు. దీని గురించి చార్టర్డ్ అకౌంటెంట్ అభిషేక్ వాలియా కీలక సూచనలు చేశారు. మీ పాలసీ కవరేజ్ తక్కువగా ఉంటే మాత్రం మిమ్మల్ని మీరు మోసం చేసుకున్నట్లే అవుతుందని గుర్తు చేశారు. అది ఎలా అనే విషయాలను ఇక్కడ తెలుసుకుందాం.పూణేకి చెందిన ఓ 38 ఏళ్ల ఐటీ ఉద్యోగి కేవలం రూ. 3 లక్షల హెల్త్ ఇన్సూరెన్స్ పాలసీ తీసుకున్నాడు. కానీ, అతని తండ్రి హార్ట్ ఆపరేషన్ కోసం ఆస్పత్రి బిల్లు రూ. 7 లక్షలు దాటింది. ఆ క్రమంలో అతనికి పాలసీ కేవలం రూ.3 లక్షల బిల్లును మాత్రమే కవర్ చేసింది. మిగిలిన డబ్బు కోసం బంధువుల నుంచి అప్పు తీసుకోవాల్సి వచ్చింది. చివరకు ఆ బిల్లు కారణంగా అతను ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొన్నాడు. ఈ మాదిరిగా వారికి తెలియకుండానే అనేక మంది తక్కువ కవరేజ్ పాలసీ తీసుకుని మోసపోతున్నారని గుర్తు చేశారు అభిషేక్.తక్కువ ప్రీమియం చెల్లించాలని..దేశంలో ప్రతి ఏటా కూడా ఆరోగ్య ఖర్చులు పెరుగుతున్నాయి. ప్రైవేట్ ఆస్పత్రుల్లో కొన్ని రోజులు ఉంటే చాలు మీ ఆదాయం క్షణాల్లో ఖాళీ అవతుందని నిపుణులు చెబుతున్నారు. కాబట్టి హెల్త్ ఇన్సూరెన్స్ తీసుకోవడానికి ముందే ఎక్కువ కవరేజ్ పాలసీ తీసుకోవాలని సూచించారు. చాలా మంది ప్రీమియం తక్కువ చెల్లించాలని, తక్కువ కవరేజ్‌తో సరిపెట్టుకుంటారు. లేదా కంపెనీ గ్రూప్ పాలసీపై ఆధారపడతారు. కానీ ఆరోగ్య రంగంలో ద్రవ్యోల్బణం ఎక్కువగా ఉంటుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. కొన్నాళ్ల తర్వాత గతంలో కవరేజ్ ఇప్పుడు సరిపోదని గుర్తు చేస్తున్నారు.

అత్యవసర సమయాల్లో..ఈ నేపథ్యంలో మీ హెల్త్ ఇన్సూరెన్స్ గురించి ప్రతి రెండేళ్లకోసారి సమీక్షించుకోవాలన్నారు. అత్యవసర పరిస్థితుల్లో మీ పాలసీ సరిపోదని భావించకూడదన్నారు. మీ కవరేజ్ మొత్తం పెంచుకోవడానికి టాప్ అప్ ప్లాన్ తీసుకోవాలన్నారు. మీకు కుటుంబం ఉంటే, అందరికీ సరిపోయే కవరేజ్ తీసుకోవాలని సూచించారు. నగరాల్లో ఒక సాధారణ శస్త్రచికిత్సకు రూ. 10 లక్షల వరకు ఖర్చు అవుతుంది. కాబట్టి కనీసం రూ. 10-15 లక్షల కవరేజ్ ఎంచుకోవాలన్నారు నిపుణులు. ఉద్యోగం మారినప్పుడు గ్రూప్ ఇన్సూరెన్స్ ఆగిపోతుంది. వ్యక్తిగత పాలసీ తీసుకోవడం వల్ల దీర్ఘకాల భద్రత ఉంటుంది.

## దిగొచ్చిన బంగారం ధరలు..

### బంగారం, వెండి ధరలు ఎలా ఉన్నాయంటే..



**న్యూఢిల్లీ-నవభూమి:**భౌగోళికంగా ఉద్రిక్త పరిస్థితుల కారణంగా ఆల్‌టైమ్ గరిష్టానికి చేరిన బంగారం వెండి ధరలు ప్రస్తుతం దిగి వస్తున్నాయి. గత వారం లక్ష రూపాయలను దాటేసిన బంగారం ప్రస్తుతం 98 వేలకు దిగి వచ్చింది. ఈ నేపథ్యంలో ఈ రోజు (జులై 7న) ఉదయం 6.30 గంటల సమయానికి 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారం ధర రూ. రూ. 98, 830కి చేరింది. 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. రూ. 90, 600కి చేరింది.

ఢిల్లీలో 24 క్యారెట్ల పసిడి రేటు 10 గ్రాములకు రూ. 98, 970కి చేరుకోగా, 22 క్యారెట్ల గోల్డ్ ధర 10 గ్రాములకు రూ. 90, 740కి చేరుకుంది. ఇక హైదరాబాద్, విజయవాడలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. 98, 820కి చేరుకోగా, 22 క్యారెట్ల 10 గ్రాముల గోల్డ్ రేటు రూ. 90, 590కి చేరింది. వెండి ధరలు కేజీకి రూ100 మేర తగ్గింది. ఈ క్రమంలో దేశంలోని ప్రధాన నగరాల్లో ఉన్న బంగారం, వెండి రేట్లను ఇప్పుడు తెలుసుకుందాం.దేశంలోని ప్రధాన నగరాల్లో బంగారం రేట్లు (10 గ్రాములకు) (24 క్యారెట్, 22 క్యారెట్)

హైదరాబాద్‌లో రూ. 98, 820, రూ. 90, 590
విజయవాడలో రూ. 98, 820, రూ. 90, 590
ఢిల్లీలో రూ. 98, 870, రూ. 90, 740
ముంబైలో రూ. 98, 820, రూ. 90, 590
వడోదరలో రూ. 98, 870, రూ. 90, 640
కోల్‌కతాలో రూ. 98, 820, రూ. 90, 590
చెన్నైలో రూ. 98, 820, రూ. 90, 590
బెంగళూరులో రూ. 98, 820, రూ. 90, 590
కేరళలో రూ. 98, 820, రూ. 90, 590
పుణెలో రూ. 98, 820, రూ. 90, 590

ప్రధాన నగరాల్లో వెండి ధరలు (కేజీకి)

హైదరాబాద్‌లో రూ. 1, 19, 900
విజయవాడలో రూ. 1, 19, 900
ఢిల్లీలో రూ. 1, 09, 900
చెన్నైలో రూ. 1, 19, 900
కోల్‌కతాలో రూ. 1, 19, 900
కేరళలో రూ. 1, 19, 900
ముంబైలో రూ. 1, 09, 900
బెంగళూరులో రూ. 1, 09, 900
వడోదరలో రూ. 1, 09, 900
అహ్మదాబాద్‌లో రూ. 1, 09, 900

## మదుపరులూ పారాహుషార్

**ముంబై-నవభూమి:**అమెరికా ట్రేడింగ్ సంస్థ జేన్ స్ట్రీట్ మాయాజాలం దేశీయ స్టాక్ మార్కెట్‌ను ఓ కుదుపు కుదిపింది. ఎఫ్ అండ్ ఓ విభాగంలో ఎక్స్‌పైరీ రోజుల్లో ఈ సంస్థ తన చేతివాటంతో భారీగా లాభాలను ఆర్జించినట్లు సెబీ గుర్తించింది. మానవ ప్రమేయం లేని ఆల్గో ట్రేడింగ్‌తో జేన్ స్ట్రీట్ ఈ మోసాలకు పాల్పడినట్లు తేల్చింది. ఈ అక్రమ దందాతో బ్రోకర్లు, సంస్థాగత ఇన్వెస్టర్లతో పాటు రిటైల్ ఇన్వెస్టర్లూ భారీగానే నష్టపోయారు. రిటైల్ మదుపరులు భవిష్యత్తులో ఇలాంటి మోసాల బారిన పడకుండా ఉండాలంటే మరింత అప్రమత్తంగా ఉండక తప్పదు. అవేమిటంటే..

మార్కెట్ సమాచారం పెద్ద పెద్ద ట్రేడింగ్ సంస్థలకు తెలిసినంతగా రిటైల్ ఇన్వెస్టర్లకు తెలియదు. ఆ మాటకొస్తే చిన్న చిన్న ట్రేడింగ్ సంస్థలకూ తెలియదు. కాబట్టి స్పష్టమైన సమాచారం ఉంటే తప్ప ఎఫ్ అండ్ ఓ ట్రేడింగ్ జోలికి పోయి చేతులు కాల్చుకోవద్దు.

టెక్నాలజీ కూడా మాయగాళ్లకు తోడ్పడుతోంది. జేన్ స్ట్రీట్ సంస్థ కూడా అత్యాధునిక ఆల్గో ట్రేడింగ్ ద్వారానే ఎఫ్ అండ్ ఓ మార్కెట్లో అనైతిక పద్ధతులకు పాల్పడింది. కాబట్టి ఇండెక్స్‌లు మార్కెట్ వాస్తవ పరిస్థితులకు నిజమైన సూచికలని గుడ్డిగా నమ్మవద్దు. అందులోనూ ఎక్స్‌పైరీ రోజుల్లో అసలు నమ్మొద్దు.రిటైల్ మదుపరులు ఇండెక్స్‌ల కదలికలపైనా జాగ్రత్త పడాలి. తన పంప్ అండ్ డంప్ వ్యూహంతో జేన్ స్ట్రీట్.. డెరివేటివ్స్ విభాగంలో సూచీలను ప్రభావితం చేసింది. డెరివేటివ్స్‌లో ఇన్వెస్ట్ చేసే రిటైల్ మదుపరులు సూచీల కదలికను బట్టి కాకుండా టెక్నికల్స్ ఆధారంగానే పెట్టుబడి నిర్ణయాలు తీసుకోవటం మంచిది.ఎక్స్‌పైరీ రోజుల్లో సూచీలను గణనీయంగా పెంచటం, తగ్గించేందుకు జేన్ స్ట్రీట్.. ఆల్గో ట్రేడింగ్ ద్వారా పెద్ద మొత్తంలో పుట్ ఆప్షన్స్ కొనుగోలు చేసింది. వాటిని ఫ్యూచర్స్‌లో విక్రయించి భారీగా లాభపడింది. ఈ మాయ మంత్రాలు పెద్ద పెద్ద ట్రేడర్లకు తప్ప రిటైల్ మదుపరులకు తెలియవు. కాబట్టి రిటైల్ మదుపరులు ఎఫ్ అండ్ ఓ జోలికి పోకపోవడమే మంచిదని మార్కెట్ నిపుణులు సూచిస్తున్నారు.

మానసిక అవధి 26000

## మానసిక అవధి 26000

## టెక్ వ్యూ: మానసిక అవధి 26000

**ముంబై-నవభూమి:**నిఫ్టీ గత వారం 25,650 వద్ద రియాక్షన్‌తో ప్రారంభమై వారం అంతా మైనర్ బలహీనత కొనసాగించింది. శుక్రవారం మైనర్ రికవరీతో 25,460 వద్ద ముగిసింది. అయినా వారం మొత్తం మీద 300 పాయింట్ల మేరకు పరిమిత పరిధిలోనే కదలాడి చివరికి 176 పాయింట్లు నష్టపోయింది. ముందు వారం 25,000 వద్ద బ్రేకౌట్ సాధించిన అనంతరం ఏర్పడిన పుల్‌బ్యాక్ రియాక్షన్ ఇది. ఈ రియాక్షన్‌లో కూడా ప్రధాన మద్దతు స్థాయిల కన్నా పైనే ఉండడం తక్షణ ముప్పు లేదనేందుకు సంకేతం. టెక్నికల్‌గా మార్కెట్ పాజిటివ్ ధోరణిలోనే ఉంది. తదుపరి నిరోధం 26,000 వద్ద నిలదొక్కుకోవడం తప్పనిసరి.బుల్లిష్ స్థాయిలు: మరింత అప్‌ట్రెండ్ సాధించినట్టయితే ప్రధాన నిరోధం 25,600 కన్నా పైన నిలదొక్కుకోవడం తప్పనిసరి. తదుపరి మానసిక అవధి 26,000. ఇక్కడ కన్సాలిడేషన్ ఉండవచ్చు. ఆ పైన నిలదొక్కుకున్నప్పుడే మరింత పాజిటివ్‌గా పురోగమిస్తుంది.బేరిష్ స్థాయిలు: రియాక్షన్ సాధించి మైనర్ మద్దతు స్థాయి 25,400 కన్నా దిగజారితే మైనర్ బలహీనతలో పడుతుంది. స్వల్పకాలిక మద్దతు స్థాయి 25,000. అంతకన్నా దిగజారితే స్వల్పకాలిక బలహీనత తప్పదు.బ్యాంక్ నిఫ్టీ: ఈ సూచీ గత వారం 57,600 వద్ద రియాక్షన్ సాధించి వారంలో 412 పాయింట్ల నష్టంతో 57,000 వద్ద నిలకడగా ముగిసింది. అప్‌ట్రెండ్‌ను కొనసాగించాలంటే ప్రధాన నిరోధం 57,600 కన్నా పైన నిలదొక్కుకోవాలి. తదుపరి ప్రధాన నిరోధం 58,000. బలహీనతలో ప్రవేశించినా 57,000 వద్ద నిలదొక్కుకుని తీరాలి. ఈ స్థాయిలో విఫలమైతే స్వల్పకాలిక బలహీనతలో పడుతుంది.

## గోల్డ్ లోన్ తీసుకుంటున్నారా..

**న్యూఢిల్లీ-నవభూమి:**అత్యవసర సమయాల్లో అందరికీ గుర్తొచ్చేవి గోల్డ్ లోన్సే. వైద్యం, విద్య, వ్యాపారం, వ్యవసాయం ఇలా చెప్పుకుంటూపోతే మన ప్రతీ నగదు అవసరాలు వేగంగా తీరే మార్గం ఒక్క బంగారం తనఖా రుణాల ద్వారానే ఉంటుందంటే ఎంతమాత్రం అతిశయోక్తి కాదు. పైగా పసిడి తాకట్టుపై ఇచ్చే ఈ రుణాలు సెక్యూర్డ్ లోన్స్. కాబట్టి రుణదాత (బ్యాంకులు, బ్యాంకింగేతర ఆర్థిక సంస్థలు)లూ వీటికి అమితాసక్తినే కనబరుస్తూంటారు. అయితే ఈ బిజినెస్‌లో అవకతవకలకు వీలుందన్నదానిపై దృష్టిపెట్టిన రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ).. ఇటీవల నూతన మార్గదర్శకాలను విడుదల చేసింది. వచ్చే ఏడాది ఏప్రిల్ 1 నుంచి అమల్లోకి వచ్చే ఈ నిబంధనల్ని గోల్డ్ లోన్ తీసుకోవాలనుకునే ప్రతీ ఒక్కరూ తెలుసుకోవాల్సిన అవసరం ఉన్నది.

బుల్లెట్ రీపేమెంట్ పథకాల్లో చెల్లింపుల కోసం ఉండే గరిష్ఠ కాలపరిమితి 12 నెలలకు పరిమితం.

36 నెలలదాకే ఈఎంఐ ఆధారిత రుణాల కాలపరిమితి.

మునుపు గోల్డ్ లోన్స్ ఏటా రెన్యువల్ చేసుకునే వీలుండేది. ఇప్పుడది లేదు.

నవభూమి
www.navabhoomi.in
www.epaper.navabhoomi.in
12 హైదరాబాద్ మంగళవారం 08 ; జులై ; 2025

# రెండో పెళ్లిపై క్లారిటీ ఇచ్చిన రేణూ దేశాయ్.. ఎప్పుడు చేసుకుంటుందంటే..!



పవన్ కళ్యాణ్ మాజీ భార్య, నటి రేణు దేశాయ్ రెండో పెళ్లి ఎప్పుడు హాట్ టాపిక్‌గానే మారుతూ ఉంటుంది. పవన్ వనుండి విడిపోయిన తర్వాత రేణూ దేశాయ్ మరో పెళ్లి చేసుకోకుండా, తన పిల్లలైన అకీరా నందన్ ఆధ్యాలతో ఒంటరిగా జీవితం కొనసాగిస్తూ వస్తున్నారు. తాజాగా ఆమె ఒక ఇంటర్వ్యూలో తన రెండో పెళ్లి గురించి స్పష్టత ఇచ్చింది. తాను ఎందుకు ఇప్పటివరకు పెళ్లి చేసుకోలేదో, ఎప్పుడు పెళ్లి చేసుకుంటారో తెలిపింది.ఓ ఇంటర్వ్యూలో మాట్లాడిన రేణు దేశాయ్, రెండో పెళ్లి చేసుకోవడానికి తాను పూర్తిగా సిద్ధంగా ఉన్నానని, కానీ మరికొన్ని సంవత్సరాల పాటు వెయిట్ చేయాలని నిర్ణయించుకున్నానని చెప్పారు. రెండు మూడేళ్లలో పెళ్లి చేసుకుంటా. నా జీవితంలో కూడా ఓ మ్యారేజ్ లైఫ్ ఉండాలని, ప్రేమ ఉండాలని కోరుకుంటున్నాను. అందుకే మళ్లీ పెళ్లి చేసుకోవాలని నిర్ణయించుకున్నాను అని స్పష్టత ఇచ్చింది. పిల్లల కోసమే ఇప్పటివరకు పెళ్లి చేసుకోలేదు . నన్ను మళ్లీ పెళ్లి చేసుకోవాలని కుటుంబం నుంచి ఒత్తిడి వచ్చినా, అప్పట్లో పిల్లలు చిన్నవారు కావడంతో వాళ్లను వదిలి కొత్త జీవితం ప్రారంభించడం సబబు కాదు అనిపించింది. వాళ్లకి తండ్రి దూరంగా ఉన్నాడు. నేనూ దూరమైతే వాళ్లు ఒంటరితనంతో బాధపడతారు అనిపించింది అని రేణు భావోద్వేగంగా వివరించారు. అకీరా, ఆద్య కూడా నన్ను మ్యారేజ్ చేసుకోమంటున్నారు. తన పిల్లలు కూడా మద్దతుగా ఉండటం ఎంతో సంతోషంగా ఉందని తెలిపారు రేణూ.





## కవ్వించే యవ్వన సిరి పాలక్

మిడ్డీల్లో ఫ్రాకుల్లో కవ్వించడం పాలక్‌కి కొత్తేమీ కాదు కానీ, ఈసారి మోకాలు లోతు నీళ్లలోకి దిగి మరీ కవ్విస్తోంది. అసలే ఎర్ర ఫ్రాకు.. ఆపై జిల్లనిపించే అందాల శిరి.. టోన్డ్ అందాలతో సోగ దేహంతో ఇలా కవ్విస్తుంటే, కుర్రకారు గుండె లయ తప్పి గిలగిలా కొట్టుకుంటోంది. టీవీ మూవీ నటి శ్వేతా తివారీ నటవారసురాలిగా సినీప్రపంచాని కి పరిచయమైనా కానీ, ఈ అమ్మడు తనదైన ప్రతిభ, అందచందాలతో ఆకర్షించేందుకు ప్రయత్నిస్తోంది. రెగ్యులర్‌గా ఫోటోషూట్లను ఇన్ స్టాలో తన అభిమానులకు షేర్ చేస్తూ, స్పెషల్ ట్రీట్ ఇస్తోంది. పాలక్ బికినీ లుక్, మిడీ లుక్, శారీ లుక్ లేదా ఇంకేదైనా ట్రెడిషనల్ లెహంగాలో సంథింగ్ స్పెషల్‌గా మెరిసిపోతోంది. .. ఓవైపు సైఫ్ అలీఖాన్ నటవారసుడు ఇబ్రహీం అలీఖాన్ తో స్నేహం కారణంగా నిరంతరం మీడియా హెడ్ లైన్స్ లో నిలుస్తున్న ఈ బ్యూటీ డేటింగ్ గురించి ఇప్పటికీ సీక్రెసీ మెయింటెయిన్ చేస్తోంది. పాలక్ ఇతర నటవారసుల్లానే మునుముందు దక్షిణాది చిత్రసీమలోకి అడుగుపెట్టనుందని గుసగుసలు వినిపిస్తున్నాయి. సల్మాన్ కిసీకా భాయ్ కిసీకా జాన్ చిత్రంలో నటించిన పాలక్ ఆ తర్వాత వెబ్ సిరీస్ లలో నటించింది. రోమియో ఎస్3, రోసీ వంటి సిరీస్‌లతో అందరి దృష్టిని ఆకర్షించింది. బాలీవుడ్‌లో తన తదుపరి ప్రాజెక్ట్‌ని ప్రకటించేందుకు వేచి చూడాల్సి ఉంది.

# వెంకటేష్ లైనప్ చాలా పెద్దదే..



విక్టరీ వెంకటేష్ సినిమాలకి మినిమం గ్యారెంటీ ఉంటుంది. అయితే ఈ ఏడాది సంక్రాంతికి వస్తున్నాం చిత్రంతో ఇండస్ట్రీ బ్లాక్ బస్టర్ అందుకున్న వెంకటేష్ ఆ తర్వాత సినిమా కోసం దాదాపు 6 నెలలు గ్యాప్ తీసుకున్నారు. ఆయన కొత్త సినిమా ఎప్పుడు మొదల వుతుందా అని ఫ్యాన్స్ ఎంతో ఆసక్తిగా గమనిస్తున్నారు. అయితే వెంకటేష్ సినిమాలకి సంబంధించి నెట్టింట అనేక ప్రచారాలు జరుగుతున్నా దేనిపై క్లారిటీ లేదు. ఈ నేపథ్యంలోనే యుఎస్‌లో జరుగుతున్న నాట్స్ 2025 వేడుకలో తన నుంచి రాబోయే చిత్రాల గురించి స్వయంగా క్లారిటీ ఇచ్చేశారు వెంకటేష్. వాటిలో అందరూ ఎదురు చూస్తున్న త్రివిక్రమ్ శ్రీనివాస్ కాంబినేషన్ చిత్రంతో పాటు చిరంజీవి చిత్రం కూడా ఉంది.వెంకీ మామ మాట్లాడుతూ.. త్రివిక్రమ్ శ్రీనివాస్ కాంబోలో ఓ సినిమా ఉంటుందని కన్ఫర్మ్ చేశారు. ఇది తొలి అధికారిక స్టేట్‌మెంట్‌గా చెప్పుకోవచ్చు. మెగాస్టార్ చిరంజీవి అనిల్ రావిపూడి కాంబినేషన్‌లో రూపొందుతున్న ప్రాజెక్ట్‌లో తాను ఓ కీలక పాత్రలో కనిపించనున్నట్లు తెలిపారు. గతకొంత కాలంగా వస్తున్న వార్తలపై ఇప్పుడు పూర్తి క్లారిటీ ఇచ్చారు. సూపర్ హిట్ సిరీస్ అయిన 'దృశ్యం'కి మూడో భాగం కూడా ఉంటుందని వెంకటేష్ వెల్లడించారు. అందు లో మీనాతో కలిసి నటించబోతున్నట్టు తెలియజేశారు. మరో వైపు, నందమూరి బాలకృష్ణ సినిమాలోనూ ఓ స్పెషల్ కేమియో చేయనున్నట్లు వెల్లడించారు. దీంతో వెంకటేష్ 2025లో సినిమాల పరంగా బిజీగా ఉండబోతున్నట్టు స్పష్టమైంది.వెంకటేష్ త్రివిక్రమ్ సినిమా ఎప్పుడో అనౌన్స్ చేసినా, ఇప్పటివరకు పూర్తి స్క్రిప్ట్ రెడీ కాలేదని తెలుస్తోంది. అందుకే వెంకీ మామ అప్పటి వరకూ మిగతా ప్రాజెక్టులపై ఫోకస్ పెడుతున్నట్లు అర్థమవుతోంది. ఇటీవల వెంకటేష్ చేసిన 'సంక్రాంతికి వస్తున్నాం' చిత్రం రూ.300 కోట్ల క్లబ్‌లో చేరడం ద్వారా, చిరంజీవి 'వాల్తేరు వీరయ్య' (?250 కోట్లు) రికార్డును మించిపోయింది. దీంతో టాలీవుడ్ సీనియర్ హీరోలలో వెంకటేష్ ఇప్పుడు టాప్ పొజీషన్‌లో నిలిచారు.

# నీ యాంకరింగ్ రప్పా రప్పా అంటూ బన్నీ ప్రశంసలు..



అమెరికాలోని టంపా నగరంలో 2025 వేడుకలు అట్టహాసంగా జరిగిన విషయం తెలిసిందే. తెలుగువారంతా ఏర్పాటు చేసిన ఈ వేడుకల్లో ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ పాల్గొనడంతో ఈ వేడుక మరింత అట్రాక్షన్‌గా మారింది. ఆయన రాకతో అక్కడి వారి ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. విదేశాల్లో నివసించే తెలుగు కుటుంబాలకు నాట్స్‌లో అల్లు అర్జున్‌ను చూడటం అంటే ఒక నటుడిని కలవడం కాదు. వారి మూలాలు, వారి భాష, వారి సంస్కృతితో తిరిగి కనెక్ట్ అయిన ఫీలింగ్ కలిగింది. ప్రపంచవ్యాప్తంగా ఉన్న లక్షలాది తెలుగు ప్రజలకు అల్లు అర్జున్ ఒక సినిమా నటుడికంటే ఎక్కువ.ఆయన ఒక ఎమోషన్..ఒక బ్రాండ్ ఒక స్ఫూర్తి.నాట్స్ 2025 ఒక కళా కార్యక్రమం మాదిరిగా కాకుండా, తెలుగు వారి ఐక్యతకు ప్రతీకగా, సంస్కృతి పరిరక్షణకు వేదికగా మారింది. ఇక వేదికపైకి వచ్చిన తర్వాత అల్లు అర్జున్, తన మార్క్ డైలాగులతో ప్రేక్షకులను ఉర్రూతలూగించాడు "ఇండియన్స్ ఎక్కడున్నా తగ్గేదేలే..! అందులో తెలుగువాళ్లయితే అస్సలు తగ్గేదేలే..!", "తెలుగోళ్లంటే ఫైర్ అనుకున్నారా..? వైల్డ్ ఫైర్..!", ఈ డైలాగ్స్‌తో ఆడిటోరియంలో ఉన్న ప్రేక్షకులకి పూనకాలు వచ్చేశాయి. ఇక బన్నీ తనదైన స్టైల్‌లో యాంకర్ శ్రీముఖిపై కూడా ప్రశంసలు కురిపించాడు. 'మీ యాంకరింగ్ మాత్రం రప్పా రప్పా!" అంటూ ఆమెను బాగా పొగిడాడు. ఈ మాటలతో శ్రీముఖి ఆనందం అంతా ఇంతా కాదు.ఇక బన్నీ ప్రస్తుతం అట్లీ దర్శకత్వంలో భారీ ప్రాజెక్ట్ చేస్తున్న విషయం తెలిసిందే. బాలీవుడ్ అందాల తార దీపికా పదుకొణె ఇందులో కథానాయికగా నటిస్తోంది. సన్ పిక్చర్స్ బ్యానర్ పై కళానిధి మారన్ సుమారు రూ. 800 కోట్లతో అత్యంత ప్రతిష్ఠాత్మకంగా ఈ చిత్రాన్ని హాలీవుడ్ రేంజ్‌లో తెరకెక్కిస్తున్నట్టు తెలుస్తుంది . ఈ సినిమా కోసం హాలీవుడ్ టెక్నీషియన్లు పని చేయనున్నారు.

# లోకల్ ట్రైన్ నుంచి దూకి చనిపోవాలనుకున్న స్టార్ హీరోయిన్..



సీతారామం చిత్రంతో తెలుగు ప్రేక్షకులకి దగ్గరైన అందాల ముద్దుగుమ్మ మృణాల్ ఠాకూర్. ఈ ముద్దుగుమ్మ సినిమాలతో పాటు సోషల్ మీడియాలోను తెగ సందడి చేస్తుంటుంది. తాజాగా ఒక ఇంటర్వ్యూలో స్టార్ హీరోయిన్ మృణాల్ ఠాకూర్ తన కెరీర్ ప్రారంభ దశలో ఎదుర్కొన్న కష్టాలను వెల్లడించారు. సినిమాల్లో అవకాశాలు లేక ఇబ్బందులు ఎదురైనప్పటికీ డిప్రెషన్‌తో పోరాడినట్టు చెప్పుకొచ్చింది. ఒకసారి లోకల్ ట్రైన్ నుంచి దూకి చనిపోవాలని కూడా ఆలోచించానని చెప్పారు. అయితే పేరెంట్స్ గుర్తొచ్చి ఆ నిర్ణయాన్ని మార్చుకున్నట్లు ఆమె చెప్పారు. ప్రస్తుతం మృణాల్ వ్యాఖ్యలు నెట్టింట వైరల్ అవుతున్నాయిమృణాల్‌కి చిన్న తనంలోనే నటనపై ఆసక్తి కలగడంతో మొదట సీరియల్స్‌లో నటించి మంచి గుర్తింపు పొందింది. 'కుంకుమ భాగ్య' సీరియల్‌తో మంచి గుర్తింపు తెచ్చుకున్న తర్వాత సినిమాల్లో చిన్న పాత్రలు పోషించింది మృణాల్. ఆ తర్వాత హిందీలో 'సూపర్ 30', 'జెర్సీ' వంటి సినిమాలతో స్టార్ హీరోయిన్‌గా పేరు తెచ్చుకుంది. తెలుగు సినిమా 'సీతారామం'లో నటించి తన క్రేజ్ మరింత పెంచుకుంది. ప్రస్తుతం తెలుగులో, హిందీలో కలిపి సుమారు అరడజను సినిమాలు చేస్తుంది.. ఇందులో అడివి శేష్‌తో 'డెకాయిట్', అల్లు అర్జున్, అట్లీతో కలిసి పనిచేస్తున్న సినిమాలు కూడా ఉన్నాయి. అడివి శేష్ డెకాయిట్ సినిమాలో ముందు శృతి హాసన్‌ని హీరోయిన్ గా తీసుకోగా కొన్ని కారణాల వల్ల ఆమె తప్పుకోవాల్సి వచ్చింది. ఫైనల్‌గా మృణాల్ ఆ ఛాన్స్ దక్కించుకుంది. డెకాయిట్ ఒక్కటే తెలుగులో మృణాల్‌కి ఉన్న ఆఫర్. ఆ సినిమా డిసెంబర్ కి రిలీజ్ అవుతుంది. అయి తే తెలుగుతో పాటు హిందీలో వచ్చిన ప్రతి సినిమాకి ఓకే చెబుతుంది మృణాల్ ఠాకూర్.ఒకప్పుడు అవకాశాల కోసం ఎదురుచూసి డిప్రెషన్‌తో ఇబ్బంది పడ్డా, ఇప్పుడు స్టార్ హీరోయిన్‌గా ఘన విజయాలు సాధించిన మృణాల్ ఠాకూర్ తన బలాన్ని, పట్టుదలని ప్రదర్శిస్తూ కొత్త పాత్రల్లో మరింత మెరుగైన నటన చూపిస్తున్నారు.ఆమె రానున్న రోజులలో మరింత ఎత్తుకి ఎదగాలని, జీవితంలో మరోసారి అలాంటి పిచ్చి ఆలోచనలు దగ్గరకు రానివొద్దని నెటిజన్స్ సలహాలు ఇస్తున్నారు.

# ఎర్రటి చీరలో సామ్.. స్టన్నింగ్ లుక్స్!




స్టైలిష్ లుక్స్‌లో ఎప్పుడూ టాప్‌లో ఉండే సమంత తన లేటెస్ట్ ఫోటోషూట్ తో మరోసారి సోషల్ మీడియాలో ట్రెండ్ సెట్ చేసింది. రెడ్ శారీ, హెవీ డిజైన్ ఉన్న బ్లౌజ్‌తో యాక్టివ్‌గా స్ట్రీట్‌లో వాక్ చేసిన ఫోటోలు చూసిన నెటిజన్లు, "సామ్ ఇన్ ఫైర్ మోడ్" అంటూ కామెంట్ల వర్షం కురిపిస్తున్నా రు. డెట్రాయిట్ వీధుల్లో ప్రాజెక్టు షూటింగ్ సమయంలో తీసిన ఈ స్టన్నింగ్ లుక్ ఆమె న్యాయేజ్ ఫ్యాషన్‌కు బ్రాండ్ అంబాసడర్ అని మరోసారి రివీల్ చేసింది. ఈ లుక్‌లో సమంత ధరించిన రెడ్ చీరకు పర్ఫెక్ట్‌గా మ్యాచ్ అయిన బ్లౌజ్ డిజైన్, అలాగే హైరస్టైల్, మేకప్ అన్ని మినిమల్ గా ఉండటమే కాకుం డా క్లాస్‌నెస్‌తో స్టైల్ బ్లెండ్ అయినట్టుగా కనిపించింది. నడకలో ని ఆ కాన్ఫిడెన్స్, ఫేస్‌లో ఆ కళ ఆమె అందాన్ని మరో లెవెల్ కు తీసుకు వెళ్లాయి లక్షల్లో లైక్స్, వేలల్లో కామెంట్స్ రావడంతో ఆమె ఫాలోయింగ్ ఏ రేంజ్‌లో ఉందో చెప్పుంది. ఇక సమంత కెరీర్‌పరంగా ప్రస్తుతం బిజీగా ఉంది. ప్రస్తుతం రక్త బ్రహ్మాండ అనే ప్రాజెక్టుతో పాటు ఓ షో హోస్ట్ చేయబోతున్నట్లు టాక్. ఇటీవలే హెల్త్ ఇష్యూస్ నుంచి రికవరీ అయి మళ్లీ ఫిట్‌గా రీ ఎంట్రీ ఇచ్చిన సమంత, ఇప్పుడు రెగ్యులర్‌గా వర్కౌట్, పిలేట్స్, స్పిరిచువల్ ట్రావెల్స్‌తో మెంటల్‌గా స్ట్రాంగ్ గా ముందుకు సాగుతోంది. ఆమె లైఫ్ స్టైల్ యూత్‌కు పెద్ద ఇన్‌స్పిరేషన్. పర్సనల్, ప్రొఫెషనల్ లైఫ్‌లో ఎప్పుడూ ఓపెన్‌గా ఉంటూ, కొత్తగా ఏదైనా ట్రై చేయడంలో ముందుండే సమంత, ఇప్పుడు మళ్లీ తన ఫోటోషూట్‌లు, హెల్త్ అప్‌డేట్స్‌తో సోషల్ మీడియాలో జోరుగా కొనసాగుతోంది. ప్రత్యేకించి ఈ రెడ్ చీర లుక్ ఆమెను మళ్లీ ట్రెండింగ్‌లోకి తీసుకొచ్చింది. ఫ్యాన్స్ అయితే "ఈ లుక్‌తో మళ్లీ సినిమాల్లో బోల్డ్ రోల్స్ చేస్తున్న సమంతని చూడాలని ఉంది" అని అంటున్నారు.

# హరిహర వీరమల్లు సినిమాకి కొత్త కష్టాలు..




పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ ప్రధాన పాత్రలో నటించిన భారీ పాన్ ఇండియా హిస్టారికల్ ఫిక్షన్ మూవీ 'హరి హర వీరమల్లు'. ఈ చిత్రం ఎట్టకేలకు జూలై 24న విడుదలకు సిద్ధమైంది. ఈ నేపథ్యంలో, చిత్రంపై పలు వివాదాలు చెలరేగుతున్నాయి. ఈ సినిమా కథ చరిత్రను వక్రీకరిస్తోందంటూ తెలంగాణ బీసీ సంఘాలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. హైదరాబాద్‌లో బీసీ సంఘాల నేతలు మీడియాతో మాట్లాడుతూ .. చరిత్రలో కనిపించని కథలను మిక్స్ చేసి, ప్రజలని తప్పుదారి పట్టేలా ఈ సినిమాని తెరకెక్కించారు. ఇది నిజానికి తెలంగాణ పోరాట వీరుడు పండుగ సాయన్న జీవితాన్ని ప్రేరణగా తీసుకుని రూపొందించిన సినిమా. కానీ దర్శక, నిర్మాతలు ఇది హరి హర రాయలు,బుక్క రాయల కథ అని చెబుతున్నారు. నిజానికి ఇది చరిత్రతో అస్సలు సంబంధం లేని కల్పిత కథ.హరి హర రాయలు కాలం (1336-1406) లో ఉండగా, ఔరంగజేబు (1658-1707) మధ్య 300 ఏళ్ల తేడా ఉంది. అయినా సినిమా ట్రైలర్‌లో పవన్ కళ్యాణ్ ఔరంగజేబుతో పోరాడినట్లు చూపించారు. ఇది ఎలా సాధ్యం చార్మినార్ కూలీ కుతుబ్ షా ద్వారా 1591లో నిర్మించబడింది. కానీ సినిమాలో ఇది కూడా హరి హర రాయల సమకాలీనంగా చూపించారు. ఈ విషయంలో 200 ఏళ్ల గ్యాప్ ఉందని వారు గుర్తు చేస్తున్నారు. కోహినూర్ వజ్రంను హరి హర వీరమల్లు ఔరంగజేబు నుండి తిరిగి తీసుకున్నట్లు చూపించడమూ చరిత్రలో ఎక్కడా కనిపించదు. పండుగ సాయన్న నిజ జీవితానికి ఆధారంగా సినిమా తీసి ఉంటే, సరైన పరిశోధన చేసి, నిజ చరిత్రను చెప్పాలి.

# గిల్‌ను లెక్కచేయని జడేజా.. వద్దని చెబుతున్నా వినకుండా..!



**న్యూఢిల్లీ-నవభూమి:** టీమిండియా కొత్త కెప్టెన్ శుబ్‌మన్ గిల్ జట్టులోని అందర్నీ కలుపుకొని పోతున్నాడు. లీడ్స్‌తో పాటు ఎడ్జ్‌బాస్టన్ టెస్ట్‌లోనూ ఇది స్పష్టంగా కనిపించింది. సీనియర్లతో పాటు జూనియర్ ఆటగాళ్లతోనూ అతడు జోవియల్‌గా ఉండటం, వాళ్ల దగ్గర నుంచి జట్టుకు కావాల్సిన ప్రదర్శనను రాబట్టడం హైలైట్‌గా నిలిచింది. అయితే అంతా బాగానే ఉన్నా గిల్ మాటను జడేజా పట్టించుకోకపోవడం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. సీనియర్లు అందరూ శుబ్‌మన్‌కు సహకరించగా.. జడ్డూ మాత్రం తగ్గేదేలే అంటూ కొత్త కెప్టెన్ చెప్పిన వినలేదు. తనకు నచ్చింది చేసుకుంటూ పోయాడు. అసలు గిల్-జడ్డూ మధ్య ఏం జరిగింది? అనేది ఇప్పుడు చూద్దాం..ఎడ్జ్‌బాస్టన్ టెస్ట్ ఐదో రోజు ఇంగ్లండ్ బ్యాటింగ్ చేస్తోంది. ఆ జట్టు సారథి బెన్ స్టోక్స్ క్రీజులో ఉన్నాడు. దీంతో అతడ్ని ఔట్ చేసేందుకు భారత బౌలర్లంతా తీవ్రంగా ప్రయత్నించారు. డ్రా చేయాలనే ఉద్దేశంతో ఆడిన స్టోక్స్.. వికెట్ కాపాడుకుంటూనే వీలు కుదిరినప్పుడు బౌండరీలు బాదుతూ వచ్చాడు. దీంతో అతడి కోసం స్పిన్నర్లను రంగంలోకి దింపాడు కెప్టెన్ గిల్. ఒకవైపు జడేజా, మరోవైపు సుందర్‌తో అటాక్ చేయించాడు. అందుకు తగ్గట్లే ఫీల్డింగ్ సెట్ చేశాడు. కానీ జడేజా మాత్రం గిల్ మాట వినలేదు. అక్కడ ఫీల్డర్ ఎందుకంటూ సారథితో వాదించాడు.

# అప్పుడు ఒకలా.. ఇప్పుడు మరోలా..! ఆ నోళ్లు ఎందుకు మూతబడ్డాయి?



**న్యూఢిల్లీ-నవభూమి:** ఎడ్జ్‌బాస్టన్ టెస్ట్‌కు ముందు టీమిండియా హెడ్ కోచ్ గౌతం గంభీర్, కొత్త కెప్టెన్ శుబ్‌మన్ గిల్‌పై పెద్ద పెట్టున విమర్శలు వచ్చాయి. సుదీర్ఘ ఫార్మాట్‌కు గంభీర్ కోచ్‌గా పనికిరాడని.. అతడి కోచింగ్‌లో టెస్టుల్లో అపజయాలే తప్ప సాధించిందేమీ లేదనే కామెంట్స్ వినిపించాయి. యువ సారథి శుబ్‌మన్ గిల్ టీమ్‌ను సమర్థంగా నడిపించలేడని.. అతడి స్థానంలో మరో సీనియర్ ఆటగాడికి కెప్టెన్సీ ఇవ్వాలనే డిమాండ్స్ వచ్చాయి. అయితే వీటన్నింటికీ ఒకే ఒక్క మ్యాచ్‌తో సాలిడ్ ఆన్సర్స్ దొరికాయి. ఒక్క విజయంతో విమర్శించిన నోళ్లు అన్నీ మూసుకుపోయాయి.రెండో టెస్ట్‌లో కెప్టెన్ గిల్ చెలరేగి ఆడాడు. తొలి ఇన్నింగ్స్‌లో 269 పరుగులు, రెండో ఇన్నింగ్స్‌లో 161 పరుగుల ధనాధన్ నాక్స్‌తో అదరగొట్టాడు. ఓవర్సీస్‌లో పరుగులు చేయలేడనే అపవాదుకు రెండు టెస్టులతో స్ట్రాంగ్ రిప్లయ్ ఇచ్చాడు గిల్. అలాగే కెప్టెన్సీ ఒత్తిడిని బ్యాటింగ్‌లో చూపించనని పెర్ఫార్మెన్స్ ద్వారా క్లియర్ స్టేట్‌మెంట్ ఇచ్చేశాడు. బౌలర్లకు ఎప్పటికప్పుడు సూచనలు ఇస్తూ, వారికి నచ్చినట్లు ఫీల్డింగ్ సెట్ చేస్తూ కావాల్సిన ఫలితం రాబట్టాడు. తద్వారా కెప్టెన్‌గానూ తనకు తిరుగులేదని అతడు నిరూపించుకున్నాడు.పక్కా ప్లానింగ్‌తో..గంభీర్ కూడా కోచింగ్‌లో తాను తక్కువ కాదని.. ఇతర ఫార్మాట్లలాగే టెస్టుల్లోనూ తాను సక్సెస్ అవుతానని చెప్పకనే చెప్పేశాడు. కెప్టెన్ గిల్‌తో కలసి అతడు పన్నిన వ్యూహాలు అన్నీ విజయవంతం అయ్యాయి.

# గిల్ సేనను చూసి జడుసుకున్న కమిన్స్..



**న్యూఢిల్లీ-నవభూమి:** పతి సెషన్ రసవత్తరంగా సాగుతూ వచ్చిన ఎడ్జ్‌బాస్టన్ టెస్ట్ ఎట్టకేలకు ముగిసింది. దాదాపుగా అన్ని సెషన్లలో ఆధిపత్యం కనబర్చుతూ వచ్చిన టీమిండియా ఏకంగా 336 పరుగుల భారీ తేడాతో విజయకేతనం ఎగురవేసింది. ఇంగ్లండ్‌ను అన్ని విభాగాల్లో చిత్తు చేసింది భారత్. ఈ గెలుపుతో 5 టెస్టుల సిరీస్‌ను 1-1తో సమం చేసింది గిల్ సేన. ఈ విక్టరీతో టీమిండియా అభిమానులు సంతోషంలో మునిగిపోయారు. బ్యాటింగ్‌లో కెప్టెన్ శుబ్‌మన్ గిల్, రిషబ్ పంత్, రవీంద్ర జడేజా, కేఎల్ రాహుల్ మెరుపులు.. బౌలింగ్‌లో ఆకాశ్‌దీప్, మహ్మద్ సిరాజ్ అదరగొట్టిన తీరును ఎంజాయ్ చేస్తున్నారు. అయితే భారత ఆటతీరును చూసి ఆస్ట్రేలియా కెప్టెన్ ప్యాట్ కమిన్స్ భయపడుతున్నాడు. వామ్మో.. వీళ్లతో మ్యాచ్ వద్దని అంటున్నాడు.బౌలింగ్ చేయను..భారత్-ఇంగ్లండ్ సిరీస్ మ్యాచుల్ని తాను చూడటం లేదన్నాడు కమిన్స్. అయితే అక్కడి పిచ్‌లు, నమోదవుతున్న స్కోర్లు తనను భయపెడుతున్నాయని తెలిపాడు. భారత బ్యాటర్లు రెచ్చిపోయి ఆడుతున్నారని.. ఇలాంటి వికెట్లపై బౌలింగ్ చేయాలని ఏ బౌలర్ కూడా అనుకోడన్నాడు కమిన్స్. 'ఈ తరహా పిచ్‌లపై బౌలింగ్ చేయాలని ఎవరూ కోరుకోరు. వికెట్ మరీ ఇంత ఫ్లాట్‌గా ఉండటం నాకు నచ్చలేదు. అయితే ఈ సిరీస్ పోటాపోటీగా సాగుతుందని మాత్రం చెప్పగలను' అని కమిన్స్ చెప్పుకొచ్చాడు.

Printed,Published & Owned by SHAIK SHAHANAZ, Printed at SUPER PRINTERS Web offset Printers 2-3-655/C/118,Azad Nagar,Amberpet Circle 23,HYDERABAD -500113(T.S.), and Published D.No: 10-2-287/1/,Ground Floor,Santhinagar,A.C Guards,Masabtank,HYDERABAD - 500028,State TELANGANA (India). Editor: **SHAIK SHAHANAZ**, Phone: 9246213493,Email : navabhoomidaily@gmail.com,navabhoomi1@gmail.com **RNI No: TEL TEL: 82083**